సంపుటి : 78 సంచిక : 19 పుటలు : 52

# జాగృతి

కలి 5127 - శ్రీ విశ్వావసు ఫాల్గుణ శుద్ధ షష్ఠి
23 ఫిబ్రవరి-01 మార్చి 2026
వెల : ₹20/-





## పార్లమెంట్‌లో చీకటి పక్షం



## శంకరుల అద్వైతంలో “ఆత్మ” నిర్భరతే ఆధునిక ఆత్మనిర్భర భారతం

26వ పేజీలో..

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.



# సరిహద్దులో మోదీ సాహసం



అసోంలో రూ.100 కోట్లతో నిర్మితమైన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ–ఈఎల్ఎఫ్‌పై భారత వైమానిక దళానికి చెందిన సీ–130 జే యుద్ధ విమానం ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ ఫిబ్రవరి 14న సాహసోపేతమైన ల్యాండింగ్ చేశారు. 37వ నంబరు జాతీయ రహదారిపై 4.2 కి.మీ.ల మేర నిర్మితమైన ఈఎల్ఎఫ్‌పై ల్యాండ్ అయిన తొలి భారత ప్రధానిగా చరిత్ర సృష్టించారు. ఈ సందర్భంగా భారత వైమానిక దళ విన్యాసాలను అసోం సీఎం హిమంతబిశ్వ శర్మ, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌తో కలిసి ఆయన తిలకించారు.









# భారతీయ గడ్డపై ఏఐ సదస్సు




ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ -2026 పేరిట ఫిబ్రవరి 16 నుంచి 20వరకు తొలిసారిగా అంతర్జాతీయ సదస్సుకు భారత్ ఆతిథ్యమిచ్చింది. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి 20కి పైగా దేశాలకు చెందిన అధినేతలు, 60 మంది మంత్రులు, ఉప మంత్రులు సహా వేర్వేరు ప్రభుత్వాలకు చెందిన 100 మంది ప్రతినిధులు, కృత్రిమ మేధ(ఏఐ) రంగానికి చెందిన 500 మంది అంతర్జాతీయ దిగ్గజాలు, విద్యావేత్తలు, పరిశోధకులు హాజరయ్యారు. సదస్సుకు కీలకమైన వేదిక అన్నట్టుగా 18న ఐఐటీ-హైదరాబాద్ భాగస్వామ్యంతో ఏఐ-దాని ప్రభావం అనే అంశంపై పరిశోధక సంగోష్ఠి జరిగింది. 19న సదస్సును ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. సమ్మిళితమైన, బాధ్యతాయుతమైన ఏఐ పట్ల భారత్ దృక్పథానికి అంతర్జాతీయ సహకారం కోసం పిలుపునిచ్చారు. ఏఐ పరంగా గ్లోబల్ సౌత్‌కు అవసరమైన ఫ్రేమ్‌వర్క్‌లు, అంతర్జాతీయ భాగస్వామ్యాల బలోపేతం, సమ్మిళిత ఆర్థిక వృద్ధిపై ఫలవంతమైన సదస్సులు, చర్చలు, మంతనాలతో సదస్సు ముగిసింది.



Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | **9959991304** |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 92001006140532 5, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

**వం**దేమాతరం గీత చరణాలంటే భారతీయుల పోరాటాగ్నిని రగిలించిన చెకుముకి రాళ్లు. ఆ ఆరు చరణాలు గుండె గుండెలో జాతీయతను ఆవాహన చేసిన మహామంత్రాలు. అది కేవలం గేయం కాదు, వేయేళ్ల బానిసత్వం ఇంకానా, ఇక చాలు అని ఒక కలం వేసిన పెనుకేక. స్వాతంత్ర్య కాంక్షకు స్వాగత వచనం. అలాంటి వందేమాతరం గీతంలోని అన్ని చరణాలను ఇకపై జాతి మొత్తం కలసి పాడుకోవలసి ఉంటుంది. భారత జాతీయ కాంగ్రెస్ 1937లో ఆ గేయం నుంచి కత్తిరించిన నాలుగు చరణాలను కలిపి మొత్తం ఆరు చరణాలను ఇక నుంచి ఆలపించాలి. 190 సెకన్లు లేదా మూడు నిమిషాల పది సెకన్ల ఆ గీతం వింటున్నప్పుడు సవినయంగా నిలబడాలని కొత్త నిబంధనలు చెబుతున్నాయి. ఇలాంటి ఒక ఆదేశం కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నుంచి వెలువడడం ఎక్కువ మందికి సంతోషం కలిగించేదే. కొందరికి కంటగింపు కూడా. ఆ గొప్ప గేయం పుట్టి 150 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని ఇటీవలనే భారతజాతి సగర్వంగా నిర్వహించుకున్నది. ఆ సందర్భంగానే ఇంతకాలం పాడుతున్న రెండు చరణాలు కాకుండా, ఆ మహా గేయాన్ని గౌరవించుకుంటు మహాకవి బంకించంద్ర రాసిన అన్ని చరణాలూ కలిపి పూర్తిగా ఆలపించాలన్న నిబంధనను ఫిబ్రవరి 6, 2026న కేంద్ర ప్రభుత్వం తెచ్చింది. జనగణమన ఆలాపనకు ముందే వందేమాతరం గేయాన్ని ఆలపించాలి. సాధారణంగా జనగణమనను కార్యక్రమాల చివరన ఆలపించుకుంటాం. జాతికి ఆ రెండూ రెండు కళ్ల వంటివే. రెండూ స్ఫూర్తిదాయకాలే. ఇద్దరు మహాకవులు ఆధునిక భారతజాతికి అందించిన అక్షర ఆయుధాలే. స్వతంత్ర భారతికి అపురూప కానుకలే.

ప్రభుత్వం నిర్వహించే పదవీ ప్రమాణ స్వీకారోత్సవాలలో ఈ గీతం ఇకపై పూర్తిగా ఆలపించాలి. రాష్ట్రపతి కార్యక్రమానికి హాజరైతే వారు వచ్చినప్పుడు, కార్యక్రమం ముగించుకుని వెళ్లినప్పుడు కూడా వందేమాతరం ఆలపించాలి. ఆకాశవాణి, దూరదర్శన్‌లలో రాష్ట్రపతి ప్రసంగానికి ముందు, వెనుక ఆ గీతం వినిపించాలి. గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్ల కార్యక్రమాలకు కూడా ఇదే వర్తిస్తుంది. ఏదైనా ఊరేగింపులో జాతీయపతాకం ఉంటే, వెనుక వందేమాతరం వినిపించాలి.

**శాలివాహన 1947 శ్రీ విశ్వావసు ఫాల్గుణ శుద్ధ షష్టి**

## లోపలి పేజీలలో...




6లో

ముఖపత్ర కథనం

**పార్లమెంట్‌లో చీకటి పక్షం**

ధారావాహిక నవల

24 **గణపతిదేవుడు**

– మత్తి భానుమూర్తి



20లో

సమాధానం

**శంకరుల అద్వైతంలో "ఆత్మ" నిర్భరతే ఆధునిక ఆత్మనిర్భర భారతం**



26లో

# జాగృతి

## సంపాదకీయం

దీని అర్థం జనగణమన అధినాయక జయహే గీతాన్ని ఆలపించనవసరం లేదని కాదు. ఆ గీతానికి ముందు వందేమాతరం ఆలపించడం లేదా, వాద్యగోష్ఠితో వినిపించాలి. పాఠశాలలలో ఈ గీత ఆలాపన అనివార్యం. తరగతుల ఆరంభానికి ముందే పాడుకోవాలి. రాజ్యాంగంలోని 51 ఏ (ఏ) అధికరణం జాతీయగీతాన్ని, జాతీయపతాకాన్ని గౌరవించాలని ఆదేశిస్తున్నది.

నవంబర్ 7,1875న (అక్షయ నవమి) బంకించంద్ర ఈ గేయం రచించారు. తరువాత ఆయన రాసిన ప్రఖ్యాత నవల 'ఆనందమఠం'లో ఈ గేయానికి చోటు కల్పించారు. జనవరి 24, 1950న భారత రాజ్యాంగ పరిషత్ ఈ గేయాన్ని అధికారికంగా జాతీయగీతంగా స్వీకరించింది. ఆరు చరణాల ఈ

## ఆరు చరణాల వందేమాతరం

గీతంలో నాలుగు చరణాలను తొలగించడం ద్రోహమే. ఇప్పటికి ఆ ఘోర తప్పిదాన్ని సరిదిద్దుకున్నాం. మొదట జాతీయగీతాన్ని విభజించారు. తరువాత దేశ విభజన జరిగింది అంటూ ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ కూడా వ్యాఖ్యానించిన సంగతి తెలిసినదే. చరిత్రలోని ఆ దురదృష్టకర క్షణాల మీద ఇది సరైన తీర్పు. ఆ నిర్ణయం కేవలం కవికీ, ఆయన కవితా సృష్టికీ జరిగిన అవమానం మాత్రమే కాదు, ఆ గీతమే స్ఫూర్తిగా సాగిన జాతీయోద్యమానికి సైతం అపచారం చేయడమే. కొత్త నిబంధన ప్రకారం ఏ వ్యక్తి అయినా జాతీయ గీతాన్ని అవమానించినా, పాడేవారికి ఆటంకాలు కల్పించినా మూడేళ్ల వరకు జైలుశిక్ష అనుభవించవలసి ఉంటుంది. సినిమాలలో లేదా డాక్యుమెంటరీలలో వందేమాతరం గేయం వినిపిస్తే, తొక్కిసలాటను నివారించడానికి అప్పుడు మాత్రం లేచి నిలబడాలన్న నిబంధనను సడలించారు.

వందేమాతర గేయాన్ని 1896 నాటి కలకత్తా కాంగ్రెస్ సమావేశాలలో సాక్షాత్తు గురుదేవ్ రవీంద్రనాథ్ టాగూర్ పాడారు. 1905 నాటి వారణాసి కాంగ్రెస్ సమావేశాలలో అన్ని సామాజిక, ఉద్యమ సందర్భాలకు పాడాలని నిర్ణయం తీసుకున్నారు. ఇది ఒక ప్రార్థనాగీతం స్థాయి నుంచి ఒక సమర నినాదంగా మారినది మాత్రం ఆగస్ట్ 7, 1905న. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా విద్యార్థులు కలకత్తా టౌన్‌హాలుకు ఊరేగింపుగా వెళ్లినప్పుడు వందేమాతరం అంటూ నినదించారు. ఆపై వందేమాతరం అనడమే రాజద్రోహమైపోయింది. 1907లో మేడమ్ కామా జర్మనీ (స్టగార్ట్)లో ఒక అంతర్జాతీయ సమావేశంలో మూడు రంగుల జెండా రూపొందించి ఎగుర వేశారు. దాని మీద కనిపించే అక్షరాలు వందేమాతరం. 1909లో మదన్‌లాల్ ధింగ్రా లండన్‌లో ఉరికంబం ఎక్కి, ఉరితాడును తగించిన క్షణంలో ఆయన కంఠం నుంచి వచ్చిన తుది మాట వందేమాతరం. వందేమాతరం ఆ తరానికి సమరనాదం. ఈ తరం తలెత్తుకు తిరిగేటట్టు చేసే ఉద్యమ జ్ఞాపకం.

ఇప్పుడు కూడా వందేమాతర గేయాన్ని వ్యతిరేకిస్తున్న వాళ్లు గుర్తించ వలసినది ఒక్కటే- భారత విభజన, పాకిస్తాన్ ఏర్పాటు కోరుకున్న వాళ్లు నాడు ఏంచేశారో ఇప్పుడు తామూ అదే చేస్తున్నామన్న స్పృహ అవసరం. అదే వేర్పాటువాదాన్ని కొనసాగించడం మహా తప్పిదమన్న ఇంగిత జ్ఞానం ఉండాలి. మాతృమూర్తిని గౌరవించమని చెప్పని మతం మాతృభూమిని గౌరవించమంటుందని అనుకోనక్కరలేదు. కాబట్టి అలాంటి మతాన్ని అనుస రించేవారి అభ్యంతరాలను ఇకపై పట్టించుకోనవసరం కూడా లేదు. మనం తల్లికి సమున్నత గౌరవం ఇస్తాం. వందేమాతరం గీతం భావన అదే. మన మాతృభూమి గొప్పది అని చెప్పే గేయం మనకు నిశ్చయంగా మేలు చేసేదే. అందుకే ఇలాంటి సముచిత నిర్ణయం తీసుకున్న కేంద్రానికి ధన్యవాదాలు చెబుతూ, కొత్త నిబంధనను తు.చ తప్పకుండా ఆచరిద్దాం. ★

23 ఫిబ్రవరి 2026, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్



38లో

కథ

**అమ్మతనం!**

- డాక్టర్ ఎమ్. సుగుణరావు

దర్శనం





| | | |
|---|---|---|
| వాట్సప్, మెటాలకు సుప్రీంకోర్టు చీవాట్లు (జాతీయం) | - | 12 |
| బీజేపీకి తొలి మేయర్ పీఠం (తెలంగాణ) | - | 14 |
| సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా.. రాష్ట్ర బడ్జెట్ (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| దేశ భద్రతతో కాంగ్రెస్ రాజకీయాలు (చర్చ) | - | 18 |
| భారతీయ మూలాలకు చీడపురుగు! (వైపరీత్యం) | - | 24 |
| ... భారతమాత సేవకు అంకితమైన రుషి (ఆర్‌ఎస్ఎస్-100) | - | 30 |
| ... ఒకరోజు చక్రవర్తి-గౌడుగుపాలుడు (గళమెత్తిన గతం) | - | 32 |
| జీవితం మీద ఆశను పెంచిన క్షణాలు (స్పందన) | - | 34 |
| టీ-20 ప్రపంచకప్‌లో భారతీయం! (క్రీడ) | - | 43 |
| వినోదాన్ని పంచలేకపోయిన 'ఫంకీ' (సినిమా) | - | 50 |



ప్రథమ ప్రధాని నెహ్రూ వలెనే ఆయన భారతీయతకు బద్ధ వ్యతిరేకి. ఇందిరాగాంధీ నియంత పోకడలను పుణికిపుచ్చుకున్నవారు. రాజీవ్‌గాంధీ మాదిరిగానే ప్రధాని కుర్చీ దక్కే వరకు రాజకీయాలు ఆయనకు కేవలం హాబీ. ఇంటిపేరు గాంధీగా చలామణీ అవుతున్నా, నెహ్రూ కుటుంబ వారసత్వమే రాహుల్‌లో అణువణువునా కనిపిస్తుంది. ఈ బడ్జెట్ సమావేశాలలో

# పార్లమెంట్‌లో

ఈ బడ్జెట్ సమావేశాలు రెండు దశలుగా ఏర్పాటు చేశారు. తొలి దశ పూర్తయింది. జనవరి ఆఖరు నుంచి ఫిబ్రవరి మధ్య వరకు సాగిన ఆ పదహారు రోజులు పార్లమెంట్ చరిత్రలోనే చీకటియుగం. వివిధ విన్యాసాలతో గతంలోను రాహుల్, ఆయన పార్టీ పార్లమెంట్‌ను స్తంభింప చేశాయి. కానీ ఇప్పుడు చేసిన పని మాత్రం అత్యంత హేయమైనది. రాహుల్ అధికార కాంక్షను, పార్ల మెంట్‌ను వీధి పోరాటాలకు బరిగా మార్చేయాలన్న దురద కాంగ్రెస్ పార్టీలో స్పష్టంగా కనిపించాయి. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని సస్పెండ్ చేయాలని, ఎన్నికలలో పోటీ చేసే అవకాశం లేకుండా శాశ్వతంగా బహిష్కరించాలని బీజేపీ సభ్యుడు నిశికాంత్ దూబె ఫిబ్రవరి 12న ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. నిజానికి అంతకు ముందే ప్రతిపక్ష నేత మీద హక్కుల తీర్మానం ప్రవేశపెట్టాలని అధికారపక్షం భావించింది. ఇన్‌స్టింటివ్ మోషన్ ప్రవేశపెడుతూ దూబె తీర్మానం తెచ్చారు కాబట్టి కేంద్రం తన ప్రయత్నాన్ని నిలిపివేసింది. మొదట రాష్ట్రపతి ప్రసంగం మీద విపక్షం స్పందన గురించి మాట్లాడడానికి సమయం కేటాయిస్తే, భారత సైనిక దళాల మాజీ ప్రధాన అధికారి జనరల్ ఎంఎం నరవణె పుస్తకం గురించి సభలో ప్రస్తావించి రాహుల్ పెద్ద రభస సృష్టించారు. ఇందుకోసం దాదాపు ఆరురోజులు సభా సమయం గాలిలో కలసి పోయింది. తరువాత బడ్జెట్ 2026–27 మీద ప్రసంగించడానికి సమయం కేటాయించినప్పుడు భారత్– అమెరికా వాణిజ్య ఒప్పందం గురించి లేవనెత్తి హీనమైన ధోరణిని ప్రదర్శించారు. భారతమాతను, దేశాన్నీ అమ్మేశారు, సిగ్గులేదా వంటి తీవ్ర పదజాలంతో ఒళ్లు తెలియకుండా అధికార పక్షం మీద దాడికి దిగారు. ఈ మధ్యలో జరిగిన సంఘటనలు కూడా పార్లమెంట్ గౌరవాన్ని, భారత్ ప్రతిష్టను మంట గలిపేవి గానే ఉన్నాయి. అందులో మొదటిది, ప్రధాని స్థానాన్ని ఎనిమిది మంది కాంగ్రెస్ మహిళా ఎంపీలు చుట్టుముట్టడం. ఇది ముమ్మాటికీ ప్రధాని నరేంద్రమోదీ మీద దాడి కోసం జరిగిన కుట్రేనని బీజేపీ ఆరోపించింది. రెండు, స్పీకర్ చాంబర్‌లోకి 20 మంది వరకు కాంగ్రెస్ ఎంపీలు చొరబడి ఆయనను దుర్భాషలాడడం, బెదిరించడం; బీజేపీ సభ్యుడిని పార్లమెంట్ ప్రాంగణంలోనే ద్రోహి మిత్రుడా! అని రాహుల్ పలకరించడం, కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, ప్రహ్లాద్ జోషి మాట్లాడు తున్న విలేకరుల సమావేశంలోకి అడ్డంగా చొరబడి కేంద్రమంత్రులతో వెకిలిచేష్టలు చేయడం వరసగా జరిగిపోయాయి. 2024 ఎన్నికల తరువాత రాహుల్ విపక్షనేత అయిన నాటి నుంచి పార్లమెంట్‌లో విపక్ష నేతగా కాకుండా, ప్రజాస్వామ్య వనంలో విషక్రిమి వలె ప్రవరిస్తున్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ మహిళా ఎంపీల వైఖరి చూసిన తరువాత స్పీకర్ ఓం బిర్లా ప్రధాని సభకు రావడం మంచిది కాదని సూచించ వలసి రావడం నిశ్చయంగా ఒక దౌర్భాగ్యమే. ఆ పార్టీ ఎంపీలను అందుకు ప్రోత్సహించినవారే రాహుల్ అని బీజేపీ సభ్యులు నిర్ద్వంద్వంగా చెబుతు న్నారు. ఈ పరిణామాలన్నీ రాహుల్ మీద వేటు వేయక తప్పని పరిస్థితిని కల్పించాయి. మొదట హక్కుల తీర్మానం ప్రవేశపెట్టాలని అనుకున్నా, అంతిమంగా బీజేపీ సభ్యుడు నిశికాంత్ దూబె ప్రవేశపెట్టిన ఇన్‌స్టింటివ్ మోషన్ చివరి అస్త్రంగా మారే అవకాశం కనిపిస్తున్నది.

తానో గంభీర అంశాన్ని ఈ జాతికి వివరించ దలుచుకున్నట్టు రాహుల్ హావభావాలు ప్రదర్శించ వచ్చు. కానీ దేశంలో ఎక్కువ మంది ఆయనను ఒక స్టాండప్ కమేడియన్‌గానే పరిగణిస్తున్నారు. ఈ బడ్జెట్ సమావేశాలలో రాహుల్ ధోరణి అత్యంత అనాగ రికంగా, అప్రజాస్వామికంగా ఉందని సభలోనే పలువురు బీజేపీ సభ్యులు ఆరోపించడం కూడా సత్యదూరం కాదు. ఒక ఉన్మాదం ఆయనలో దేశమంతా చూసింది. సభా కార్యక్రమాలను అడ్డు కోవడానికి ఆయన తోటి ఎంపీలను ప్రేరేపించారని కూడా అధికార పార్టీ ఆరోపించింది. స్పీకర్‌ను కూడా 'యార్' అంటూ పిల్ల భాషతో మాట్లాడడం, స్పీకర్ స్థానంలో ఉన్న జగదంబికా పాల్‌ను మీరు ఒకప్పుడు మా పార్టీయే కదా, నేను దూకుడుగా పోను లెండి అనడం రాహుల్‌లోని అత్యంత చౌకబారుతనాన్ని బయటపెట్టాయి. ఈ బడ్జెట్ సమావేశాలకు రెండు దశలు ఉన్నాయి. తొలిదశ సమావేశాలు జనవరి 28 నుంచి, ఫిబ్రవరి 13 వరకు జరిగాయి. రెండో దశలో మార్చి 9 నుంచి ఏప్రిల్ 2వరకు జరుగుతాయి.

పార్లమెంట్ సభ్యునిగా అనర్హునిగా రాహుల్‌ను ప్రకటించాలని, జీవితకాలం పోటీకి కూడా అనర్హత ప్రకటించాలన్న తన వాదనకు బీజేపీ సభ్యుడు నిశికాంత్ ఫిబ్రవరి 13న పదును పెంచారు. రాహుల్

లోక్‌సభలో రాహుల్ గాంధీ అంత రంగం పూర్తిగా బయటపడింది. కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ ఆరోపించినట్టు ఆయన దేశంలో అంతర్యుద్ధాన్ని కోరుకుంటున్నారు.

పార్లమెంట్‌కు ఉండే అత్యున్నత చట్టసభ గౌరవాన్ని ధ్వంసం చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు.

దేశ గౌరవాన్ని భంగపరచడానికి ఇంతకాలం విదేశాలలో వేదికలను వెదికిన రాహుల్ ఇప్పుడు మన పార్లమెంట్‌లోనే అలాంటి ఏహ్యమైన చర్యకు పాల్పడ్డారు. బీజేపీ సభ్యుడు రవనీత్ బిట్టును ద్రోహి మిత్రుడా అని పిలిచి అవమానించాలని, దేశద్రోహివి అని బిట్టు తిట్టినా, ముఖం తుడిచేసుకుని వెళ్లిపోగల సిగ్గులేనితనం ఆయన సొంతం. ఇందుకు తిరుగులేని నిదర్శనం 'అమ్మకాల' గురించి పేలడం.

'భారతమాతను అమ్మేశారు!' అన్న మాట ఎంత విధ్వంసకర రాజకీయ నాయకుడైతే అనగలడు! ఆ మాట రాహుల్ అలవోకగా అన్నారు.

# చీకటి పక్షం

అనైతిక ప్రవర్తన దృష్ట్యా, దేశ వ్యతిరేక శక్తుల ప్రయోజనాల కోసం పని చేస్తూ ఉండడం వల్ల లోక్‌సభ ఈ చర్య తీసుకోవాలని ఆయన కోరారు. తనపై పార్లమెంట్‌లో ఎలాంటి తీర్మానం తెచ్చినా, తన వైఖరి నుంచి అంగుళం కూడా వెనక్కి తగ్గేది లేదని రాహుల్ గాంధీ బీరాలు పలికారు. మా అన్నను మీరు బెదిరించలేరంటూ ఆయన సహోదరి ప్రియాంకా వాద్రా కూడా గప్పాలు కొడుతున్నారు.




పుస్తకానికి అనుమతి లేదు. నా అల్లరికి ఉంటుంది

రాహుల్ విపక్ష నాయకుడు కాదని, దొంగల నాయకుడు (థగ్గరీ గ్యాంగ్) అని నిశికాంత్ తీవ్ర విమర్శ చేశారు. ఈ దొంగల ముఠా ధ్యేయం దేశంలోనే ఉంటూ, దీనిని విచ్ఛిన్నం చేయడమేనని కూడా ఆరోపించారు. అసలు అధికారం కోసం రాహుల్ దేశాన్ని విభజించేందుకు కుట్ర పన్ను తున్నారా? అని కూడా దూబె ప్రశ్నించారు. రాహుల్ టుక్డే టుక్డే ముఠా నాయకుడని ఎక్స్ వేదికగాను దుయ్యబట్టారు. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం గురించి ఆయన లోక్‌సభలో చేసిన ప్రసంగం జాతీయ ప్రయోజనాలను ఫణంగా పెట్టిందని కూడా అధికార పక్ష సభ్యులు ఆరోపిస్తున్నారు. కానీ రాహుల్ లేవనెత్తిన అంశాల మీద చర్చకు రాలేక అధికార పక్షం ఆయనను లక్ష్యంగా చేసుకుంటున్నదని విపక్షం ఆరోపిస్తున్నది. రాహుల్ దేశ ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నారని, జార్జ్ సారోస్, ఆయన సంస్థ ఫోర్డ్ ఫౌండేషన్‌తో రాహుల్‌కు సంబంధాలు ఉన్నాయని దూబె బాహాటంగానే ఆరోపించారు. రాహుల్ అనైతిక వర్తనపై పార్లమెంటరీ దర్యాప్తు సంఘం ద్వారా విచారించాలని కూడా కోరారు.

స్పీకర్‌కు ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే రాహుల్ సభలో నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు వ్యాఖ్యానించారు. రాహుల్ ప్రవర్తనను దేశం ఈసడించుకుంటున్నా, సొంత పార్టీ శ్లాఘించక తప్పదు. అందులో భాగమే, రాహుల్ పార్లమెంట్‌లో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారని, ఏనాడూ అన్ పార్లమెంటరీ భాష ఉపయోగించలేదని ఆ పార్టీ ఎంపీ గుర్జీత్ సింగ్ వెనకేసుకొచ్చారు. కానీ కాంగ్రెస్‌లోనే, అందులోను ముస్లిం సభ్యుల నుంచి రాహుల్ వ్యవహార సరళి పట్ల సణుగుడు మొదలయిందన్న వార్తలు కూడా వస్తున్నాయి. పార్టీలో సీనియర్ ముస్లిం నాయకులు షకీల్ అహ్మద్, రషీద్ అల్వీ రాహుల్ ఒక అహంకారి అనే భావిస్తున్నారు. ఆయన ధోరణితోనే బిహార్‌లో 243 స్థానాలు ఉంటే తమ పార్టీకి ఆరు మాత్రమే వచ్చాయని అంటున్నారు. ఇక ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో గుండు సున్న రావడానికీ ఇదే ధోరణి కారణమని కూడా వారు భావిస్తున్నారు.

భారత్ ప్రతిష్టను విదేశాలలో భంగపరచడమే కాదు, లోక్‌సభలో ప్రధాని స్థానాన్ని చుట్టుముట్టవలసిందని మహిళా ఎంపీలను కూడా రాహులే ప్రేరేపించారని సీనియర్ బీజేపీ సభ్యుడు రవిశంకర్ ప్రసాద్ అన్నారు. సైనిక దళాల మాజీ ప్రధాన అధికారి జనరల్ నరవణె పుస్తకాన్ని ఇంకా అచ్చు వేయలేదని సాక్షాత్తు ప్రచురణ సంస్థ వెల్లడించిందని, కాబట్టి నరవణె రచన రాహుల్‌కు ఎలా వచ్చిందో ఆయనే చెప్పాలని రవిశంకర్ ప్రసాద్ కోరారు. సిక్కు ఎంపీని ద్రోహి అనడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్రమంత్రులు ప్రసంగిస్తున్న విలేకరుల సమావేశం లోకి రాహుల్ చొరబడడం మరీ దారుణమని రవిశంకర్ ప్రసాద్ అన్నారు.

రాహుల్ మీద హక్కుల తీర్మానం ప్రవేశపెట్టాలని కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్ కిశోర్ అభిప్రాయ పడ్డారు. విపక్షనేత మీద ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్ దేశంలో అంతర్యుద్ధం తీసుకురావాలన్న దురాలోచనతో ఉన్నారని ఆయన అన్నారు. అతడిని మించిన అబద్ధాలకోరు ఉండరు. ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్న ఆయన మీద చర్య అవసరమేనని, సత్యం కోసం నిర్మించిన ఆలయంలో ఆయన అబద్ధాలు ఆడుతున్నారని అన్నారు.

సభలో తాను ఏం మాట్లాడదలుచుకున్నారో అదే మాట్లాడతానంటారు రాహుల్. సభా నిబంధనలు ఆయనకు వర్తించవు. అచ్చుకాని పుస్తకం, కేంద్ర రక్షణశాఖ ఇంకా అనుమతించని పుస్తకం గురించి సభలో ప్రస్తావించరాదని స్పీకర్ ఓం బిర్లా రూలింగ్ ఇచ్చినా ఆయనకు పట్టలేదు. 'నేనేం మాట్లాడాలో మీరే చెప్పండి పోనీ' అంటూ హెచ్చులకు కూడా పోయారు. బడ్జెట్ మీద తప్ప మరొక అంశాన్ని తేవద్దని స్పీకర్ స్థానంలో ఉన్న జగదంబికాపాల్ పదే పదే శాసించినా రాహుల్ పట్టించుకోలేదు. టీవీల ముందు ఉన్న దేశ ప్రజలు ఏమనుకుంటారో అనేది కూడా ఆయనకు అసలే అనవసరం. అందుకే ఎన్నోసార్లు వాయిదా పడిన తరువాత, అపారమైన ప్రజాధనం దుర్వినియోగమైన తరువాత కూడా ఎట్టకేలకు బడ్జెట్ మీద చర్చ జరగాలని అంతా

నిర్ణయం జరిగాక కూడా రాహుల్ ధోరణి మారలేదు. బడ్జెట్ మీద ప్రసంగానికి అవకాశం ఇస్తే, భారత్ అమెరికా ఇంటెరిమ్ వాణిజ్య ఒప్పందం గురించి ఆయన ప్రస్తావించారు. ఆ సందర్భంలోనే దేశాన్ని అమ్మేశారని, ఇంత సిగ్గులేని పనా అని నిస్సిగ్గుగా అత్యున్నత చట్టసభలో నోరు పారేసుకున్నారు. ఈ సందర్భంలోనే మార్షల్ ఆర్ట్స్ గురించి విశేషజ్ఞానం పార్లమెంట్ ద్వారా జాతికంతటికీ సరఫరా చేయాలని కూడా ఆశించి, అందులో తనకు ఉన్న ప్రవేశం గురించి చాటుకున్నారు. గ్రిప్ (పట్టుకోవడం), చోక్ (గొంతు పట్టడం), ట్యాప్ (ఓడినట్టు ప్రతీక చూపడం) అంటూ చాలా జ్ఞానం పంచారు. ఇది మార్షల్ ఆర్ట్స్‌లో తెలుస్తుందట గాని, రాజకీయాలలో రహస్యంగా ఉంటుందట. హావభావాలతో రాహుల్ చూపిన ఈ ఒక్క విన్యాసానికి దేశంలో లక్షలలో ట్రోల్స్ వచ్చాయి. ఇందులో ఆయన కవి హృదయం ఒక్కటే. అలా పీక పట్టుకున్నప్పుడు బరిలో ఉన్న ప్రత్యర్థి ముఖంలో కనిపించే భయం గురించి తనకు తెలుసునని, ఇప్పుడు మోదీలో అలాంటి భయమే ఉందని ఆయన చెప్పదలిచారు. అంటే మోదీ పీక అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేతిలో ఇరుక్కుపోయిందని చెప్పదలిచారు. ఇంకా, బడ్జెట్‌కు ఏమాత్రం సంబంధం లేని ఎప్‌స్టిన్, అంబానీ, ఆదానీ అందరి పేర్లు ఏకరువు పెట్టారాయన. ఆ తరువాత అమెరికా విధించిన ప్రతీకార సుంకాల గురించి మొదలుపెట్టారు.



కార్వాన్ పత్రిక

జగదంబికాపాల్‌తో ఆయన చేసిన అనవసర ప్రసంగం కూడా చాలా విమర్శల పాలైంది. ఇవాళ స్పీకర్ స్థానంలో మీరు కూర్చున్నారు కాబట్టి,నేను దూకుడుగా వ్యవహరించను అన్నారు రాహుల్.

అందుకు స్పీకర్ స్థానంలో ఉన్న జగదంబికా పాల్ (అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం వల్ల స్పీకర్ బాధ్యతలకు ఓం బిర్లా దూరంగా ఉన్నారు) మీరు నా మాటలు పెడచెవిన పెట్టకుంటే ఆ స్థానంలో (ప్రతిపక్ష నేత) కూర్చోవలసిన అవసరం ఉండేది కాదు అన్నారు. కీలెరిగి వాత పెట్టడం అంటే ఇదే. ఫిబ్రవరి 11న ఎట్టకేలకు ప్రారంభమైన బడ్జెట్‌పై చర్చ సందర్భంగా లోక్‌సభలో ఈ సంభాషణ ఆ ఇద్దరి మధ్య జరిగింది.

బడ్జెట్ మీద మాట్లాడబోతున్న రాహుల్‌కు జగదంబికా పాల్ ఒక విషయం స్పష్టం చేశారు. బడ్జెట్‌కు సంబంధం లేని ఏ విషయాన్ని మీరు ప్రస్తావించరాదు అని స్పీకర్ స్థానంలో ఉన్న పాల్ ముందే చెప్పారు. అదీ పట్టించుకోలేదు.

‘మీరు ఒకప్పుడు మా పార్టీ సభ్యులే. మీ పట్ల మాకు అభిమానం ఉంది. కాబట్టి ఇవాళ నేను దూకుడుగా వెళ్లను’ అన్నారు రాహుల్. అక్కడితో ఆగితే రాహుల్ ఎందుకవుతారు? ‘మీ మనసు అక్కడ (బీజేపీ) లేదని నాకు తెలుసు’ అంటూ మనో విశ్లేషకుడి అవతారం కూడా ఎత్తారు. దీనికి పాల్, ‘నేను అధ్యక్ష స్థానంలో ఉన్నాను. మీరు (రాహుల్) నా మాటలు విని ఉంటే, అక్కడ (విపక్ష స్థానంలో) కూర్చోవలసిన అవసరం ఉండేది కాదు. మీరు నా మాట వినకపోవడం వల్లనే అక్కడ కూర్చున్నారు’ అన్నారాయన. మళ్లీ చెబుతున్నాను. ఇప్పటికైనా మించిపోయింది లేదు. సరైన తీరులో వెళ్లండి అని కూడా చురక వేశారు. జగదంబికా పాల్ 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి (యూపీ) గెలిచారు. 2014లో, ఆపై 2019, 2024లలోను బీజేపీ నుంచి గెలిచారు.


నిశికాంత్ దూబె

**స్పీకర్ కార్యాలయంలో**

దీనికి ముందు జరిగిన సంఘటన లోక్‌సభ అధ్యక్ష స్థానం మీద కాంగ్రెస్‌కు ఉన్న గౌరవం ఎంతో తెలియచేస్తుంది. స్పీకర్ ఓం బిర్లా చాంబర్‌లోకి చొరబడిన 20-25 మంది కాంగ్రెస్ ఎంపీలు లోపల ఎంత అప్రజాస్వామికంగా, సంస్కారహీనంగా.. ఇట్లాంటి మాటల కంటే ఎంత గూండాయిజం చేశారో ఫిబ్రవరి 12న పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు తెలియచేశారు. ఇందుకు సంబంధించిన ఒక వీడియోను విడుదల చేశారు. ఒక కాంగ్రెస్ ఎంపీయే చట్టవిరుద్ధంగా చిత్రించిన వీడియో ఇది. స్పీకర్ వైపు వేలు చూపిస్తూ ఒక మహిళా మాట్లాడుతున్నట్టు అందులో స్పష్టంగానే ఉంది. స్పీకర్‌ను వీరంతా దూషించారు, బెదిరించారు అన్న కిరెన్ రిజిజు ఆరోపణలకు తగ్గినట్టుగానే ఆ వీడియో కనిపిస్తున్నది. లోక్‌సభ లోపల, బయట ఒకే విధంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహార సరళి ఉన్నది. ఇలాంటి ప్రవర్తన పట్ల ఆ పార్టీ సగర్వంగా భావిస్తున్నదని కూడా ఆయన విమర్శించారు. జనరల్ నరవణె పుస్తకానికి సంబంధించి రాహుల్, కాంగ్రెస్ చర్యల పట్ల స్పీకర్ తీవ్ర మనస్తాపం చెందారని కిరెన్ తెలియచేశారు. స్పీకర్ చాంబర్‌లోకి చొరబడిన వారిలో ప్రియాంకా గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్ కూడా ఉన్నా, మిగిలిన సభ్యులను కట్టడి చేయకుండా, ప్రేరేపిస్తున్నట్టు వ్యవహరించారని అన్నారు. కానీ ప్రియాంక తనదైన శైలిలో దీనిని కొట్టి పారేశారు. తాము స్పీకర్ చాంబర్‌లో శాంతియుతంగా తమ ఇబ్బందులు చెప్పుకున్నామని ఆమె సమర్థించుకోవడమే విచిత్రం. తెలిసో తెలియకో మరి, కిరెన్ ఆరోపణకు ఊతం చేకూరే విధంగానే ప్రియాంక వివరణ ఉండడమే వింత. ఒకరిద్దరు కాస్త ఆవేశంతో తమ బాధలు చెప్పుకున్నారు, నేను చివరి వరకు మౌనంగానే ఉన్నాను అని ఆమె చెప్పారు. ప్రతిపక్షం నోరు నొక్కమని స్పీకర్‌కు ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయని కేసీ వేణుగోపాల్ చెబుతున్నారు. రాహుల్ మాటలలో ఎలాంటి తప్పు లేదని, అధికార పక్షం తమ మీద హక్కులు తీర్మానం ప్రవేశపెట్టినా తాము వెరవబోమని కూడా ఆయన మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు.

బీజేపీ సభ్యులు కాంగ్రెస్ వైఖరికి కుక్కకాటుకు చెప్పు దెబ్బ తీరులో జవాబు ఇచ్చారు. భారత సైనిక దళాల ప్రధాన అధికారి జనరల్ ఎంఎం నరవణె రాసిన ఫోర్‌స్టార్ డెస్టినేషన్ పుస్తకం గురించి మాట్లాడదలిచిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని (ఫిబ్రవరి 2వ తేదీ, ఆ రోజే రగడకు నాంది) అనుమతించలేదు. స్పష్టమైన నిబంధనావళి ఆధారంగానే రాహుల్‌కు అనుమతి రాలేదు. తరువాత కాంగ్రెస్ ప్రధానులను, నేతలను విమర్శిస్తూ బీజేపీ సభ్యుడు నిశికాంత్ దూబె కొన్ని పుస్తకాల గురించి ప్రస్తావిస్తే, అందుకు అనుమతించడం అంటే స్పీకర్ పక్షపాతంగా వ్యవహరించినట్టేనని కాంగ్రెస్ ఆరోపణ. ఇక్కడ ఒక అంశాన్ని కాంగ్రెస్ సౌకర్యంగా విస్మరించింది. అచ్చుకాని పుస్తకాల ప్రస్తావనను సభ ఆమోదించదు. అచ్చయిన వాటిని అమోదిస్తుంది. రాహుల్ మాట్లాడుతుంటే స్పీకర్ రూలింగ్ ఇచ్చారు.

దానిని రాహుల్ తోసిరాజన్నారు. తాను మాట్లాడాలంటే ఎవరి అనుమతి అవసరం లేదని, తన ఇష్టం మేరకు తాను మాట్లాడతానని రాహుల్ చెప్పిన సంగతిని కూడా కిరెన్ గుర్తుచేశారు. స్పీకర్ అనుమతి లేకుండా ఏ సభ్యుడు ప్రసంగించరాదన్నది కనీసం పాటించాల్సిన నిబంధన అని కిరెన్ వ్యాఖ్యానించారు.

ఇంతకీ నరవణె పుస్తక వివాదం ఏమిటి? నిజానికి దీనిని రాహుల్ వివాదంగా మలుచుకున్నారు. ఈ క్రమంలో సభా నిబంధనలు బలయ్యాయి. భారత సైనికదళాల మాజీ ప్రధానాధికారి జనరల్ మనోజ్ ముకుంద్ నరవణె -ఫోర్‌స్టార్ డెస్టినీ' పేరుతో పుస్తకం రాశారు. రక్షణ వ్యవహారాలలో అనుభవం ఉన్నవారు ఇలాంటి పుస్తకాలు రాయడం సర్వసాధారణం. భారత్-చైనా సరిహద్దులలోని గల్వాన్ లోయలో పొరుగు దేశ సైనికులను తిప్పికొట్టి, (2020) మన జవాన్లు సాధారణ పరిస్థితులు తెచ్చారు. కానీ నాడు కాంగ్రెస్, రాహుల్ ఈ ఉదంతం మీద దుర్వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ప్రభుత్వం గల్వాన్ ఘర్షణ మీద నిర్ణయం తీసుకోకుండా సైన్యం మీదకు బాధ్యతను నెట్టేసిందని రాహుల్ ఆరోపిస్తున్నారు. ఆయన ఈ సమాచారం కోసం ఆధారపడినది మాత్రం కార్వాన్ అనే ఆంగ్ల వారపత్రికలో వచ్చిన వ్యాసం మీదనే. జనరల్ నరవణె పుస్తకంలో కనిపించిన ఒక వాక్యానికి పూర్తిగా వక్రభాష్యం చెప్పిన రాహుల్, మరో అవాంఛ నీయ చర్చకు కారణమయ్యారు. సరిహద్దులను కాపాడే సైనికులను నాడు అవమానించి, వారి విజయానికి కారణమైన ప్రభుత్వాన్ని నేడు పార్లమెంట్‌లో దోషిగా నిలిపే యత్నం చేస్తున్నారు.

ఆ పుస్తకం సభలోకి తేవడం, వాక్యాలు చదివే ప్రయత్నం చేయడం వంటి చర్యలకు స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎవరు ఎంత వారిస్తున్నా, సభా నిబంధనలను గాలికి వదిలి, జనరల్ నరవణె పుస్తకంలోని కొన్ని వాక్యాలను రాహుల్ చదివారు. ఇంకా అచ్చుకాని పుస్తకంలోని అంశాలను సభలో ప్రస్తావించడం నిబంధనలకు వ్యతిరేకమని స్పీకర్, మంత్రులు పదే పదే చెప్పారు. అక్కడి పరిస్థితికి తగిన విధంగా మీరే నిర్ణయం తీసుకోవలసింది అంటూ ప్రభుత్వం తనను ఆదేశించిందని జనరల్ నరవణె తీర్పు కూడా ఇచ్చారు. దీనికే మోదీ ప్రభుత్వం సైన్యం మీదకు బాధ్యతను నెట్టివేసి చేతులు దులిపేసుకుందని రాహుల్ భాష్యం వెలగబెడుతున్నారు. రాహుల్ చర్యలో తప్పు లేదంటూ, విపక్షం ఇస్తున్న వివరణ మరీ హేయమైనది. అదంతా ఇది సైనిక వ్యవహారాలలో పారదర్శకత కోసం ప్రయత్నమట. దేశ అత్యున్నత చట్టసభలో దేశ రక్షణ రహస్యాలను చర్చించడమే అందుకు సరైన పద్ధతట. అవి రక్షణ వ్యవహారాలన్న స్పృహ కూడా లేదన్నమాట.



చాంబర్‌లో స్పీకర్‌పై కాంగ్రెస్ ఎంపీల దుర్భాషలు, దూషణలు

జనరల్ నరవణె, పుస్తక ప్రచురణకు పూనుకున్న పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా ఇచ్చిన వివరణ కూడా రాహుల్‌ను చెంపదెబ్బ కొట్టిన విధంగానే ఉన్నాయి. తన పుస్తకం ప్రచురణ గురించి చర్చలు నడుస్తున్నాయని జనరల్ నరవణె ప్రకటించారు. నరవణె రచన ఏ రూపంలోను వెలువడలేదని పెంగ్విన్ ర్యాండమ్ ఫిబ్రవరి 9న వివరణ ఇచ్చింది. అసలు అచ్చుకాని ఈ పుస్తకం రాహుల్ చేతికి ఎలా వచ్చిందన్న ప్రశ్నకు దీనితో పదును పెరిగింది. ఇది ఇప్పటికే చైనా, సింగపూర్ వంటి దేశాలకు పీడీఎఫ్ రూపంలో వెళ్లిపోయింది. ఇప్పుడు ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రఖ్యాత భారత ప్రతిపక్షనేతకు మాట్లాడే అవకాశం ఇవ్వనిది ఈ అంశం మీదనే సుమా! ఇక రాహుల్ మాట చూడండి! పుస్తకం ఇంకా అచ్చుకాకుంటేనేమి? ఇలాంటి ఒక పుస్తకం ఉన్నదీ అని దేశ యువతకు తెలియచేయడానికే పార్లమెంట్‌లో ప్రదర్శించానని భారీ గప్పా కొట్టారాయన. ఈ అబద్ధాల కోరును నమ్మి సభలో అల్లర్లకు దిగిన ఎనిమిది మంది ఎంపీలు బహిష్కరణకు గురయ్యారు. బడ్జెట్ చర్చకు సమాధానం ఇవ్వవలసిన ప్రధాని మోదీ మీద ఫిబ్రవరి 4న అవాంఛనీయ చర్యకు దిగడానికి కొందరు ప్రయత్నించారని, అందుకే ప్రధాని సభకు హాజరు కాకుంటే మంచిదని సలహా ఇవ్వవలసి వచ్చిందని స్పీకర్ ప్రకటన కూడా దీని కొనసాగింపు. ఫిబ్రవరి 10వ తేదీన కూడా మరొక ఎనిమిది మంది కాంగ్రెస్ మహిళా ఎంపీలు ప్రధాని స్థానం దగ్గరకు వచ్చి రచ్చ చేసి, స్పీకర్‌కు అందిన సమాచారం అబద్ధం కాదని రుజువు చేశారు. దీనికి పరాకాష్ట స్పీకర్ మీద అవిశ్వాస తీర్మానం.

భద్రతాదళాల అధికారులు విలువైన తమ అనుభవాలకు చెందిన వివరాలతో రచనలు చేయడం పాతదే. అవి రక్షణ మంత్రిత్వ శాఖ పరిశీలన తరువాత మాత్రమే అచ్చుకు వెళతాయి. కానీ జనరల్ నరవణె పుస్తకం కొన్ని వెబ్‌సైట్‌లలో, విదేశాలలోను పీడీఎఫ్ రూపంలో ఎలా దర్శనమిచ్చిందో తప్పక దర్యాప్తు చేయవలసిందే. ఈ పని చేసింది అర్బన్ నక్సల్స్ అని ఒక వాదన తెర మీదకు వచ్చింది. అయినా ఇందులో కాంగ్రెస్, దాని మిత్రపక్షాల బాధ్యత ఎంత, ప్రచురణకర్తల సంజాయిషీ వంటివి తప్పనిసరిగా జాతికి తెలియవలసిందే. పైగా రక్షణ రంగం, సరిహద్దులు, అగ్నిపథ్ పథకం, కొన్ని సైనిక, రాజకీయ నిర్ణయాల గురించిన ప్రస్తావనలు ఉన్న పుస్తకం. ఈ పుస్తకాల ప్రాధాన్యం కాదనలేనిది. కానీ వీటికి వక్రభాష్యాలు వెలగబెట్టి, ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేయడమే అసలైన ద్రోహం. ఈ ధోరణికి సరైన తీరులో బీజేపీ సభ్యులు వాత పెట్టారు. రాహుల్ జనరల్ నరవణె పుస్తకం లోక్‌సభలో ప్రదర్శించారు. బీజేపీ సభ్యుడు నిశికాంత్ దూబె పలు పుస్తకాల పేర్లు చెప్పారు. మధ్యలో నిశికాంత్ నాలుగైదు పుస్తకాలు సభలో ప్రదర్శించారు. నెహ్రూ కార్యదర్శి మత్తయ్, 1962 నాటి చైనా మీద రాసిన రెండు పుస్తకాలు, నెహ్రూ ఎడ్వినా సంబంధాల మీద ఒకటి ఉన్నాయి. అందులో ఒక పుస్తకాన్ని ఘనత వహించిన నెహ్రూ నిషేధించారు. ఆ పుస్తకాన్ని దూబే చదవడం మొదలుపెట్టారు. అప్పుడు కాంగ్రెస్ సభ్యులకు నిబంధనలు గుర్తుకు వచ్చాయి. దూబేను బహిష్కరించాలని గోల చేశారు. అయితే ఇదే నియమాన్ని మీ నేతకు కూడా వర్తింపచేయడం అనివార్యమని దూబె కీలెరిగి వాత పెట్టారు. ఇది అక్షరాల కుక్క కాటుకు చెప్పు దెబ్బ వ్యూహమే. ఇంకా అచ్చుకానప్పటికీ నరవణె పుస్తకం మీద హక్కులు తమవే కాబట్టి, అందులో ఒక్క వాక్యమైనా తమ అనుమతి లేకుండా వినియోగించుకుంటే చట్టబద్ధమైన చర్యలు తప్పవని పెంగ్విన్ ఇండియా



మర్యాద నేర్చుకోండి రాహుల్ – స్పీకర్

ప్రకటించింది. అదెలాంటి చర్య తీసుకుంటుందో చూడాలి. చర్య తీసుకుంటే సరే. లేకుంటే ఈ కుట్రలో, దేశాన్ని బాధించిన ఇంతటి రగడలో ఆ ప్రచురణ సంస్థకీ భాగం ఉన్నట్టే. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యే రోజుకి అంతర్జాతీయ మీడియాలో ఒక వివాదాస్పద వార్తాకథనం ప్రచురించే ఏర్పాటు చేసి, సభా కార్యకలాపాలకు అడ్డంపడే దుశ్చర్యను కొన్నేళ్ల పాటు సాగించిన చరిత్ర కాంగ్రెస్‌ది. ప్రతి సందర్భంలోను అవన్నీ అబద్ధాలనే తేలాయి.

రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా బీజేపీ సభ్యుడు నిశికాంత్ దూబె ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సబ్‌స్టేంటివ్ మోషన్ అంటారని విశ్లేషకులు చెబుతున్నారు. హక్కుల కమిటీ మొదట దీనిమీద నిర్ణయం తీసుకుంటుంది. తరువాత సభలో ఓటింగ్ పెడతారు. అప్పుడే రాహుల్ భవితవ్యం మీద తుది నిర్ణయం జరుగుతుంది. బీజేపీ సభ్యులు ఆరోపించినట్టు ఈ బడ్జెట్ సమావేశాల తొలి భాగంలో రాహుల్ నిస్సందేహంగా అన్ని హద్దులను చెరిపేశారు. ఏ వ్యవస్థలో అయినా కొన్ని నియమాలు ఉంటాయి. నిబంధనలు ఉంటాయి. అలాంటిది ఒక దేశ అత్యున్నత సభకు ఉండవా? అయిన వాటిని నిరంతరం వ్యతిరేకిస్తానని బాహాటంగా చెప్పడం వ్యవస్థను అత్యంత హీనంగా అవమానించడం కాదని ఎవరైనా అనగలరా? కానీ మొదటి రోజు నుంచి రాహుల్ అదే పనిగా వ్యవహరించారు. అడుగడుగునా నిబంధనలను తోసిరాజనడం. స్పీకర్‌ను అవమానించడం, యార్ అంటూ సంబోధించడం. పార్లమెంట్ లోపల ఉప రాష్ట్రపతిని, కోర్టులని, భారత రక్షణదళాలను అవమానించారాయన. వీటి మీద ఎవరూ ఫిర్యాదు చేయలేరు. సభలో చేసిన విమర్శలు కాబట్టి. కానీ బయట కూడా అదే ధోరణి.

మొదట రాష్ట్రపతి ప్రసంగం మీద మాట్లాడమంటే రాహుల్, విపక్ష నేత నవరణె పుస్తకం గురించి ప్రస్తావించి రచ్చ రచ్చ చేశారు. ఈ అంశం దగ్గర రాహుల్ వ్యవరించిన తీరు పూర్తిగా నిబంధనలకు విరుద్ధమేనని విశ్లేషకులు నిష్కర్షగా చెబుతున్నారు. అచ్చుకాని ఒక పుస్తకం పట్టుకొచ్చి అందులో వాక్యాలను సభకు వినిపిస్తానని పట్టుపట్టడం అవివేకమే. అది సాధ్యం కాదని స్పీకర్ ఓం బిర్లా రూలింగ్ ఇచ్చారు. స్పీకర్ మాటను లెక్కపెట్టలేదు. ఇక్కడ రాహుల్ ప్రదర్శించినది తిరుగులేని అజ్ఞానమే. ఇలాంటి పుస్తకం లేదా, ఇతర ఆధారం అనుకున్న దానిని సభలో ప్రవేశపెట్టాలంటే ముందుగా అందుకు స్పీకర్ అనుమతి కావాలి. దీనిని ఆథంటికేషన్ అంటారని విశ్లేషకులు అంటున్నారు. ఈ సంగతి రాహుల్‌కు తెలియదనడం ఒక చేదు వాస్తవం. ఆథంటికేషన్ అంటే తాను సభలో ఇస్తున్న సమాచారం వాస్తవమైనదని పూచీపడుతూ స్పీకర్ ఎదుట సంతకం చేయాలి. అది జరగలేదు. నీకు నిబంధనలు తెలియవని స్పీకర్ తీవ్రంగా హెచ్చరించిన తరువాత, సాయంత్రం ఇస్తానని రాహుల్ తప్పించుకున్నారు. దీనితో రాహుల్ సభలో మాట్లాడినదంతా రికార్డుల నుంచి తొలగించడం స్పీకర్‌కు అనివార్యమైంది. ఏమిటి ఫలితం, సభా సమయం వృథా. కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా. నరవణె పుస్తకం మీద రాహుల్ అనుసరించిన వైఖరి దాదాపు ఆరు రోజులు సభా కార్యకలాపాల స్తంభనకు దారి తీసింది. నరవణె పుస్తకం మీద నిబంధనలకు విరుద్ధంగా తమ నేతకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ సభ్యులు ఒక వెర్రి అల్లరికి దిగారు. ఏ నిబంధనా వీళ్లకి పట్టలేదు.



పెద్ద కుట్ర: ప్రధాని స్థానాన్ని చుట్టుముట్టిన కాంగ్రెస్ సభ్యులు

తరువాత బడ్జెట్ మీద విపక్ష నేత అంటే, రాహుల్ ప్రసంగించడానికి సమయం కేటాయించారు. ఇక్కడ కూడా రాహుల్ మతి చలించినట్టే ప్రవర్తించారు. నిజానికి బడ్జెట్ మీద చర్చను కాంగ్రెస్ సభ్యుడు శశిథరూర్ ప్రారంభించవలసి ఉంది. కానీ రాహుల్ లేచి, తాను అత్యవసరంగా రక్షణకు సంబంధించిన ఒక అంశం సభలో లేవనెత్తాలని అనుకుంటున్నానని, అవకాశం ఇవ్వాలని మొండి పట్టుపట్టారు. దీనితో శశిథరూర్ కూడా కూర్చున్నారు. స్పీకర్ మాత్రం రాహుల్‌ను అనుమతించ లేదు. తరువాత రాహుల్ వంతు వచ్చినప్పుడు, బడ్జెట్ మాట ఎత్తకుండా భారత్–అమెరికా ఒప్పందాన్ని తూర్పారపట్టే పని మొదలుపెట్టారు. ఈ సందర్భంలోనే ఒళ్లు తెలియకుండా రాహుల్ వాడిన మాట– భారత మాతను అమ్మేశారు. అప్పుడు స్పీకర్ స్థానంలో జగదంబికా పాల్ ఉన్నారు.

ఈ సమావేశాలలో రాహుల్ అనైతిక, అసంబద్ధ వైఖరికి మరొక మచ్చుతునక హర్దీప్ పురీ మీద చేసిన ఆరోపణ. హర్దీప్ పురి పేరు ఎప్‌స్టీన్ పత్రాలలో ఉన్నది కాబట్టి ఆయన కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయాలని రాహుల్ కోరారు. తీరా హర్దీప్ పురి సభలో వివరణ ఇస్తుంటే, రాహుల్ సభ నుంచి వెళ్లిపోయారు. ఆరోపణలు చేశారు కాబట్టి, హర్దీప్ పురి వివరణ విని తీరాలని స్పీకర్ ఆదేశించినా రాహుల్ పట్టించుకోలేదు.

ఇప్పుడు దూబె ప్రవేశపెట్టిన సబ్‌స్టేంటివ్ మోషన్ 1951లో కాంగ్రెస్ సభ్యుడు ఎస్‌జీ ముడుక్కల్ మీద సాక్షాత్తు నెహ్రూయే తీసుకువచ్చారని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ముడుక్కల్ మీది ఆరోపణ– పార్లమెంట్‌లో ప్రశ్న వేయడానికి బొంబాయి వర్తకుల నుంచి అతడు ఆనాడు రూ.1000 వంతున రెండు సార్లు లంచం తీసుకున్నాడు. అతడిని పార్లమెంట్ తొలగించింది. తరువాత 2005లో ఇదే ఆరోపణ మీద ఒక రాజ్యసభ ఎంపీ, 10 మంది లోక్‌సభ ఎంపీల సభ్యత్వాలను రద్దు చేశారు. ఇది ఆజ్‌తక్ చానల్ చేసిన స్టింగ్ ఆపరేషన్ ఫలితం. చివరిది టీఎంసీ సభ్యురాలు మహువా మొయిత్రా మీద పెట్టారు. ఆమె సభ్యత్వం కూడా పోయింది. ఇప్పుడు అదే రకమైన తీర్మానం రాహుల్ మీద ప్రయోగిస్తున్నారు.

ఒకసారి సభ నుంచి మెడ పట్టుకుని గెంటించుకున్న అనుభవం రాహుల్ గాంధీకి ఉంది. అయినా మరొకసారి అందుకు ఆయన సిద్ధంగా ఉన్నట్టు కనిపిస్తున్నది. ప్రతిపక్ష నేతగా ఆయన పక్షమైనా ఆయనను పూర్తిగా గౌరవిస్తున్నదా? అంటే అదీ అనుమానమే. కొన్ని కొన్ని మాటలకు అధికార పక్ష సభ్యులే కాదు, సొంత పార్టీ సీనియర్లు కూడా నవ్వు ఆపుకోవడానికి విశ్వప్రయత్నం చేయవలసి వస్తున్నది. స్పీకర్ మీద ఇంతకు ముందు అవిశ్వాసం తీర్మానం ప్రతిపాదించిన ఘటనలు ఉన్నాయి. కానీ అవన్నీ వీగిపోయాయి. కానీ సభలో సభ్యుని మీద వచ్చిన బహిష్కరణ తీర్మానాలు విజయవంతంగానే పనిచేశాయి. ఇది రాహుల్ గమనించాలి.

– జాగృతి డెస్క్

# SURYA FOUNDATION

B-3/330, Paschim Vihar, New Delhi - 110063. Tel. : 011-25251588, 25253681
Email : interview@suryafoundation.org Website : www.suryafoundation.org

Surya Foundation is a prestigious organization dedicated to the overall development and training of youth. Our primary objective is to cultivate bright, dedicated and determined youth who are committed to the nation and capable of fulfilling various responsibilities and to engage them in social service. We require young men who have grown up with the values of the Sangh, are interested in social work and are physically fit. Interested applicants can apply for the categories listed below. Selected candidates will have to undergo an interview process.

After selection in the interview, necessary training will be provided. Following this, On Job Training (OJT) will be provided for one year in the service projects run by Surya Foundation. After the OJT, the stipend will be revised and remuneration will be provided based on performance.

| Category | Experience | Age Between | 3 months Initial Training + 1 year OJT Stipend |
|---|---|---|---|
| Under Graduate, Graduate & Post Graduate | B.Sc. BCA, BBA, BA, B.Com (Pursuing / Passed) | 18-25 | 1.5 - 2 L Per Annum |
| | B.Com. with three years experience in accounts, purchase, store | 18-28 | 3.6 L Per Annum |
| | B.Ed., MSW, M.A. *(Freshers / Experience*)* | 18-25 | 2.4 - 3 L Per Annum |
| | MCA, M.Ed., M.Sc., M.Com. *(Freshers / Experience*) Ph.D. ** | 18-25 | 3 - 3.6L Per Annum |
| | Mass Communication (Media) - PG | 18-28 | 2.4 - 3 L Per Annum |
| | Diploma (Multi Media, Electrical, Electronics ++) | 18-25 | 1.8 - 3 L Per Annum |
| Engineers, (Fresher & Experienced) | B.Tech | 22-30 | 3.6 - 4 L Per Annum |
| | M.Tech | 22-30 | 4.2 - 4.5 L Per Annum |
| MBA (Fresher & Experienced) | MBA | 22-30 | 3 - 3.6 L Per Annum |
| Law | LLB | 22-28 | 2.4 - 3 L Per Annum |
| | LLM | 22-28 | 3 - 3.6 L Per Annum |
| CA | IPCC / MTER | 18-25 | 4 - 5 L Per Annum |
| | Fresher / Experienced* | 22-30 | 6 L Per Annum Onwards |
| GMT | Graduate Management Trainee | Description given hereunder @ | |

@ **GMT Eligibility**: Students who will pass their 10th, 11th, or 12th grade exams in 2026 can apply. Applicants must have secured a minimum of 60% marks in the previous class and 75% marks in Mathematics. **Age**: Below 18 years. After 6 months of initial training at Surya Training Center, candidates will be sent for On Job Training (OJT). Along with OJT, facilities for pursuing Graduation and MBA/MCA will be provided. During the initial 6 months of training, food and accommodation will be provided free of charge, along with a scholarship of ₹6,000 per month. During On Job Training, along with accommodation and education, a stipend of ₹8,000 in 11th grade, ₹10,000 in 12th grade, ₹13,000 in the first year of Graduation, ₹16,000 in the second year, ₹20,000 in the third year, ₹23,000 in the first year of MBA/MCA, and ₹28,000 in the second year of MBA/MCA will be provided per month. After completion of MBA/MCA, a salary/remuneration of ₹40,000 per month will be given, which may be higher based on work performance.

*** Salary of Ph.D. & experienced candidates will be determined based on their qualifications and experience.**

Please fill out and submit the application form in Hindi or English only. Along with your detailed resume, please mention if you have participated in any camps such as the RSS training camp/Prathmik Shiksha Varg (ITC)/Sheet Shivir/NCC/NSS etc. Also, mention if you have been associated with any school/hostel of Seva Bharati/Vidya Bharati/Vanvasi Kalyan Ashram, or any other organization, and if so, when and how. If you know anyone in the Surya family, please include their name and department. While providing details of your education, please attach a photocopy of your mark sheet.

**Please send your application along with a detailed resume to the address mentioned above. Applications can also be sent via email.**

Last date for Application : April 30, 2026



# వాట్సప్, మెటాలకు

వాట్సప్, మెటా సంస్థలకు వ్యతిరేకంగా నాలుగైదేళ్లుగా పిటిషన్లు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఒక్కసారిగా ఆ సంస్థల మీద విరుచుకుపడింది. "మా రాజ్యాంగాన్ని అనుసరించదలచుకోని పక్షంలో మీరు మా దేశం విడిచి వెళ్లిపోండి" అంటూ ఈ సంస్థలకు సర్వోన్నత న్యాయ స్థానం అల్టిమేటం జారీ చేసింది. వాట్సప్, దాని మాతృసంస్థ మెటా 2021లో రూపొందించి, అమలు చేస్తున్న ఒక విధానానికి వ్యతిరేకంగా తమకు అందిన పిటిషన్లపై సుప్రీంకోర్టు స్పందించింది. వాణిజ్య ప్రకటనలు, మార్కెటింగ్, వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్, మెటా సంస్థల తమ వద్ద ఉన్న వినియోగదారుల సమాచారాన్ని ఫేస్‌బుక్, తదితర తమ గ్రూప్ సంస్థలతో పంచుకోవడానికి ఈ 2021 విధానం అవకాశం కల్పిస్తుంది. ఈ విధంగా సమాచారం పంచుకుంటున్నందుకు 'కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా' సంస్థ ఈ వాట్సప్, మెటాలకు రూ. 213.14 కోట్లు జరిమానా విధించింది. దీనిని సవాలు చేస్తూ ఈ రెండు సంస్థలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం జరిగింది.

ప్రభుత్వ సంస్థ అయిన కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా తరఫున సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాట్సప్, మెటా సంస్థలు అనుసరిస్తున్న విధానాన్ని 'దోపిడీవిధానం'గా అభివర్ణించారు. వినియోగదారుల సమాచారాన్ని వాణిజ్య ప్రయోజనాలకు ఉపయోగించడం దేశ ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని, ఇదొక దోపిడీ విధానమని ఆయన ఘాటుగా విమర్శించారు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందిస్తూ, "మా రాజ్యాంగాన్ని అనుసరించని పక్షంలో మీరు ఈ దేశం విడిచి వెళ్లిపోండి. మేం మా పౌరుల గోప్యతను దుర్వినియోగం కానివ్వం" అని స్పష్టం చేశారు. వాట్సప్, మెటాలు అనుసరిస్తున్న విధానం భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోందని, వినియోగదారుల్ని బలవంతంగా తమ విధానాన్ని అనుసరించేలా చేస్తూ, ఇదెంతో విలువైన విధానంగా ఎలా చెప్పగలుగుతున్నారని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. "మా విధానాన్ని అనుసరించండి. లేని పక్షంలో వాట్సప్ అకౌంట్‌ను క్లోజ్ చేయండి" అని వాట్సప్, మెటాలు వినియోగదార్లకు చెప్పడం రాజ్యాంగం ప్రకారం పౌరుల స్వేచ్ఛకు, ప్రాథమిక హక్కులకు విరుద్ధమని న్యాయమూర్తి జయమాల్య బాగ్చీ వ్యాఖ్యానించారు. పైగా తమ విధానానికి ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని ఈ సంస్థలు చెప్పడం విడ్డూరంగా ఉందని, ఇది పూర్తిగా కట్టుకథ అని ఆయన విమర్శించారు.

**ప్రజల హక్కులకు భంగం**

ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తూ, వినియోగదారుల సమాచారాన్ని ఇతర సంస్థలతో పంచుకోవడం చట్ట విరుద్ధమని, ఇటువంటి కార్యకలాపాలను తాము అనుమతించమని స్పష్టం చేశారు. "ఇష్టం లేకపోతే ఖాతా మూసేయండని, దీని నుంచి వెళ్లిపోండని చెప్పడానికి మీరెవరు? ఇది సమాచారాన్ని చోరీ చేయడం కాకపోతే మరేమిటి? మొత్తం మార్కెట్ మీద మీరే ఆధిపత్యం చెలాయిద్దామనుకుంటున్నారా? మీకు పోటీ ఉండకూడదనుకుంటున్నారా?" అని ఆయన తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. "మీకు మీ వాణిజ్య ప్రయోజనాలేమిటో తెలుసు. వినియోగదార్లను మీ వాట్సప్, ఫేస్‌బుక్‌లకు బానిసలను చేసి, ఆ తర్వాత వారి మీద ఒత్తిడి తీసుకు వస్తున్నారు. వినియోగదార్లు గత్యంతరం లేక మీ సంస్థకే కట్టుబడి ఉండేలా చేస్తున్నారు. మీరు గుత్తాధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నారు" అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

వాట్సప్, మెటా సంస్థలు దాఖలుచేసిన పిటిషన్లతో పాటు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా దాఖలు చేసిన పిటిషన్లను, కొందరు వినియోగదార్లు సమర్పించిన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నాయకత్వంలోని ధర్మాసనం పరిశీలించింది. "కొద్దిపాటి సమాచారాన్ని కూడా మేం పంచుకోనివ్వం. ఈ దేశ ప్రజల గోప్యతతో మీరు ఆడుకోవడం, వారి గోప్యతను దుర్వినియోగం చేయడం ఇక్కడ జరగనివ్వం. గోప్యతకు సంబంధించి ప్రజల హక్కులను కాపాడడంలో రాజీపడే ప్రసక్తే లేదు. ప్రజల హక్కులను ఎవరూ ఎటువంటి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించడానికి వీల్లేదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. "దేశ ప్రజల గోప్యతను హుందాగా, దర్జాగా దోపిడీ చేయడం జరుగుతోంది. ఈ చౌర్యాన్ని కొనసాగనివ్వం. దేశ ప్రజల హక్కులను దుర్వినియోగం చేయడానికి,



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్



వాట్సప్, మెటా సంస్థల తరఫున ముకుల్ రోహత్గి తన వాదన ప్రారంభిస్తూ, దాదాపు ఇదే రకమైన కేసొకటి రాజ్యాంగ ధర్మాసనం పరిశీలనలో ఉందని చెప్పారు. తాము వినియోగదారుల దగ్గర ఒక్క పైసా కూడా వసూలు చేయడం లేదని, ఉచితంగా సేవలనందిస్తున్నామని చెప్పారు. అరుణ్ కత్పాలియా అనే మరో న్యాయవాది వాదిస్తూ, వినియోగదారుల పూర్తి సమాచారాన్ని తామెవరితోనూ పంచుకోవడం లేదని, కొద్ది సమాచారాన్ని మాత్రమే పంచుకుంటున్నారని తెలిపారు.

# సుప్రీంకోర్టు చీవాట్లు

ఉల్లంఘించడానికి అవకాశమివ్వం. మీరు ఇటువంటి పద్ధతులకు, ఆలోచనలకు ఇక స్వస్తి చెప్పడం శ్రేయస్కరం" అని కూడా ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**వాట్సప్ సమర్థన**

వాట్సప్, మెటా సంస్థల తరఫున ముకుల్ రోహత్గి తన వాదన ప్రారంభిస్తూ, దాదాపు ఇదే రకమైన కేసొకటి రాజ్యాంగ ధర్మాసనం పరిశీలనలో ఉందని చెప్పారు. తాము వినియోగదారుల దగ్గర ఒక్క పైసా కూడా వసూలు చేయడం లేదని, ఉచితంగా సేవలనందిస్తున్నామని చెప్పారు. అరుణ్ కత్పాలియా అనే మరో న్యాయవాది వాదిస్తూ, వినియోగదారుల పూర్తి సమాచారాన్ని తామెవరితోనూ పంచుకోవడం లేదని, కొద్ది సమాచారాన్ని మాత్రమే పంచుకుంటున్నారని తెలిపారు. ఫిబ్రవరి 9 తర్వాత మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి ధర్మాసనం నిర్ణయించుకుంది. అయితే, ఆ తర్వాత ఈ నిర్ణయాన్ని ఫిబ్రవరి 23కు వాయిదా వేసింది. తాము ప్రజల సమాచారాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ ఇతర సంస్థలతో పంచుకోమని చెబుతూ ఒక అఫిడవిట్‌ను అందజేయాలని ధర్మాసనం వాట్సప్, మెటా సంస్థలను ఆదేశించింది. ఇవి గనుక ఇటువంటి అఫిడవిట్ అందజేయని పక్షంలో ఇవి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ కంపెనీ లా అపిలేట్ ట్రైబ్యునల్ (ఎన్.సి.ఎల్.ఏ.టి) వంటి సంస్థల చర్యలను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేయడం జరుగుతుందని కూడా ధర్మాసనం స్పష్టం చేసింది.

వాట్సప్ విధానం కొద్దిగా వివాదాస్పదంగా తయారైంది. "ఫేస్ బుక్ గ్రూప్ కంపెనీల్లో ఒకటైన వాట్సప్ సంస్థకు సమాచారాన్ని సేకరించడం, దాన్ని ఈ గ్రూపులోని ఇతర సంస్థలతో పంచుకోవడం జరుగుతుంది. మేం సేకరించిన సమాచారాన్ని మేం ఉపయోగించుకుంటాం. మేం పంచిన సమాచారాన్ని మా గ్రూప్ సంస్థలు ఉపయోగించుకుంటాయి. మా సంస్థలు వృద్ధి చెందడానికి, మెరుగుపడడానికి, పనిచేయడానికి, అవగాహన పెంచుకోవడానికి, వినియోగదార్లకు సన్నిహితం కావడానికి, మా సేవలను మార్కెట్ చేసుకోవడానికి, వాటికి ప్రచారం కల్పించుకోవడానికి మేం విలువైన సమాచారాన్ని ఉపయోగించుకోవడం జరుగుతుంది" అని 2021 నాటి వాట్సప్ విధానం తెలియజేస్తోంది. ఈ విధానం ప్రకారం, వాట్సప్, ఫేస్‌బుక్ వినియోగదార్లు ఇందుకు అంగీకరించడం లేదా కట్టుబడిఉండడం జరగాలి. లేని పక్షంలో వారి అకౌంట్లను క్లోజ్ చేయాల్సి ఉంటుంది.

ఈ విధానాన్ని విడుదల చేసిన తర్వాత వాట్సప్ సంస్థ ఒక వివరణ కూడా జారీ చేసింది. వినియోగదార్లు తమ బంధువులు, స్నేహితులకు పంపించే లేదా వారి నుంచి తీసుకునే మెసేజుల్లోని సమాచారం జోలికి తాము వెళ్లమని, కేవలం వారు తమ గురించి ఇచ్చిన వివరాలను, ఇతరత్రా అందులో ఉన్న వ్యాపార సంబంధమైన విషయాలను మాత్రమే సేకరించడం జరుగుతుందని అది ఆ వివరణలో తెలిపింది. ఇటువంటి సమాచారాన్ని సేకరించి ఫేస్‌బుక్ అడ్వర్టయిజింగ్‌కు ఉపయోగించడం జరుగుతుందని కూడా అది వివరించింది.

అయితే, అనేక పిటిషన్లను, సవాళ్లను పరిశీలించిన తర్వాత సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ రెండు సంస్థలను నిలదీసింది. 'మా సంస్థల్లో ఖాతాలు ఉంచుకోదలచుకుంటే మా విధానాన్ని అనుసరించండి. మా విధానం నచ్చకపోతే వెంటనే నిష్క్రమించండి' అంటూ వాట్సప్ పేర్కొన్న దాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. దేశంలోని కోట్లాది అమాయక ప్రజల హక్కులకు ఇది పూర్తిగా భంగకరమని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది.



**జి.రాజశుక**
సీనియర్ జర్నలిస్ట్



# బీజేపీకి తొలి మేయర్

**తెలంగాణలో బీజేపీ దూసుకుపోతుంది. క్షేత్రస్థాయిలో క్రమంగా విస్తరించుకుంటూ పోతుంది. ఏ ఎన్నికలు జరిగినా ఓట్ల శాతాన్ని, సీట్ల సంఖ్యను పెంచుకుంటూ రాష్ట్రంలో అప్రతిహతంగా ముందుకు సాగిపోతోంది.**

మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలోని 2,996 వార్డులు, డివిజన్లకు ఫిబ్రవరి 11వ తేదీన ఎన్నికలు జరిగాయి. బీజేపీ తరపున 5,457 నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ గుర్తుపై పోటీ చేయడానికి అభ్యర్థులు ఏ స్థాయిలో పోటీపడ్డారు అన్నదానికి ఇది నిదర్శనంగా నిలిచింది.

మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ చాపకింద నీరు తరహాలో ప్రభావం చూపించింది. ఒక కార్పొరేషన్, ఒక మున్సిపాలిటీని పూర్తిగా కైవసం చేసుకుంది. భైంసాలో ఇండిపెండెంట్‌కు మద్దతు ఇచ్చింది. ఫలితంగా ఆ స్థానాన్ని కూడా తన ఖాతాలో వేసుకుంది. ఐదు మున్సిపాలిటీల్లో వైస్ చైర్మన్ పదవులను దక్కించుకుంది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తొలిసారిగా సొంతంగా వశం చేసుకుంది. నారాయణపేట్ మున్సిపాలిటీలో కూడా కమలం వికసించింది. 3 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌కు, 2 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వడం ద్వారా వైస్ చైర్మన్ పదవులను దక్కించుకుంది. కాంగ్రెస్ పార్టీ చైర్మన్లు ఎన్నికైన ఆమనగల్, నర్సాపూర్, అలియాబాద్ మున్సిపాలిటీల్లో బీజేపీ కౌన్సిలర్లు వైస్ చైర్మన్‌లుగా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ చైర్మన్ పదవిని దక్కించుకున్న జిన్నారం, ఎల్లంపేట మున్సి పాలిటీల్లో బీజేపీ అభ్యర్థులు వైస్ చైర్మన్‌లుగా ఎన్నికయ్యారు.

తన సంప్రదాయ కంచుకోటల్లో, పట్టణ కేంద్రాల్లో తిరుగులేని ఉత్సాహాన్ని ప్రదర్శించింది బీజేపీ కేడర్. అక్కడ నామినేషన్ల సంఖ్య వార్డుల కంటే ఐదారు రెట్లు ఎక్కువగా నమోదయ్యింది. ఉత్తర తెలంగాణలోని ఎక్కువ మున్సిపాల్టీల్లో పార్టీ పరిస్థితి అతివృష్టి అన్నట్టుగా కనిపించింది. అక్కడ రెబెల్స్ బెడద కూడా పెరిగిపోయింది. కరీంనగర్ కార్పొరేషన్‌లో చూసుకుంటే, 66 డివిజన్లు ఉంటే, బీజేపీ తరపున 375 నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రతి వార్డులో సగటున ఐదుగురు అభ్యర్థులు కమలం గుర్తు కోసం పోటీపడ్డారు. నిజామాబాద్ కార్పొరేషన్‌లో 60 డివిజన్లకుగాను 253 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆదిలాబాద్‌లో 49 డివిజన్లకు 124 మంది నామినేషన్లు వేశారు. చాలా ప్రాంతాల్లో అభ్యర్థులకు రెబల్స్ బెడద కూడా కనిపించింది. ఉత్తర తెలంగాణలో పార్టీ ఎంత బలోపేతం అవుతోందో, పార్టీ టిక్కెట్ కోసం పోటీ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందని పార్టీ ముఖ్య నాయకులు సంబరపడిపోయారు. వాళ్ల సంబరం వృథా కాలేదు. చరిత్రలోనే తొలిసారిగా భారతీయ జనతా పార్టీ సొంతంగా ఒక కార్పొరేషన్ మేయర్ పీఠంపై కాషాయ జెండా ఎగురవేసింది. అలాగే, ఒక మున్సిపాలిటీని సొంతంగా కైవసం చేసుకుంది.

ఎన్నికల ముందు బీజేపీ అధినాయకత్వం ప్రత్యేకంగా వ్యూహాలు రచించింది. జాతీయ స్థాయి నేతలను ఇన్‌ఛార్జీలుగా నియమించింది. ఈ మేరకు జాతీయ నాయకత్వం ప్రత్యేకంగా ఓ ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్, సహ ఇన్‌ఛార్జ్‌లుగా రాజస్థాన్ మాజీ అధ్యక్షుడు అశోక్ పర్నామి, రాజ్యసభ సభ్యురాలు రేఖాశర్మలను నియమిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆదేశాలు జారీ చేశారు. పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు జిల్లాల్లో పర్యటనలు చేపట్టారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ఇచ్చారు.

**ఆత్మహత్యతో ఢిల్లీలో ప్రకంపనలు**

ఫిబ్రవరి 10న నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో ఆరో వార్డు బీజేపీ అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. మక్తల్ నుంచి ఢిల్లీ దాకా ప్రకంపనలు రేగాయి. ఆయన తన నివాసంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో ఒక దశలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రత్యర్థుల నుంచి ఎదురవుతున్న తీవ్రమైన రాజకీయ ఒత్తిళ్లు, వేధింపుల వల్ల ఆయన ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు, కుటుంబ సభ్యులు, బీజేపీ నేతలు ఆరోపించారు.

మహాదేవప్పది ఆత్మహత్య కాదనీ, కాంగ్రెస్ చేసిన హత్య అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఓడిపోతామనే భయంతో బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారని,



ఎన్నికల ముందు బీజేపీ అధినాయకత్వం ప్రత్యేకంగా వ్యూహాలు రచించింది. జాతీయ స్థాయి నేతలను ఇన్‌ఛార్జీలుగా నియమించింది. ఈ మేరకు జాతీయ నాయకత్వం ప్రత్యేకంగా ఓ ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్, సహ ఇన్‌ఛార్జ్‌లుగా రాజస్థాన్ మాజీ అధ్యక్షుడు అశోక్ పర్నామి, రాజ్యసభ సభ్యురాలు రేఖాశర్మలను నియమిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆదేశాలు జారీ చేశారు. పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు జిల్లాల్లో పర్యటనలు చేపట్టారు.



# పీఠం

అరాచకాలు తట్టుకోలేక మహదేవప్ప ప్రాణాలు విడిచాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సహనాన్ని పిరికితనంగా భావిస్తున్నారా? అంటూ వైరిపక్షాలను ప్రశ్నించారు. ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌పై సమరం చేస్తామని ప్రకటించారు. బీఆర్ఎస్ అరాచకాలను ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ కార్యకర్తలదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయని తెలిపారు. బీజేపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలనీ, పార్టీ నాయకత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మహదేవప్ప ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్‌తో అతని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ ఉన్నారు. అదేరోజు ఈ ఘటనను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పార్ల మెంట్‌లో ప్రస్తావించారు. మహదేవప్ప మరణంపై పూర్తి స్థాయిలో పారదర్శకంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఆ మరుసటి రోజే కిషన్‌రెడ్డి మహదేవప్ప కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పది లక్షల రూపాయలు తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. వేరే పార్టీ నేతల ఒత్తిడి వల్లే మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నారని తెలంగాణలో అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ బీజేపీ శ్రేణులపై దౌర్జ న్యాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఈ అంశం కూడా తెలంగాణ మున్సిపాలిటీ ఎన్నికల్లో చర్చనీయాంశం అయింది.

**ఎస్ఐఆర్ ద్వారా ఓట్ల ప్రక్షాళన జరగాలి :**
**– రామచందర్ రావు**

తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాదులో ప్రత్యేక సమగ్ర సవరణ– ఎస్ఐఆర్ ద్వారా ఓట్ల ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. రాష్ట్రంలో జరిగిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, కమ్యూనిస్టు పార్టీలు కలిసి బీజేపీని నిలువరించే ప్రయత్నం చేశాయని ఆరోపించారు. అయినప్పటికీ గతంలో కంటే ఎక్కువగా ఓట్లను, సీట్లను గెలుచుకున్నామన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు భైంసా, నారాయణపేటలలో బీజేపీ జెండా ఎగురవేయడంపై హర్షం వ్యక్తం చేశారు. భైంసాలో తమ కార్యకర్తలను వేధించి, పదుల సంఖ్యలో కేసులు పెట్టి జైలుకు పంపారని, అయినా అక్కడ విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ మున్సిపల్ ఎన్నికలలో తమ పార్టీ ఓట్ల శాతం భారీగా పెరిగిందన్నారు.



రాష్ట్రంలోని 25 మున్సిపాలిటీలో నిర్ణయాత్మక శక్తిగా,15 మున్సిపాలిటీలో అతిపెద్ద పార్టీగా బీజేపీ నిలిచిందన్నారు. ప్రతిచోట పార్టీ ప్రాతినిధ్యం, పట్టు పెరిగిందని చెప్పారు. బీఆర్ఎస్ సంఖ్య 43 నుంచి 27కు పడిపోయింది, ఓట్ల శాతంలో 14 శాతం కోత పడింది, 550 వార్డులను ఆ పార్టీ నష్ట పోయిందని తెలిపారు. 2003తో పోలిస్తే అధికార కాంగ్రెస్‌కు చాలా తక్కువ స్థానాలు వచ్చాయనీ, రూలింగ్ పార్టీకి ఆశించిన ఫలితాలు రాలేదనీ అన్నారు. కరీంనగర్ మేయర్ పీఠం పార్టీకి వచ్చేలా వ్యూహాలు రచించిన బండి సంజయ్‌కి అభినంద నలు, ధన్యవాదాలు తెలియజేశారు. నిజామాబాద్‌లో కూడా తమ పార్టీ అతిపెద్ద పార్టీగా నిలవడం గర్వకారణం అన్నారు. అక్కడ పార్టీ పటిష్టత కోసం పని చేసిన ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యేలు రాకేష్ రెడ్డి , ధనపాల్ సూర్యనారాయణకి కూడా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో మజ్లీస్ పార్టీ ఓట్లు ఎలా పెరుగుతున్నాయని రామచందర్‌రావు ప్రశ్నించారు. నిజామాబాద్ లో అత్యధిక స్థానాలు బీజేపీ గెలుచుకున్నా.. అధికార కాంగ్రెస్, మజ్లీస్ పార్టీలు బీజేపీ ఎక్కడ వస్తుందో అని భయపడి ఆ రెండు పార్టీలు కలిసిపోయి మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు బీజేపీకి రాకుండా చేశాయన్నారు. రాష్ట్రంలో కనుమరుగై పోయిన కమ్యూనిస్టు పార్టీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాణం పోసేలా చూస్తున్నారనీ విమర్శలు చేశారు. బీజేపీపై ఇన్నాళ్లు విమర్శలు చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు.. ఇప్పుడు మున్సిపాలిటీ ఎన్నికల్లో వాళ్ల సంబంధంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్క బీజేపీని నిలువరించడానికి రాష్ట్రంలోని అన్ని పార్టీలు కలిసి పోవడం వింతగా ఉందన్నారు. వచ్చే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో ఆలోచన చేయాలనీ ప్రజలను కోరారు. తెలంగాణలో ఏప్రిల్‌లో ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించనున్న తరుణంలో అప్రమత్తంగా ఉండాలని, దొంగ ఓట్లు తొలగించాలని అధికారులకు సూచించారు. ఇంటి యజమానులకు తెలియకుండానే వారి ఇళ్లలో పెద్ద ఎత్తున ఓట్లు చేర్పిస్తున్నారని, అలాంటి వాటికి అడ్డుకట్ట వేసేలా ఎన్నికల కమిషన్‌కు లేఖ ఇస్తామని తెలిపారు. మున్సి పాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికల ఫలితాలపై పార్టీలో అంతర్గతంగా సమీక్షిస్తామని ఆయన చెప్పారు. కొన్ని చోట్ల పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వాళ్లపై, పార్టీ జారీ చేసిన విప్ ధిక్కరించిన వాళ్లపై చర్యలు తీసుకుంటామని రామచందర్‌రావు స్పష్టం చేశారు.

**సుజాత గోపగోని**
సీనియర్ జర్నలిస్ట్, 6302164068




**రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ కూటమి ప్రభుత్వం భారీ బడ్జెట్ ప్రవేశపెట్టింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.3,32,205 కోట్లతో బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆయన వరుసగా బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇది మూడోసారి.**

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో, హోం మంత్రి వంగలపూడి అనిత శాసనమండలిలో 2026-27 వార్షిక బడ్జెను ప్రవేశపెట్టారు. అంతకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశం బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. అనంతరం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌కు ఆర్థికమంత్రి కేశవ్ బడ్జెట్ పత్రాలు అందజేశారు.

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు రూ.53,752.12 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను శాసనభలో ప్రవేశపెట్టగా, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ శాసనమండలిలో ప్రవేశ పెట్టారు. గత ఏడాది కంటే ఈసారి బడ్జెట్ రూ.10 వేల కోట్లు పెరిగింది. 2026-27 బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.2,56, 143 కోట్లు, మూలధనం వ్యయం రూ.53,915 కోట్లు, రెవెన్యూలోటు రూ.22,002 కోట్లు, ద్రవ్యలోటు అంచనా రూ.75,868 కోట్లుగా చూపారు. ఇది రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తిలో వరుసగా 1.88 శాతం, 3.84 శాతంగా ఉండనున్నాయి.

2025-26 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం రెవెన్యూ వ్యయం 2,38,021 కోట్లుగా, మూల ధన వ్యయం 39,498 కోట్లు, రెవెన్యూ లోటు సుమారు రూ.41,118 కోట్లుగా, ద్రవ్యలోటు రూ.80,56 కోట్లుగా ఉంది. ఇవి రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తిలో వరుసగా 2.33 శాతం నుంచి 4.57 శాతంగా ఉన్నాయి.

**సంక్షేమానికి ప్రాధాన్యం**

సూపర్ సిక్స్ పేరిట అమలవుతున్న పథకాలకు భారీగా నిధులు కేటాయించారు.రూ.లక్షా 15 వేల కోట్లతో సంక్షేమానికి పెద్దపీట వేస్తూ బడ్జెట్ ప్రవేశ పెట్టడం ఇదే మొదటిసారి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వెనుకబడిన వర్గాల సంక్షేమంతో పాటు సూపర్ సిక్స్ అమలుకు కేటాయింపులు పేదల జీవితాల్లో భరోసా నింపనున్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బడ్జెట్‌లో మొత్తం 17 శాతం సంక్షేమానికి కేటాయించారు. నేతన్నలకు పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్స్‌కు 200 యూనిట్లు విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించారు. సాంఘిక సంక్షేమానికి రూ. 11,118.84 కోట్లు, ఈడబ్ల్యూఎస్ సంక్షేమానికి రూ. 10,699.33 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ. 23,650.88 కోట్లు, ఎన్టీఆర్ భరోసా పథకానికి రూ.27,719 కోట్లు, దీపం 2.0కు రూ.2,601 కోట్లు, వివిధ వర్గాలకు ఆర్థిక మద్దతుగా రూ. 2,320 కోట్లు, స్త్రీశక్తి పథకానికి రూ. 1,420 కోట్లు, వీకర్ సెక్షన్లకు సబ్సిడీ, ఉచిత విద్యుత్ పథకానికి రూ. 600 కోట్లు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయంగా రూ. 450 కోట్లు, తల్లికి వందనం పథకానికి రూ. 9,668 కోట్లు, శిశు సంక్షేమానికి రూ. 4,581 కోట్లు, ఉపకారవేతనాలకు రూ. 3,836 కోట్లు, సమగ్ర శిక్ష అభియాన్‌కు రూ. 2,946 కోట్లు, ఉన్నత విద్యకు రూ. 2,566 కోట్లు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి రూ. 2,161 కోట్లు, మన బడి, మన... భవిష్యత్ పథకానికి రూ. 1,500 కోట్లు, నైపుణ్యాభివృద్ధికి రూ. 1,232 కోట్లు, పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా: రూ. 707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్రకు రూ. 654 కోట్లు, యువత, క్రీడలు రూ. 438 కోట్లు, మత్స్యకార సేవలో: రూ.260 కోట్లు, పంటల బీమాకు రూ. 250 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.6,600 కోట్లు కేటాయించారు. దివ్యాంగులకు ఉచిత బస్ ప్రయాణం.. పోలీసులకు 3 వేల కొత్త పోలీస్ వాహనాలు మంజూరు చేసేందుకు బడ్జెట్‌లో పొందుపరిచారు.



# బిల్‌గేట్స్ రాష్ట్ర పర్యటన

గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ ఆంధ్ర ప్రదేశ్‌లో ఫిబ్రవరి 16న విస్తృతంగా పర్యటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో కలసి ఆర్టీజీఎస్ కేంద్రాన్ని సందర్శించి, పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని పరిశీలించారు. చంద్రబాబును తన "గుడ్ ఓల్డ్ ఫ్రెండ్"గా అభివర్ణించిన గేట్స్, ప్రపంచం లోని ఎంతోమంది నాయకుల కంటే చంద్రబాబు ఆలోచనలు చాలా ముందుంటాయని, సింగపూర్ ప్రధాని తరహా విజన్ ఆయన సొంతమని కొనియా డారు. ముఖ్యంగా కుప్పంలో అమలు చేస్తున్న 'సంజీవని' కార్యక్రమం, ఆరోగ్య, విద్యారంగాల్లో ఏఐ వినియోగంపై గేట్స్ ప్రశంసలు కురిపించారు. ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన గేట్స్, అక్కడ సాగులో డ్రోన్ల వినియోగం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా మహిళా రైతులు స్వయంగా వండిన స్థానిక వంటకాలను రుచిచూసి వారితో ముచ్చటిం చారు. ఏపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని సాంకేతికతను అనుసంధానిస్తున్న తీరు అద్భుతమని, ఇది రైతుల ఆదాయాన్ని పెంచడానికి దోహదపడుతుందని బిల్ గేట్స్ పేర్కొన్నారు. అంతకు ముందు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు మంత్రి లోకేశ్ ఘనస్వాగతం పలకగా, అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఎదురేగి స్వాగతం పలికారు. ★



# ...వృద్ధే లక్ష్యంగా రాష్ట్ర బడ్జెట్

**అభివృద్ధికి పెద్దపీట**

ప్రభుత్వం రాబడి పెంపుదలకు ప్రణాళికలు రచిస్తూనే సంపద సృష్టికి అడుగులు వేస్తోంది. ప్రధానంగా సంపద సృష్టికి సంక్షేమానికి రూ. 100 కోట్ల కార్పస్ నిధితో రాష్ట్ర సంక్షేమ నిధిని ఏర్పాటు అందులో భాగమే. రాష్ట్రంలోని ప్రాంతాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ, ఆ దిశగా కేటాయింపులు జరిపింది. విద్య, వైద్యారోగ్యం, పట్టణ, గ్రామీణాభి వృద్ధి, జలవనరులు, వ్యవసాయం, విద్యుత్ రంగాలకు పెద్దఎత్తున నిధులు కేటాయించారు. జల వనరులశాఖకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఈ ఏడాదిలో మేజర్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేసేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా ప్రకటిస్తూ రూ.30 వేల కోట్లు కేటాయించటం ఆ ప్రాంతానికి మహర్దశ పట్టనుంది.రాజధాని అమరావతికి రూ. 6వేల కోట్లు, పోలవరానికి రూ. 6వేల కోట్లు (కేంద్ర సహకారం ఉన్నప్పటికీ), దేశంలోనే తొలిసారిగా అమరావతిలో ఏర్పాటైన క్వాంటం వ్యాలీకి రూ. 638 కోట్లు కేటాయించారు. దీనిని ప్రపంచంతో పోటీ పడేలా అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకునే ప్రయత్నంగా చెబుతున్నారు. పాఠశాల విద్యకు రూ. 32,308.32 కోట్లు ,పంచాయతీ రాజ్, గ్రామీణాభి వృద్ధికి రూ. 22,941.54 కోట్లు, వైద్యారోగ్యం రూ. 19,306.04 కోట్లు, నీటి వనరులు రూ. 18,223.67 కోట్లు, పట్టణాభివృద్ధి, పురపాలక శాఖకు రూ. 14,538.68 కోట్లు, విద్యుతు రంగానికి రూ. 13,934.25 కోట్లు, వ్యవసాయ రంగం రూ. 11,745.21 కోట్లు, వ్యవసాయం - నీటి భద్రత భారీగా నిధులు కేటాయించారు. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ. 9,906 కోట్లు, పోలవరం రూ. 6,105 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రూ. 1,927 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ. 500 కోట్లు, పీఎం కృషి సించాయి యోజన రూ. 190 కోట్లు కేటాయించారు. పాఠశాలలు, హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పన: రూ. 1,800 కోట్లు.. ఎంఎస్ఎంఈలకు ప్రయోజనం కలిగేలా రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో (బిల్ డిస్కౌంటింగ్ విధానానికి డిజిటల్ ప్లాట్ ఫామ్) అమలు చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

**ఇది మెరుగైన బడ్జెట్ : చంద్రబాబు**

ప్రస్తుత పరిస్థితుల్లో మెరుగైన బడ్జెట్‌ను ప్రవేశ పెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. 'వచ్చే రెండు, మూడేళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ ప్రవేశపెడతాం. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు చేసిన విధ్వంసం నుంచి కోలుకోవడానికి ఇంకా సమయం పడుతుంది. ఆదాయం తక్కువ- ఖర్చులు ఎక్కువ అనేది వారసత్వంగా వచ్చింది. కేంద్ర సహకారంతో నిభాయించుకుంటూ వస్తున్నాం. వ్యవసాయం, సేవారంగాల నుంచి ఎక్కువ ఆదాయం రావాలి. రెండు, మూడేళ్లలో అమరావతికి ఒక రూపు వస్తుంది. అక్కడి రోడ్లను జాతీయ రహదారికి అను సంధానిస్తున్నాం. దీనివల్ల అమరావతికి రాక పోకలు పెరిగి ఆదాయమూ వస్తుంది. అమరావతికి పశ్చిమ బైపాస్‌తో యాక్సెస్ పెరిగింది. బడ్జెట్‌లో రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు రూ.30 వేల కోట్లు కేటాయిం చడం మంచి పరిణామం. దేశంలోనే నాణ్యమైన పండ్లు 'సీమ'నుంచి వస్తున్నాయి. ఇక్కడ పండే దానిమ్మకు మంచి డిమాండ్ ఉంది. విశాఖ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేయాలన్న గ్లోబల్ ఐటీ దిగ్గజం గూగుల్ నిర్ణయం వల్ల ఒక్కసారిగా ప్రపంచ దేశాలన్నీ రాష్ట్రం చూసేలా చేసింది.

**గ్రామం నుంచి గ్లోబల్ స్థాయికి: ఉపముఖ్యమంత్రి.**

గ్రామం నుంచి గ్లోబల్ స్థాయి వరకూ... విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, యువత, మహిళా సాధికారత, సాంకేతికత... ఇలా అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లే 360 డిగ్రీల సమతుల్య గ్రోత్ మోడల్‌గా రాష్ట్ర బడ్జెట్ రూపుదిద్దు కుందని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర బడ్జెట్‌పై 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ.. అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం, సంక్షేమంతో కూడిన అభివృద్ధి ఫలాలు అందిస్తున్నా మన్నారు. 'చంద్రబాబు నేతృత్వంలో 360 డిగ్రీల్లో రాష్ట్ర సమగ్రాభి వృద్ధికి బలమైన పునాది వేసేలా.. రూ.3.22 లక్షల కోట్ల వ్యయంతో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.22, 942 కోట్ల కేటాయింపుల ద్వారా రాష్ట్రాభివృద్ధిలో గ్రామాల పాత్ర కీలకమనే విషయాన్ని ఎన్డీఏ ప్రభుత్వం పునరుద్ఘాటించింది. పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖలకు 714 కోట్లు కేటాయిం చింది' అని చెప్పారు.

**ఆర్థిక నిర్వహణలో పరిపక్వత: సత్యకుమార్**

2024-25లో 5.11 శాతంగా ఉన్న ద్రవ్య లోటును 4.57 శాతానికి తగ్గించిన ప్రభుత్వం ఇప్పుడు దాన్ని మరింత తగ్గించి 3.84 శాతానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకోవడం ఆర్థిక నిర్వహ ణలో పరిపక్వతకు నిదర్శనం. రెవెన్యూ లోటును 2.33 శాతం నుండి 1.88 శాతానికి తగ్గించాలని నిర్దే శించుకోవడం రాష్ట్ర ఆర్థిక స్వావలంబనకు దోహద పడుతుంది. ఆరోగ్య రంగంలో మొత్తం బడ్జెట్లో 5.88 శాతం కేటాయించడం చారిత్రాత్మకం. బడ్జెట్ లో మూడవ అతిపెద్ద కేటాయింపు ఆరోగ్య శాఖకు కావడం ప్రజారోగ్యంపై ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం. ఆరోగ్య రంగంలో మూల ధన వ్యయంగా రూ.3,066 కోట్లు కేటాయించాం. స్వర్ణాంధ్ర దిశగా రాష్ట్రం పయనిస్తున్న తరుణంలో ఆ లక్ష్యానికి ఊత మిస్తూ 2026-27 బడ్జెట్లో సాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించింది.

**సంపద సృష్టికి దోహదం: మాధవ్**

లోటును అదుపులో ఉంచుతూ సంపద సృష్టించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందనడానికి 2026-27 బడ్జెట్ నిదర్శనమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. 'ప్రాధాన్యత క్రమంలో అన్ని రంగాలకు పెద్దపీట వేశారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన 83 కేంద్ర ప్రాయోజిత పథకాలను పునరుద్ధరించి వాటికి దాదాపు రూ.24 వేల కోట్లు కేటాయించారు. అదే నిష్పత్తిలో కేంద్రం నుండి 60 శాతం నిధులు రాబట్టే అవకాశం ఉంది'అని పేర్కొన్నారు.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

**ఈశాన్య రాష్ట్రాలకు గుండెకాయ అయిన అస్సాంలో త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్న వేళ దేశ భద్రతకు సంబంధించిన అంశాలు వెలుగులోకి వచ్చాయి. అల్లకల్లోలమైన బాంగ్లాదేశ్‌కు సరిహద్దుకు సమీపంలో ఉన్న రాష్ట్రంలో అధికార బిజేపీ, ప్రతిపక్షం కాంగ్రెస్‌లమధ్య విమర్శలు, ప్రతి విమర్శలను కేవలం ఎన్నికలవేళ రాజకీయ ఆరోపణలుగా కొట్టిపారేయకుండా లోతుగా పరిశీలించాల్సిన ఆవశ్యకత ఉంది. లోక్‌సభలో ప్రతిపక్ష ఉప నేత గౌరవ్ గొగొయ్‌పై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ చేసిన ఆరోపణలు దేశ ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. భారత్‌లో నిత్యం అశాంతిని రెచ్చగొట్టే పాకిస్తాన్‌లోని ఏజెంట్లతో గొగొయ్ కుటుంబానికి సంబంధాలున్నాయని బిశ్వ శర్మ ఆధారాలు చూపిస్తూ ఆరోపణలు చేశారు. ఇప్పటికే బాంగ్లాదేశ్ అక్రమ వలసదారులతో ఇబ్బందులు పడుతున్న అస్సాంలో రాష్ట్ర కీలక నేత పాకిస్తాన్‌తో సంబంధాలు కలిగున్నారనే ఆరోపణలు అత్యంత కీలకమైనవి.**



# దేశ భద్రతతో

అస్సాం రాష్ట్రంలో 15 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా ఏకచ్ఛత్రాధిపత్యంతో పాలించిన తరుణ్ గొగొయ్ కుమారుడు గౌరవ్ గొగొయ్ 2013లో పాకిస్తాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో రహస్యంగా పర్యటించారనే కీలక విషయాలు ఇప్పుడు హిమంత బిశ్వశర్మ ఆరోపణలతో వెలుగులోకి వచ్చాయి. 2013లో అటు అస్సాంలో ఇటు కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వాలే అధికారంలో ఉండడంతో గౌరవ్ గొగొయ్ పాకిస్తాన్ పర్యటనను రహస్యంగా దాచారా? అనే సందేహాలను బలపరుస్తున్నాయి. గొగొయ్ పాక్ పర్యటనకు సంబంధించి ఏడాది కాలంగా రేగుతున్న దుమారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇచ్చిన నివేదికలో కీలకాంశాలు వెలుగులోకి వచ్చాయి. గౌరవ్ గొగొయ్, ఆయన భార్య ఎలిజిబెత్ కాల్‌బర్న్ పలుమార్లు పాకిస్తాన్‌లో పర్యటించడం అనుమానాస్పద వ్యక్తులను కలవడం, వారితో సంబంధాలు ఏర్పర్చుకున్నారని బిశ్వశర్మ ఆరోపించడంతో పెద్ద దుమారం రేగింది.

శర్మ చెప్పిన వివరాల ప్రకారం బ్రిటన్‌కు చెందిన గొగొయ్ సతీమణి ఎలిజిబెత్ పాకిస్తాన్‌లో ఉద్యోగ రీత్యా పనిచేస్తున్నప్పుడు ఆమెకు అక్కడ అలీ తౌఖీర్ షేక్ అనే వ్యక్తితో సత్సంబంధాలుండేవి. ప్రపంచ వ్యాప్తంగా భారత్ వ్యతిరేక శక్తులను ప్రోత్సహిస్తూ పాకిస్తాన్ ఏజెంట్‌గా పనిచేసిన అలీ 2010 నుండి 2013 మధ్యకాలంలో డజను సార్లకుపైగా భారత్‌లో పర్యటించాడు. అప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం గమనార్హం. ఇదే సమయంలో అలీకి చెందిన 'లీడ్ పాకిస్తాన్' అనే సంస్థలో ఆమె విధులు నిర్వహించారు. అనంతరం ఆమె భారత్‌కు బదిలీ అయి 'లీడ్ ఇండియా' సంస్థలో పనిచేశారు. ఆమె భారత్‌లో పనిచేస్తున్నా జీతం చెల్లించిన అలీ ఎఫ్‌సీఆర్ఏ చట్టం నిబంధనలు ఉల్లంఘించారు. ఈ సమయంలోనే ఆమె భారత్‌కు సంబంధించిన కీలక సమాచారాన్ని పాకిస్తాన్‌కు చేరవేశారనే అనుమానాలు బలపడుతున్నాయి. భారత్‌లో పనిచేస్తున్నప్పుడు ఎలిజిబెత్ తొమ్మిదిసార్లు పాకిస్తాన్‌లో పర్యటించారు. ఈ నేపథ్యంలో గౌరవ్ గొగొయ్ 2013లో పాకిస్తాన్‌లో పర్యటించడంపై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన వీసా నిబంధనలు ఉల్లంఘించి రావల్పిండిలో పర్యటించారు. అనుమతి లేకుండా ఇక్కడ పర్యటనకు ఆయనకు ఎవరు రహస్యంగా సహకరించారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ పర్యటనలపై ప్రభుత్వానికి ఎలాంటి సమాచారం ఇవ్వని ఆయన బహిరంగ ప్రపంచానికి దూరంగా రహస్యంగా ఉన్నారు. భార్య ఎలిజిబెత్ ఉద్యోగ పనుల నిమిత్తం డిసెంబర్,2013లో పాకిస్తాన్‌కు 10 రోజులు వెళ్లానని గౌరవ్ గొగొయ్ చెబుతున్నా రావల్పిండి ప్రాంతంలోని తక్షశిలకు గొగొయ్ దంపతులు వెళ్లడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ మరో కీలకాంశం పాకిస్తాన్ ఆర్మీ జనరల్ ప్రధాన కార్యాలయం కూడా రావల్పిండిలోనే ఉండడంతో వీరి రహస్య పర్యటనతో భారత రహస్య అంశాలపై ఆందోళనలు రెట్టింపయ్యాయి.

అధికార అండతో 2013లో గొగొయ్ కుటుంబం భారత కీలక రక్షణ రహస్యాలను శత్రు దేశానికి లీక్ చేసిందా అనే భయాందోళనలు కూడా కనిపిస్తున్నాయి. బిశ్వశర్మ ఆరోపించినట్టు భారత ఇంటలిజెన్స్ సమాచారాన్ని పాక్‌కు రహస్యంగా చేరవేయడం, విదేశీ విరాళాల చట్టాన్ని ఉల్లంఘించడం, వాతావరణ చర్యలపై భారత ప్రభుత్వ నివేదికను అలీకి పంపడం వంటి ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం నిగ్గుతేల్చేందుకు చర్యలు తీసుకొని నిజాలను బహిర్గతం చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో బిశ్వశర్మ సిట్ నివేదిక ఆధారంగా చేసిన ఆరోపణలను కేవలం రాజకీయ కోణంలో చూడలేము. అస్సాంలో బిశ్వ శర్మ కుటుంబం భూఅక్రమాలకు పాల్పడినట్టు విమర్శించిన నేపథ్యంలోనే తనపై, తన కుటుంబంపై పాకిస్తాన్ పర్యటన ఆరోపణలు చేస్తున్నారని గౌరవ్ గొగొయ్ ప్రకటించారు. బిశ్వశర్మ తన కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేశారని, తాను కూడా ఆ పని చేయవచ్చని గొగొయ్ అన్నారు కానీ ఆధారాలు చూపించలేకపోయారు. తన కుటుంబానికి 12 బిఘాల (3960 ఎకరాల) భూమి బినామీ పేర్ల మీద ఉందంటూ గొగొయ్‌తో పాటు కాంగ్రెస్ నేతల విమర్శలపై తీవ్రంగా ప్రతిస్పందించిన ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ వారిపై రూ.500 కోట్ల పరువు నష్టం దావా వేసి సవాలు చేశారు. అయితే ప్రత్యారోపణలతో గొగొయ్ దేశ భద్రత అంశాలను పక్కదారి పట్టిస్తున్నారా అనిపిస్తోంది. భూఅక్రమాలు, అవినీతి ఆరోపణలొస్తే వాటిపై తక్షణమే న్యాయ స్థానాన్ని ఆశ్రయించవచ్చు. లేదా విచారణ కోరవచ్చు. అయితే శత్రు దేశమైన పాకిస్తాన్ ఏజెంట్లతో సంబంధాలు ఉండి దేశ భద్రతపై రాజకీయాలు చేయడం మాత్రం క్షమించరాని నేరం. గొగొయ్ పాక్ పర్యటనపై ఆరోపణలు వచ్చినా వాటిపై స్పష్టత ఇవ్వకుండా ఇవన్నీ ఎన్నికల్లో భాగమని చెబుతూ తప్పించుకోలేరు.

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో తనపై వచ్చిన ఆరోపణలో ఉక్కిరిబిక్కిరైన గౌరవ్ గొగొయ్ తమ అధినేత రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో వారసత్వ రాజకీయాలను ఆశ్రయించారు. తన తండ్రి వారసత్వంతో తాను రాజకీయ నేతగా ఎదిగానని గొగొయ్ గర్వంగా చెప్పుకున్నారు. ఆయన తండ్రి



బిశ్వ శర్మ

# కాంగ్రెస్ రాజకీయాలు

తరుణ్ గొగొయ్ పాలనలోనే గౌరవ్ గొగొయ్ నిబంధ నలకు విరుద్ధంగా వ్యవహరించారనేది గమనార్హం. గౌరవ్ గొగొయ్ తన తండ్రి రాజకీయ వారసత్వం గురించి గొప్పగా చెప్పుకుంటున్నా ఆయన ధృతరాష్ట్ర ప్రేమ గురించి అస్సాం ప్రజలకు బాగా తెలుసు. తరుణ్ గొగొయ్ హయాంలో గౌరవ్ గొగొయ్, హిమంత బిశ్వ శర్మ రాష్ట్ర కాంగ్రెస్ యువ నేతలుగా రాణించారు. అయితే కొడుకు రాజకీయ ఎదుగుదల కోసం తరుణ్ గొగొయ్ అణిచివేయడంతో బిశ్వ శర్మ బీజేపీలో చేరి రెండుసార్లు వరుసగా రాష్ట్ర ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. వారసత్వ రాజకీయా లతో బిశ్వ శర్మను తొక్కివేయాలని చూసిన గౌరవ్ గొగొయ్ ఇప్పుడు మరోసారి అదే వారసత్వ రాజకీయాలతో ప్రమాదకరమైన ఆరోపణల నుండి తప్పించుకోవాలని చూస్తున్నారు.

బాంగ్లాదేశ్ అక్రమ వలసదారులతో, బాంగ్లాలో మైనార్టీ హిందువులపై దాడులతో అస్సాంలో తరచూ ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇలాంటి సమయంలో దేశ భద్రతకు సంబంధించి ఆ రాష్ట్రంలో కీలక నేతగా ఉన్న గొగొయ్‌పై తీవ్ర ఆరోపణలు రావడం అస్సాం ఎన్నికల్లో ప్రభావం చూపడం ఖాయం. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని అందుకే బిశ్వశర్మ తనను లక్ష్యంగా చేసుకున్నారని గొగొయ్ చెప్పడం హాస్యాస్పదం. వాస్తవానికి అస్సాంలో కాంగ్రెస్ పరిస్థితి దిగజారు తోంది. రాష్ట్రంలో 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఆధిపత్యం కనబర్చింది. 2018 లోక్ సభ ఎన్నికలతో పోలిస్తే 2024లో బీజేపీ తన బలాన్ని పెంచుకుంటూ 42 శాతంపైగా ఓట్లతో 11 స్థానాల్లో గెలిచింది. 2018లో 36 శాతంతో 9 సీట్లు గెలిచిన బీజేపీ 2024లో మెరుగైన ఫలితాలను పొందింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో బిశ్వ శర్మ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం వరుసగా మూడోసారి భారీ విజ యంతో హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఇప్పటికే పలు జాతీయ ఎన్నికల సర్వేలు, అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

రాష్ట్ర రాజకీయాల్లో ఎన్నికల వేళ ఈ విమర్శలు, ప్రతివిమర్శలతో గౌరవ్ గొగొయ్‌కు కాంగ్రెస్‌లో ప్రయోజనం కలిగింది. అస్సాంలో బిశ్వ శర్మకు ప్రత్యామ్నాయంగా బలమైన నేతలు లేక కొట్టు మిట్టాడుతున్న కాంగ్రెస్ పార్టీకి గొగొయ్ రూపంలో నేత లభించాడు. అదే సమయంలో ఆయనపై దేశ భద్రతకు సంబంధించి ప్రమాదకరమైన ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి పెనంపై నుండి పొయ్యిలోకి పడ్డట్టు అయ్యింది.

ఇప్పటికే కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ దేశ భద్రతకు సంబంధించి వివాదాస్పదంగా వ్యవహరిస్తు న్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంగా ప్రత్యర్థి దేశాలకు ప్రయోజనం కలిగించేలా పావుగా మారుతున్నారు. గతంలో పాకిస్తాన్‌పై సర్జికల్ స్ట్రైక్, ఇటీవల ఆపరేషన్ సింధూర్‌పై కూడా కాంగ్రెస్ పార్లమెంట్ లోపల, బయట ఇలాగే వ్యవహరించింది. ఇప్పుడు చైనా అంశంలో కూడా ప్రచురితం కానీ నరవణే పుస్తకంతో రాజకీయాలు చేస్తుంది. అమెరికా భారత్‌ల మధ్య వాణిజ్య అంశాలపై కూడా మన దేశానికి నష్టం కలిగించేలా, దేశం పరువు తీసేలా రాహుల్ గాంధీ బృందం వ్యవహరిస్తోంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ మార్గదర్శ కత్వంలో లోక్‌సభలో ఉప ప్రతిపక్ష నేత గౌరవ్ గొగొయ్ నడుస్తున్నారు. దేశ భద్రతపై కాంగ్రెస్ పార్టీకి రాజ కీయాలు చేయడం పరిపాటిగా మారిన నేపథ్యంలో గొగొయ్ వ్యవహారంపై కూడా దేశ ప్రజల్లో ఆందోళన నెలకొంది. స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ అని, వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న పాత పార్టీ అని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి దేశ భద్రతతో రాజకీయాలు చేయడం దురదృష్టకరం.

దేశంలో ఎక్కడో చోట ఎన్నికలు నిత్యం జరుగు తూనే ఉంటాయి. ఈ ఎన్నికల్లో గెలుపోటములు కూడా సహజమే. అయితే దేశ భద్రతకు సంబంధించి శత్రు దేశాలకు సహకరించారనే ప్రమాదకరమైన ఆరోపణలను కూడా రాజకీయ కోణంలోనే చూపిస్తూ తప్పించోవాలని చూస్తున్న వారిపట్ల ప్రభుత్వాలు ఆచితూచి వ్యవహరించాలి. ఎన్నికలతో సంబంధం లేకుండా ఈ ఆరోపణలపై వాస్తవాలను బహిర్గతం చేయాలి. దేశ భద్రతతో పరాచికాలు ఆడుతున్న కాంగ్రెస్ పార్టీని కట్టడి చేయాలి. – శ్రీపాద



ఇప్పటికే కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ దేశ భద్రతకు సంబంధించి వివాదాస్పదంగా వ్యవహరిస్తు న్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంగా ప్రత్యర్థి దేశాలకు ప్రయోజనం కలిగించేలా పావుగా మారుతున్నారు. గతంలో పాకిస్తాన్‌పై సర్జికల్ స్ట్రైక్, ఇటీవల ఆపరేషన్ సింధూర్‌పై కూడా కాంగ్రెస్ పార్లమెంట్ లోపల, బయట ఇలాగే వ్యవహరించింది. ఇప్పుడు చైనా అంశంలో కూడా ప్రచురితం కానీ నరవణే పుస్తకంతో రాజకీయాలు చేస్తుంది.

"**బా**యిగారూ.. తమరికోసం దేవగిరి రాజ్యం నుండి వార్తాహరుడు ఏదో ముఖ్యమైన వార్తట.. తీసుకుని వచ్చా డు.." చెప్పి మళ్లీ కిందికి వెళ్లిపోయాడు శెట్టి.

ఆశ్చర్యంగా ఆ వేగు నుంచి వార్త లిఖించిన పట్టువస్త్రాన్ని అందుకుని చదివింది.

"కేయూరదేవుడు కొందరు ఆరే వీరులతో అనుమకొండకు వెళ్లి గణపతిదేవుని శరణువేడగా ఆయన ఆశ్రయం కల్పించినట్టు తెలియవచ్చింది."

కేయుర దేవుడు పోయి పోయి ఆ గణపతి దేవునితో కలిశాడా??

పగకు అసహ్యమనే ఆజ్యం పోసినట్లయ్యింది.

పెద్ద పెద్దగా పిచ్చి పిచ్చిగా అరుస్తూ ఆ లేఖను విసిరికొట్టింది బాల కవ్వల.

* * *

ఐదవ మెట్టు: ప్రకృతి విలయతాండవం.

వైద్యం అనే వ్యవస్థ చరిత్ర ప్రారంభానికి ముందే ఏర్పడిన మానవ సంక్షేమ వ్యవస్థల్లో మొదటిది. జ్వరపీడితుడైన ఆదిమానవుడు శరీరం వేటకు సహక రించనప్పుడు తన మనుగడ కోసం వెంపర్లాడాడు. అప్పుడే అనారోగ్యాన్ని గుర్తించాడు. ఆరోగ్యమూ, అనారోగ్యమూ కలిసే మనిషితో సహజీవనం చేస్తాయని గుర్తించాడు. బతకడం కోసం దేవుడిని దెయ్యాన్ని పూజించడం ప్రార్థించి మాత్రమే చేసి ఊరుకోలేదు. తన వేట సహచరులైన పెంపుడు జంతువులు.. క్రూం మృగాలు.. ఏఏ జబ్బుల బారిన పడుతున్నాయో పరిశీలించాడు. గడ్డి కొరికి లిప్త కాలంలో తిరిగి ఊసి వేస్తున్న ఉడుతలు, కుందేళ్లు, గేదెలు, ఆవులు.. అలా గడ్డి తినే జంతువుల ప్రవర్తనను గుర్తించడమే అతని తొలి వైద్య పరిశోధన. అంటే ఆ గడ్డి, ఆ చెట్టు కాయలు, ఆకులు తిన కూడదన్నమాట. నోట్లోకి వెళ్లిన దానిని బట్టే శరీరానికి ఆరోగ్యం, అనారోగ్యం కలుగుతున్నాయని గుర్తిం చాడు. ఆ కాలంలోనే ఈ ఆరోగ్య అంశాలపై దృష్టి పెట్టిన కొందరిని దేవతల్లా కొలవడంతో అథర్వణ వేదకాలానికి, వైద్యవ్యవస్థ ప్రతిభావంతులైన వైద్యులు ఏర్పడ్డాయి. అదే ఆయుర్వేదం అనే పేరుతో ఉపవేదంగా స్థిరపడింది. ఏమి తింటే అనారోగ్యం, ఆ అనారోగ్యానికి నివారణోపాయం, ఆ మందు మాకులు ఏవిటి? ఇలా వైద్యం విస్తరిస్తూ పోయింది. గణాలు, జనపదాలు, చిన్న రాజ్యాలు ఏర్పడేనాటికి వ్యక్తి అనారోగ్యం ఎన్ని రకాలు.. వాటికి తగిన మందులు.. కొంతవరకు సమాజంలో స్పష్ట మయ్యాయి.

వ్యక్తిగత దగ్గులు, జ్వరాల సంగతి అటుంచి ఒకరి నుండి మరొకరికి అంటుకుని అందరినీ.. ఊళ్లకు ఊళ్లనే చంపేసే అంటు వ్యాధులను గుర్తించాడు. వణికి పోయాడు. వాటికి అపరిశుభ్రతే ప్రధాన హేతువని గుర్తించాడు. ఇంటి శుభ్రత, ఒంటి శుభ్రత మాత్రమే కాదు.. వీధుల శుభ్రత, పరిసరాల శుభ్రత కూడా ఆరోగ్యానికి అవసరమని అంతగా తెలియని కాలం. ఆ తరహా సమాజ శుభ్రతకు అధికప్రాధాన్యత ఇచ్చినవాడు అశోక చక్రవర్తి. వీధులను శుభ్రం చేయించడం, అన్ని గ్రామాలలో మొక్కలు నాటించడం, బావులు తవ్వించడం తదితర కార్యక్రమాల ద్వారా సామాజిక పరిశుభ్రతకు అశోకుడు అధికప్రాధాన్యం ఇచ్చాడు. తద్వారా అంటువ్యాధులు గణనీయంగా తగ్గాయి. ఆ తర్వాత సమాజ శుభ్రతకు అంతటి ప్రాముఖ్యత ఇచ్చిన మహారాజు లేదు. దీనిపై ఈ శిబిరం తీవ్రంగా చర్చించి మన రాజ్యాలలో సామాజిక శుభ్రతకు తగిన ప్రణాళికలను రూపొందించుకోవడం తక్షణ కర్తవ్యమ్.

'పరహిత వైద్యరత్న' దీవి గోపాలాచార్యులు.. శిబిరంలో ఆ దేవుడు, ప్రకృతి కరుణిస్తే మనమంతా ఎన్నో వీరత్వ కబుర్లు, రాజ్య విస్తరణ, సాహిత్యం, ఆటలు, పాటలు, తెలుగులో అనువాదాలు, స్వతంత్ర కావ్యాలు, నాటకాలు, నాట్యాలు, వాణిజ్యం, పరదేశీ వాణిజ్యం.. ఎన్నైనా చెప్పుకోవచ్చు. కానీ సమాజాన్ని అతలాకుతలం చేసే కరవు కాటకాలు, వరదలు, ఉప్పెనల సంగతి ఏమిటి? ఆర్యావర్తపు రాజ్యాల సంగతి వదిలేయండి. ప్రకృతి విలయ విధ్వంసం, విపత్తులతో మన రాజ్యాలు అతలాకుతలం అవ్వడం లక్షలాది మంది చనిపోవడం మనందరకూ అనుభ వమే. ఈ విపత్తులు సమాజాన్ని అతలా కుతలం చేస్తున్నాయి. సామాజిక సమీకరణాలు మారిపోతు న్నాయి. ఈ వరదలు, ఉప్పెనలు, మాయదారి అంటురోగాలవల్ల ఊళ్లకు ఊళ్లు నామరూపాలు లేకుండా పోతున్నాయి. పాడి పంటా, గొడ్డు గోదా ఊడ్చిపెట్టుకుపోతున్నా యి. రాజులు ప్రజల గురించి కంటే పన్నుల వసూలు ఆగిపోతుందని దిగులు పడుతున్నారు కాని ప్రజల ప్రాణాలను ఎలా కాపాడాలి? అని తలపోయడం లేదు. ప్రజలకు దేవుళ్లను వేడుకోవడం, పూజారులు చెప్పిన మంత్ర తంత్రాలను నమ్మడం, బలులు ఇవ్వడం తప్ప మార్గాంతరం లేకుండాపోయింది. మన రాజుగారిని నిలదీసి అడుగుదామనే కనీస ఆలోచన కూడా ఇప్పటివరకు ప్రజలకు లేదు. పన్నులు వసూలు చేసుకుంటున్న మహారాజులు మమ్మల్ని కాపాడటానికి ఏమీ చేయడం లేదన్న బాధా వారిలో ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. అప్పుడప్పుడు స్థానిక 'స్థల' పాలకులకు విజ్ఞప్తులు చేయడం, గ్రామాధికారులను నిలదీసి అడగడం చేస్తున్నారు. ఇకపై ఈ పరిస్థితి ఉండ గూడదు మహారాజా! ఈ విపత్తుల నివారణ రాజ్యవ్యవస్థ తీవ్రంగా పరిగణించాలి. దీనిపై దృష్టి పెట్టాల్సి ఉంది. ఈ చింతనా శిబిరం దీనిపై చర్చి స్తుందని భావిస్తున్నాను.



# గణపతిదేవుడు




24

**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**

ప్రకృతి విపత్తుల నిపుణుడు, వాతావరణ శాస్త్రవేత్త వెంకటావధానులు

“మన రాజ్యాలన్నీ ప్రాకృతంగా వ్యవసాయ సమాజాలు. వ్యవసాయానికే కాదు మన బ్రతుకులకే ప్రధాన వనరు నీరు. మన రాజ్యాలలోనే కాదు ప్రపంచమంతటా నీటి చుట్టూ.. నీటిపైనే.. నాగరికత వెల్లివిరుస్తోంది. మన అఖండ భారతాన్ని విదేశీయులు సింధూదేశంగా పిలుస్తారు.. అంటే సింధూ నదీ పరివాహక ప్రాంతమనే కదా అర్థం. ఇక ఈజిప్టు నాగరికత నైలునదీ తీరాన వికసిస్తే యూఫ్రటిస్, టైగ్రిస్ నదుల పరీవాహ రాజ్యాలే గ్రీకు,బాబిలోనియా రాజ్యాలు.

మన దక్షిణావర్తంలోని చోళరాజ్యంలో కావేరి నదికి వరదలు చోళరాజ్య ప్రజలను సర్వనాశనం చేసేవి. అప్పుడే తొలి చోళరాజు కరికాలచోళుడు కావేరి నదికి ఆనకట్టలు కట్టి నదీ ప్రవాహాన్ని నియంత్రించి ఎన్నో ప్రాణాలను కాపాడాడు. పంటలు, ప్రజలు నాశనం కాకుండా రక్షించాడు. సింధూ రాజ్యాలకు మార్గదర్శి అయ్యాడు. ఆ నీటి యజ్ఞంలో పాల్గొన్న వంశం నాది.

తెలుగురాజ్యాలకు నీటి కొరత లేదు. బావి తవ్వి ఇల్లు. చెరువు తవ్వి ఊరు నిర్మించే సంస్కృతి మనది. ఇక మన చుట్టూ చెరువు, సరస్సు, కొలను, కుంట, మడుగు.. ఇలా ఎన్నో పేర్లతో నీరు మన చుట్టూనే ఉంది.. ఇప్పుడు దేనిని నది అంటారో.. దేనిని వాగు అంటారో చెబుతాను.

నీరు.. దాని విభిన్న రూపాలను మధుర రాజ్యం నుండి వచ్చిన నీటివనరుల నిపుణుడు పండిత శ్రీప్రసాద నాయక శిబిరంలో వివరిస్తున్నాడు.

“పడమర నుండి తూర్పునకు ప్రవహించి తూర్పు సముద్రంలో కలిసేది నది, తూర్పు నుండి పడమరకు ప్రవహించి పశ్చిమసముద్రంలో కలిసేది నదం, కడలిలో కాకుండా పెద్దనదిలో కలిసేది దాని ఉపనది. మైదానం లాంటి సమతల ప్రదేశంలో తక్కువ దూరం ప్రవహిస్తూ వ్యవసాయానికి ఉపయోగపడుతూ ఆఖరున పెద్ద నదిలో కలిసే దానిని ఏరు అంటారు. పర్వతాల మధ్యల్లో కొండనెర్రల్లో పుట్టే నీటి ఊటను సెల అంటారు. కొండల్లో పుట్టి ప్రవహించేది సెలయేరు. కొండలమీదుగా శబ్దంచేస్తూ ప్రవహించేది వాగు. ఒక దిక్కునుండి మరో దిక్కుకు వంపులు వంపులుగా ప్రవహించే దానిని వంక అంటారు. తూర్పుకనుమల వాలులో పుట్టి వేగంగా ప్రవహించే కొండ వాగులను గెడ్డ అంటారు. మహానదుల నీటిని మళ్లించడానికి తవ్విన నదీ పాయలను కాలువ అంటారు. కొండల నుంచి దూకి అడవుల గుండా ప్రవహించే దానిని కోన అంటారు. ఊరి దగ్గరగా వెళుతున్న నదుల ప్రవాహాన్ని ఉపయోగించుకోవడానికి నిర్దేశించిన చోటును రేవు అంటారు. కొండల మధ్య చిన్నచిన్న నీటి గుంటలను సరి అంటారు. ఈ సరిలన్నీ కలిసి నది అవుతుంది కాబట్టి నదికి మరో పేరు సరిత. పెద్ద నదులు అనేకానేక చోట్ల వరదల వల్ల, ఉప్పెనల వల్ల ఏర్పడ్డ చిన్న ప్రవాహాలను పాయ అంటా రు. అనేకానేక చిన్నచిన్న ప్రవాహాలు కలిశాక కొండల పైనుంచి పెద్దశబ్దంతో ఉరికే ప్రవాహాన్నే జలపాతం అంటారు. ఈ జలపాతాలు ఉధృతంగా దూకడం వల్ల ఏర్పడిన పెద్ద చెరువులాంటి దాన్ని గుండం అంటారు. భూజలం కూడా మనకు గొప్ప నిధి. కొన్నిచోట్ల భూమి లోపలి రాతి పొరల మధ్య నుండి పైకి ఉబికే జలధారనే నీటి బుగ్గ అంటారు. ఈ నీటి ప్రవాహాల వల్ల అక్కడక్కడా నీరు నిలిచి ఉంటే దానిని మడుగు అంటారు.

ఇక మన చిన్నచిన్న రాజ్యాలన్నింటిని కలిపేసి మనం ఊహిస్తున్న తెలుగుసామ్రాజ్యాన్ని తీసుకుంటే ఇందులో దాదాపు డెబ్బై నదీ పరీవాహక ప్రాంతాలున్నాయి. గోదావరి, కృష్ణ, పెన్నా, నాగావళి, వంశధార, ముచికుంద అనేవి అతి పెద్ద నదులు. శారద, వరాహ, స్వర్ణముఖి, బుడమేరు, రోశీపేరు, గుండ్లకమ్మ, కాళంగి.. వంటివి ఉపనదులు.. ఇలా సహజంగా ఏర్పడిన ఎన్నెన్నో వాగులు, వంకలు, సెలయేళ్లు, పాయలు, జలపాతాలు, గుండాలు.. ఉన్నాయి మహారాజా. వీటన్నింటి వలన అనాది నుంచి వ్యవసాయాన్ని దినదిన ప్రవర్ధమానం చేస్తూనే ఉన్నాడు రైతు. ఈ ఆధునిక కాలానికి కృష్ణానది పన్నెండు చిన్నరాజ్యాల గుండా ప్రవహిస్తూ పోయి రెండు మూడు చీలికలు అయ్యి అవి దివి రాజ్యం దగ్గరలో సముద్రంలో కలుస్తాయి. నదిపై ఏమీ చేద్దామన్నా ఈ పన్నెండు మంది రాజులు ఒక్కమాటకి కట్టుబడి ఉండటం జరగదు కాక జరగదు. కాబట్టి రాజ్యాలన్నింటిని కలిపితే కాని ఈ నీటివనరులను సమర్థమంతంగా ఉపయోగించుకోవ డానికి సాధ్య పడదు. గోదావరి నది పాతిక రాజ్యాల గుండా పోతుంది. ఈ అద్భుత నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలంటే ఏలినవారు ఈ చిన్న రాజ్యాలను జయించి ఏకం చేసి విస్తృత తెలుగు సామ్రాజ్యాన్ని స్థాపించి తీరాలి. అప్పుడే ప్రజలకు ఈ ప్రకృతి వనరుల ప్రళయాలనుంచి శాశ్వత రక్షణ ఏర్పడు తుంది.”

నీటి వనరుల నిపుణులు పండిత శ్రీ ప్రసాద నాయక, మధుర రాజ్యం, చింతనా శిబిరంలో..

* * *

శకునాలపల్లె, కోవెలకుంట్ల రాజ్యం కోవెలకుంట్ల రాజ్యంలో ఓ సాధారణ గ్రామం శకునాలపల్లె. సాధారణ పేద గ్రామం.

కోవెలకుంట్ల మెట్ట ప్రాంత రాజ్యం. కాలువలు లాంటి నీటి వసతులులేని రాజ్యం. గ్రామానికో చెరువున్నా వర్షం కురిస్తేనే అవి నిండేది.. కప్పలు బెకబెకలాడేది. వర్షాధారమే వ్యవసాయం. వ్యవసాయాధారమే జీవనం. అలాంటి శకునాల పల్లె ఇప్పుడు సంతోషసాగరమై పొంగిపోతోంది. కారణం ఇటీవల కురిసిన వర్షాలు. ఏనాడూ లేనంత ఉధృతంగా ఇళ్ల కప్పులు ఎగిరి పోగొట్టిన తీవ్రమైన గాలులతో.. ప్రచండ ఉరుములు, మెరుపులతో కురిసిన అమోఘమైన వర్షాలు ఆ గ్రామీణులను పులకింపజేశాయి. గ్రామదేవతలకు, పితృదేవతలకు కనిపించిన, కనిపించని దేవతలెందరికో పొర్లు దండాలు పెట్టారు. ప్రతి రైతు దంపతులు మెత్తగా



మత్తి భానుమూర్తి

తడిసిన తమ వ్యవసాయభూమిపై సాగిలపడి దండాలు పెట్టి ఏరువాక జరిపి పూజలు చేసి దుక్కి దున్నడం ప్రారంభించారు. శకునాలపల్లె మాత్రమే కాదు కోవెలకుంట్ల రాజ్యంలోని గ్రామాలన్నిటా ఈ వర్షరుతువు తెచ్చింది వ్యవసాయ సంబరం.. పల్లె పండుగ.

గ్రామ సమయం శెట్టి వకుళయ పొలానికి పోతూ, ముందు వెళుతున్న ఓబులప్పను గుర్తించి వడివడిగా నడిచి అతనిని చేరి “ఓబులప్పా..! నిన్నటి నుండి ఏదో మురికి వాసనలాంటిది వస్తోంది నాకు. నీకూ వస్తోందా.. నాకేనా??.. నాకే అయితే నాకేదో కొత్త జబ్బు వచ్చినట్లే..” అన్నాడు.

అప్పుడు వకుళయ వైపు తలతిప్పాడు ఓబులప్ప. అతని ముఖాన్ని చూసి తెల్లబోయాడు వకుళయ. కారణం అప్పటికే తన పై పంచెతో ముక్కు మూసుకుని పొలం వైపు పోతున్నాడు ఓబులప్ప. ఆయన పై పంచెతో ముక్కు మూసుకోవడం చూసి సంభ్రంగా వకుళయ. “అరే.. నేను అదే అడగబోతున్నాను నీకు ఏదైనా చెడు వాసన వస్తోందా అని..? ముక్కు మూసుకున్నావంటే ఏదో చెడు వాసన వస్తోందన్నమాటే..

ఎన్నో గ్రామాలు పూర్తిగా వరదల్లో ఒక్కప్రాణి కూడా లేకుండా పీనుగుల దిబ్బలయ్యాయని తెలిసినప్పుడు కోవెలకుంట్ల రాజ్య గ్రామవాసులంతా తెల్లబోయారు. అంటే తగిన వర్షాలు కురుస్తున్నాయని ఈ మెట్ట రాజ్య గ్రామీణులు ఆనందంతో వరుణ దేవుడికి చేతులెత్తి మొక్కుతున్నకాలంలోనే దూరంగా పారుతున్న కృష్ణానదీ, మరింత ఆవలగా పారుతున్న గోదావరి, ఇవతలగా పెన్నా.. వీటి ఉపనదులు వర్షాలవల్ల వరదలతో పోటెక్కి వాటి పరీవాహక రాజ్యాలలో గ్రామాలలో ఎంతటి భీభత్సాన్ని సృష్టించాయో వీళ్లకు తెలియదు.

అవును కదా ఓబులప్పా..?!”

“అవును శెట్టి. నిన్నటి నుండి నాకు ఈ వాసన ఏదో తెలుస్తోంది. మా ఆవిడతో అన్నాను. ఆవిడ ఫక్కున నవ్వి వంద యోజనాల దూరాన ఏదైనా గేదె చస్తే కూడా ఆ వాసనను మీ ముక్కు పసిగడుతుంది కదా! ఏ వాసనా నాకు రావడం లేదు అంది.

“ప్చ్.. నాకేదో.. గాలిలో తేడా తెలుస్తోంది..” అన్నాడు తలెత్తి వాసన మరీ మరీ పీలుస్తూ.

అలా అలా సందేహాస్పదంగా ముక్కులకు తాకుతున్న చెడువాసన ఏదో మరునాటికి భరించలేనంత తీవ్ర దుర్గంధంగా మారి ఊరిని చుట్టుముట్టింది. చిన్న చిన్న జంతువులు, పిట్టలు, పురుగులు లాంటివి ఆ దుర్గంధాన్ని భరించలేక చనిపోవడం మొదలయ్యింది. మూడో రోజుకు మనుషులు.. ముదుసలి వారు, పసిపిల్లలు మరణించడాన్ని గుర్తించిన పెద్దలు వైద్యం కోసం పక్క ఊరికి వెళితే ఆ ఊరు అప్పటికే సగం ఖాళీ అయ్యిందని గుర్తించి గుండెలు బాదుకుంటూ శకునాల పల్లెవాసులు ఒకరికి ఒకరు చెప్పుకుంటూ మూటా ముల్లె సర్దుకుని ఊరవతల నున్న అడవుల్లోకి పరుగులు పెట్టారు.

“అమ్మోరు.. మహమ్మారి మళ్లీ వచ్చింది. గాలి తగిలితే చాలు పక్కోళ్లకి అంటుకుంటుంది. పారిపోండి దాక్కోండి. జ్వరం వచ్చినవాళ్లు చచ్చినవాళ్లతో సమానమే. వదిలేసి మీ ప్రాణాలు రక్షించుకోండి ముందు..”

విషజ్వరం గ్రామాన్ని చుట్టుముట్టింది. పిట్టలు, పిల్లులు, కుక్కలు, కోళ్లు.. రాలిపోతుండగా అయిన వాళ్లను కాపాడుకోవడానికి ఊరవతల అడవిలోకి పోయి.. అంతా ఓ చోట ఉండకుండా దూర దూరంగా చిన్న చిన్న పందిళ్లు గుడిసెలు వేసుకుని బితుకు బితుకుమంటూ బతుకుతున్నారు. వేప మండలు ఒళ్లం తా కప్పుకుంటున్నారు. సాంబ్రాణి పొగ వేసుకుంటున్నారు. బతుకంటే ఎంత భీభత్సమో.. భయానకమో..

బతుకుపై ఆశ అంత తీవ్రమైనది.. బతకాలి.. బతకాలి.. ఎలా??

మరికొన్ని రోజులకు తెలిసింది ఏవిటంటే..

‘మొన్నటి వర్షాలకు మనమంతా ఆనందంతో చిందులు వేశాం. పొంగి పోయాం. ఆ వరుణదేవుడు కరుణచూపాడని ఆకాశానికి దండాలు పెట్టాం. కానీ నిజానికి ఆ వర్షాలకు మన పక్క రాజ్యాల గుండా పోతున్న కృష్ణమ్మ నది పొంగి పొర్లిం దట. పై రాజ్యాలలో కురిసిన వర్షాలకు నది వరద లతో తీరాలలోని గ్రామాలను, పురాలను ముంచెత్తా యట. వాటి దెబ్బకు గ్రామాలకు గ్రామాలే నామ రూపాలు లేకుండా వరదల్లో కొట్టుకు పోయాయట. ఆ గ్రామస్తులు నీటిలో మునిగి చనిపోయారట. కొన్ని గ్రామాలలో ఒక్కరు కూడా బ్రతకలేదట. శవాలు నీటిలో నాని నాని.. వాటి నుండి పురుగులు పుట్టాయట. వాటివల్ల కొత్త జబ్బులు.. అంటే అంటు రోగాలు పుట్టాయట. అవి మనల్ని ఇప్పుడు చంపుతున్నాయట. పక్క ఊరు గౌరారం వణిజుడు చెప్పాడు. వాళ్ల గ్రామంలో వేంచేసి ఉన్న వైద్యుడు చెప్పాడట.. చెప్పి చచ్చాడట. ఆయన ఎవరికో వైద్యం చేయడానికి పోతే ఆయనకే అంటువ్యాధి అంటుకుని ఆయనే గిలగిల కొట్టుకుని చచ్చాడట..”

ఎంతటి విషాదం!!

సమాచారం ఏమాత్రం బయటకు తెలియని రోజులు.. అంటువ్యాధులు కూడా ఊళ్లో ఒకరికి సోకేవరకు పక్కవారికి తెలియదు. గ్రామానికి గ్రామానికి మధ్య దూరం చాలా ఎక్కువ. మధ్య అంతా దట్టమైన అడవుల్లాంటి చెట్లు చేమలు. దారి లేని అడ్డదిడ్డంగా ఎదిగిన పొదలు, చిన్న చిన్న కొండల్లాంటి గుట్టలు.. అన్ని క్రూరజంతువులకు, దోపిడీ దొంగలకు ఆలవాలాలు. అందుకే ఒక్కరుగా ఎవ్వరూ గ్రామం దాటడం జరగదు. కేవలం స్థల వద్ద వారం వారం జరిగే సంతలకు గుంపులుగా వెళ్లి వారానికి కావలసిన వస్తువులన్నీ మారకానికి కొని తెచ్చుకుంటారు. సంతల వద్ద ఇరుగుపొరుగు గ్రామాల వారితో జరిపే మాటామంతీతో మాత్రమే బయటి ప్రపంచంలో ఏమి జరుగుతోందో తెలుస్తుంది. అలా తెలిసింది నదులప్రక్కనున్న గ్రామాలన్నీ వరదలతో సర్వనాశనం అయ్యాయని.

ఎన్నో గ్రామాలు పూర్తిగా వరదల్లో ఒక్క ప్రాణి కూడా లేకుండా పీనుగుల దిబ్బలయ్యాయని తెలిసినప్పుడు కోవెలకుంట్ల రాజ్య గ్రామవాసులంతా తెల్లబోయారు. అంటే తగిన వర్షాలు కురుస్తున్నాయని ఈ మెట్ట రాజ్య గ్రామీణులు ఆనందంతో వరుణ దేవుడికి చేతులెత్తి మొక్కుతున్నకాలంలోనే దూరంగా పారుతున్న కృష్ణానదీ, మరింత ఆవలగా పారుతున్న గోదావరి, ఇవతలగా పెన్నా.. వీటి ఉపనదులు వర్షాలవల్ల వరదలతో పోటెక్కి వాటి పరీవాహక రాజ్యాలలో గ్రామాలలో ఎంతటి భీభత్సాన్ని సృష్టించాయో వీళ్లకు తెలియదు.

అంటురోగాలవల్ల మాత్రమే ఆ వరదల తీవ్రత, వాటి వల్ల ఆనవాలు లేకుండా కొట్టుకుపోయిన గ్రామాలు, ఒండ్రు బురద మేట వేసిన పొలాలతో ఆ గ్రామాలన్ని సర్వం కోల్పోగా.. ఆ పీనుగుల వల్ల పుట్టిన అంటువ్యాధులతో ఈ గ్రామాలు కూడా ఇప్పుడు పీనుగుల దిబ్బలుగా మారబోతున్నాయని గుర్తించిన ఈ రాజ్యవాసులు ఇప్పుడు చావు భయంతో వణికిపోతున్నారు.

ఈ ఏడాది దక్షిణావర్తంలోని నదీ ప్రవాహ రాజ్యాలన్నీ అతివృష్టితో అతలాకుతలమయ్యాయి. తెలుగు భాషారాజ్యాలలో ప్రవహించే అతి ప్రధాన నదులు కృష్ణ, గోదావరి, పెన్నానదులు. అయితే ఇవన్నీ మరాఠా భాషా రాజ్యాలలో పుట్టి.. కన్నడభాషా రాజ్యాలగుండా పోతూ.. ఎక్కువభాగం తెలుగు భాషా రాజ్యాల గుండానే ప్రవహిస్తూ తెలుగు రాజ్యాలలోనే సముద్రంలో కలుస్తాయి. అందువల్ల ప్రయోజనం ఇక్కడే ఎక్కువ. అపకారం కూడా ఇక్కడే ఎక్కువ.

గోదావరి, కృష్ణవేణి, పెన్నా నదీ.. తెలుగువారి అసలు సిసలు తల్లులు. నదీమాతలు.. నదులకు పేర్లు పెట్టింది ఎవ్వరు?? మహారాజులు, మహా పండితులు కాదు. సాధారణ ప్రజలు. ఆయా అమ్మతల్లుల ఒడిలో నిత్యమూ బ్రతుకులు పండించుకుంటున్న రైతులు.

కొండల రంగులను బట్టి నల్లకొండ, ఎర్రకొండ,

వెలిగొండ అని పేర్లు పెట్టుకున్నట్లే నదులకు కూడా రంగును బట్టే పిలవసాగారని చెప్పుకోవచ్చు. అసలు నదిని సూచించే దక్షిణాదివారి పదం బెన్నా.. అదే పెన్నా అయ్యింది. తెల్లని నీరున్న నది కాబట్టి తెల్లబెన్న అంటే.. నల్లని నీరున్న నదిని కృష్ణ, నల్లబెన్న అన్నారు.

గోదావరి నది ఎక్కడో వింధ్య పర్వతాల మధ్య త్రయంబకేశ్వరం వద్ద పుట్టి మరాఠ రాజ్యాల గుండా ఆగ్నేయంగా సాగి పీఠభూమికి వచ్చి అక్కడి నుంచి తూర్పునకు తిరిగింది. ఏ నది అయినా మహానది అయ్యిందంటే దానికి బోలెడు ఉపనదులు కలిసినట్లే. దర్న, ప్రవర, మూలా, కద్రవ అనే ఉపనదులను కలుపుకున్న గోదావరి ఒకప్పటి శాతవాహనుల రాజధాని ప్రతిష్ఠానపురం చేరుతుంది. అక్కడ మంజీర, వంజీర.. ఆ తర్వాత ఉత్తరాది నుండి ప్రాణహిత, ఇంద్రావతి అనే మరో రెండు ఉపనదులతో మరింత బలిష్టమై సరస్వతీ క్షేత్రమైన బాసర వద్ద తెలుగు రాజ్యాలలోకి అడుగిడి మన రాజధాని ఓరుగల్లు దగ్గరగా వెళుతూ రామక్షేత్రమైన భద్రాచలం వద్ద విశాలమై కోన రాజ్యాలను అడుగడుగునా తడిమి వసిష్ఠ గోదావరి, గౌతమీ గోదావరి అనే రెండు అఖండ పాయలతో మొత్తం ఏడు పాయలుగా చీలి సముద్రుడిని కలుస్తోంది. మొత్తం పాతిక తెలుగు రాజ్యాలగుండా వేయి గ్రామాల మధ్యగా వెళుతూ వేలవేల ఎకరాల భూమిని సస్య శ్యామలం చేస్తోంది.

అలాగే కృష్ణ నదీమతల్లి కూడా సహ్యాద్రి పర్వతశ్రేణుల్లో మహాబలేశ్వరం వద్ద పుట్టి మరాఠా రాజ్యాలు, కన్నడ రాజ్యాల మీదుగా తెలుగు రాజ్యాలలోకి గంతులు వేస్తూ వచ్చి దాదాపు ఇరవై ఎనిమిది రాజ్యాలలోని పన్నెండు వందల గ్రామాలను సస్యశ్యామలం చేస్తూ ఆయా రాజ్యాల సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సాహిత్య, వాణిజ్య, జన జీవనాన్ని అమోఘంగా ప్రభావితం చేస్తోంది.

పుట్టిన మహాబలేశ్వరం కొండలవద్దే కోయ్ నా, వేణీ, సావిత్రి, గాయత్రి.. అనే ఉపనదులను కలుపుకున్న కృష్ణమ్మ సముద్రాన్ని చేరేలోగా వరణ, భీమ, దిండి, ఎర్ల, పెద్దవాగు, హాయిలా, మూసీ, పాలేరు, మున్నేరు, దూద్ గంగ, ఘటప్రభ, మలప్రభ, తుంగ–భద్ర.. లాంటి ఎన్నో ఉపనదులను ఆహ్వానించి అక్కున చేర్చుకుంది. ప్రవాహమార్గమంతా దిండి, ఒకసెట్టి వాగు, హాలియా, పెద్దవాగు, మూసి, పాలేరు, మున్నేరు.. లాంటి చిన్న చిన్న నదులు.. లోత్తవాగు, బలుసుచంద కాల్వ, పెద్దపాయ వాగు, కొల్లం వాగు, మొగలూరు వాగు, నెక్కంటి వాగు, కామాక్షమ్మవాగు, వజ్రపాటివాగు, కరక్లి వాగు, పాలంక వాగు, మద్దుఅసరి వాగు, కయ్యానాల, వరికాపూడి వాగు, జుర్రివాగు, జక్కులగుండం వాగు, మోతవాగు, మునిగుండాల వాగు, చంద్రవంక, ఎడిబొగుల వాగు, బోత్తలవాగు, వెదుళ్లపాయ వాగు, గుండాల వాగు.. మొదలైన వందల వాగులు, వేల వంకలు, వందల కాలువలు కూడా కృష్ణమ్మతో కూడి దాదాపు పన్నెండు వందల పైచిలుకు తెలుగు గ్రామాలను సస్య శ్యామలం చేస్తోంది.

అలాగే తుంగ, భద్ర అనే రెండు నదులు జమిలిగా పుట్టి కలిసి ఏకనది తుంగభద్రగా ముందుకు సాగుతూ అనేకానేక ఉపనదులను కలుపుకొంటూ పోయి కృష్ణమ్మకు ఉపనదిగా కూడా గుర్తింపుపొంది పది రాజ్యాల గుండా ప్రవహిస్తూ ఐదువందల గ్రామాలను పునీతం చేస్తోంది. అలాగే పెన్నా, నాగావళి, వేదవతి, వేగావతి, హంద్రి, మహేంద్ర తనయ, వంశధార, సువర్ణముఖి, గోముఖి, గోస్తని, శారద, మేఘాద్రిగడ్డ, వరాహా, తాండవ, ఏలేరు, శబరి, సీలేరు, పాములేరు, సోకలేరు, గుండేరు, బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు, మున్నేరు, భవనాశి, రోశీపేరు, గుండ్లకమ్మ, ముదిగండి, పాలేరు, కుందూ, మన్నేరు, చిత్రావతి, కుందూ, పాపాఘ్ని, సగిలేరు, చెయ్యేరు, బొగ్గేరు, కందలేరు, కాళంగి, కుశస్థలి, పాలేరు.. కౌండిన్య.. ఇలా చెప్పుకుంటూ పోతే పదిరోజులు చెప్పగలిగిన నదులు, నదాలు, వాగులు, వంకలు, కాలువలు, చెరువులు, బావులు.. ఎందరెందరో నీటిదేవతలు, దేవుళ్లు మన తెలుగు రాజ్యాలలో అద్భుతాలను సృష్టిస్తూ.. అప్పడప్పుడూ ప్రళయాలు కూడా సృష్టిస్తారు.

అలాంటి ప్రళయమే ఈ ఏడాది ఒక్కసారిగా వచ్చి పడింది.

**(సశేషం)**


## జాగృతి యాప్ వినియోగంపై విన్నపం

ఏడున్నర దశాబ్దాలకు పైబడిన సుదీర్ఘ ప్రస్థానంలో సాంస్కృతిక ఔన్నత్యం, రాజకీయాలు, సామాజిక అంశాలు, వర్తమాన సమస్యలు, కళలు, సాహిత్యం, విజ్ఞానశాస్త్రం, పర్యావరణం వంటి పలు అంశాలను చర్చించే విలువైన ఎన్నో వ్యాసాలను జాగృతి అందిస్తూ వస్తోంది. ఈ సంవత్సరం సంఘ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నాము.

**ఈ సందర్భంగా పాఠకులకు మరింత చేరువయ్యేందుకు జాగృతి యాప్‌ని సిద్ధం చేశాం.**

యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవడానికి ప్లేస్టోర్‌లో **Jagriti Weekly** అని సర్చ్ చేయండి లేదా పక్కనున్న QR Code స్కాన్ చేయగలరు.

APP Login -ఎడమవైపు Menu మీద క్లిక్ చేసి, Login ఎంపికపై క్లిక్‌చేస్తే Login Screen కనిపిస్తుంది.

1. తెరపై కనిపించే యూజర్ నేమ్, పాస్ వర్డ్‌తో లాగిన్ కావచ్చు.
2. Login Screen కింద **Click here to** login with Phone Number పైన క్లిక్ చేసి ఫోన్ నెం. నమోదు చేస్తే, మీ మొబైల్‌కి OTP వస్తుంది. OTPతో లాగిన్ అవ్వండి.

3 మొదటిసారి Login కాగానే, Password మార్పు చేసుకోమని సందేశంతో Screen వస్తుంది. మార్చుకొని, మరలా Login అవ్వాలి.

4 Dashboard: Profile information – User Id, Name, Profile status, Start, End Date, and Receipt Amount వివరాలు కనిపిస్తాయి.

5 Profile Management : View Profile–మీ వ్యక్తిగత చిరునామా, అమౌంట్ వివరాలు చెక్ చేసుకోండి. చిరునామా మార్పు కోసం పైన ఉన్న **JAGRITI** లోగోకి పక్కనే ఉన్న Edit Profileని క్లిక్ చేయండి. పోస్టల్ అడ్రసు ఇచ్చి, పిన్‌కోడ్ టైప్ చేస్తే రాష్ట్రం, జిల్లా వివరాలు వాటంతట అవే వస్తాయి. మండలం, సబ్ పోస్ట్ ఆఫీసు, సంఘ విభాగ్, జిల్లా, ఖండ/నగరాలను మీరు ఎంపిక చేస్తే సరిపోతుంది.

6 Support ticket: మీకు ఏదైనా సమస్య ఉంటే ఇందులో నమోదు చేయండి. 24 గంటలో మీకు కాల్ చేస్తాము.

7 మిగితా వివరాలు Subscriber Login Videoలో చూడండి.

**– మేనేజర్**

# భారతీయ మూలాలకు చీడపురుగు!

సాధారణంగా గేమ్స్‌ను ఎటువంటి ప్రమాదం లేని వినోదంగా పరిగణించడం కద్దు. కానీ ఇటీవల టాస్క్ ఆధారిత కొరియన్ గేమ్స్‌వల్ల చోటు చేసుకుంటున్న విషాద సంఘటనల నేపథ్యంలో జెన్‌జెడ్‌లో ఇదొక ప్రమాదకర ధోరణిగా మారుతుండటం వర్తమాన వైచిత్రి! ఇటువంటి గేమ్‌లు ఆడటం వల్ల తీవ్రస్థాయిలో ప్రమాదాలు ఎదురయ్యే అవకాశమున్నదని మానసిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ గేమ్స్ ఆడటం వల్ల కలిగే విపరిణామాల్లో మొదటిది మానసికంగా తారుమారు కావడం, తన గుర్తింపును తానే కోల్పోవడం. అంటే కొన్ని గేమ్స్, ఆడేవారిని కొరియన్ పేర్లు పెట్టుకునే విధంగా ప్రోత్సహిస్తాయి. అంటే వీటిని ఆడేది పిల్లలే కాబట్టి వారు ఆ విధంగా చేయడం వల్ల తమ "గుర్తింపునకు నిజ జీవిత సంబంధాలను కోల్పోవడం" జరుగుతోంది. ఫలితంగా వీరు వాస్తవిక ప్రపంచానికి దూరంగా వెళ్లిపోతున్నారు. ఇది ఏ స్థాయికి వెళుతున్నదంటే, ఒకానొక పరాకాష్ట దశలో వీరు "కొరియాయే మా జీవితం" అన్న స్థాయికి చేరుకొని, చివరకు తమ మూలాలు భారత్‌లో ఉన్నాయన్న సంగతిని కూడా అంగీకరించడంలేదు.

భావోద్వేగ పూరిత కథలు, సిమ్యులేషన్ ఫార్మాట్లు మిథ్యా ప్రపంచానికి, వాస్తవిక ప్రపంచానికి మధ్య సరిహద్దును చెరిపేయడంతో, ఈ గేమ్స్‌లో పాల్గొనే వారిని పూర్తిగా డిజిటల్ గేమ్ మాస్టర్స్ లేదా కాల్పనిక పాత్రలపై భావోద్వేగపరంగా పూర్తి స్థాయిలో ఆధారపడే దశకు తీసుకెళ్లడం ఈ గేమ్‌ల లోని ప్రత్యేకత.

విపరీతంగా చెడ్డపేరు తెచ్చుకున్న "బ్లూ వేల్ ఛాలెంజ్" గేమ్ మాదిరిగానే అనధికారిక "కొరియన్ లవ్ గేమ్స్" రోజువారీగా ఇచ్చే ప్రొఫైల్ చిత్రం మార్పు వంటి ప్రమాదరహిత టాస్క్‌లు క్రమంగా 50 రోజుల తర్వాత స్వీయహాని లేదా ఆత్మహత్యకు పురికొల్పే దశకు చేరుకుంటాయి. ఈ గేమ్స్ సాధారణంగా ప్రైవేటు సోషల్ మీడియా లింక్‌ల ద్వారా అందు బాటులో ఉంటాయి తప్ప, అధికారిక యాప్‌ల్లో కనిపించవు. ముఖ్యంగా తల్లిదండ్రులు కనిపెట్ట కుండా పిల్లలు రహస్యంగా ఈ గేమ్స్‌ను ఆడటానికి ఇదే ప్రధాన కారణం. ఆవిధంగా ఆడటానికి టీనేజర్లను ఈ గేమ్స్ ప్రోత్సహిస్తాయి!

**డిజిటల్ ప్రపంచంతో మమేకం**

ఈ గేమ్స్ ఆడేవారు అత్యద్భుతమైన డిజిటల్ ప్రపంచంతో మమేకమవడం వల్ల వారిలోని మెదడు తీవ్రస్థాయి ఉద్దీపనలకు లోనవుతుంది. ఫలితంగా వారు వాస్తవ ప్రపంచంలో తమ రోజువారీ పనులు ముఖ్యంగా చదువుపై ఏవిధమైన ఆసక్తి చూపరు! తమ వయసుకు అత్యవసరమైన చదువు, ఇతర కార్యకలాపాలు వారికి ఎటువంటి సంతృప్తిని ఇవ్వవు. పిల్లలు ఈ గేమ్‌ల పేరుతో అధికసమయం స్క్రీన్‌పైనే దృష్టిని కేంద్రీకరించడం వల్ల వారి మెదడులోని ప్రీ ఫ్రంటల్ కార్టెక్స్ దెబ్బతింటుంది. ఉద్దీపనల నియంత్రణ, నిర్ణయాలు తీసుకోవడంలో ఈ భాగం కీలకపాత్ర పోషిస్తుంది. ఇది దెబ్బతిన్న పిల్లల ప్రవర్తన ప్రమాదకరంగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తు న్నారు. దీనికి బానిసలైన పిల్లలు, యువత తమకు తాము సామాజిక జీవితం నుండి విడివడి ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారు. వీరు తామే సృష్టించుకున్న డిజిటల్ ప్రపంచంలో మునిగిపోయి, ఇతరులతో వ్యక్తిగత సంభాషణ, సంబంధాలను ఎంతమాత్రం పట్టించుకోరు.

**ముగ్గురు అక్కాచెల్లెళ్ల విషాదం**

ఫిబ్రవరి నెలలో ఘజియాబాద్‌కు చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు "కొరియన్ లవ్‌గేమ్"లో పూర్తిగా మునిగిపోయి, ఇక ఈ గేమ్ లేకపోతే తాము బతకడం అసాధ్యమని భావించి ఆత్మహత్యకు పాల్ప డటం దేశాన్ని కుదిపేసింది. ముఖ్యంగా దేశంలోని జెన్‌జెడ్‌పై ఈ గేమ్‌ల వల్ల పడుతున్న ప్రతికూల ప్రభావం ఎంత దారుణంగా ఉంటున్నదీ ఈ సంఘటన స్పష్టం చేసింది. ముఖ్యంగా "టాస్క్", "ఛాలెంజ్" ఆధారంగా నిర్వహించే కొరియన్ గేమ్స్‌కు ఎంత దారుణంగా బానిసలవుతున్నదీ దీని ద్వారా తెలిసినా, వెలుగులోకి రాని సంఘటనలు ఇంకా ఎన్ని ఉన్నాయో తెలియదు. విదేశీ డిజిటల్ సంస్కృతి మనదేశ జెన్‌జెడ్‌పై చూపుతున్న ప్రతికూల ప్రభావం



## కొరియన్ గేమ్స్

2020 నుంచి దక్షిణ కొరియా డెవలపర్స్ భారత్‌పై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. క్రాఫ్టన్ ఇండియా ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ ద్వారా 200 మిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టారంటే ఈ గేమ్‌లకు మనదేశంలో ఎంతటి ఆదరణ ఉన్నదీ అర్థమవుతుంది.కొరియన్ గేమ్స్ వీడియోల రూపంలో ఉంటాయి. వీటిని దక్షిణ కొరియాకు చెందిన ఒక గ్లోబల్ హబ్... మొబైల్, పీసీ గేమింగ్ పరిశ్రమలకోసం రూపొందించింది. 2010లో భారత్‌లోకి ప్రవేశించిన ఈ గేమ్స్ విపరీత ప్రాచుర్యం పొందాయి. మనదేశంలో మంచి ఆదరణ పొందిన గేమ్స్ ఈవిధంగా ఉన్నాయి.

- బ్యాటిల్ గ్రౌండ్స్ మొబైల్ ఇండియా: బీజీఎంఐ ఇండియా వర్షన్ 2021లో విడుదలైంది.
- పబ్జీ మొబైల్: దీన్ని ద.కొరియా కంపెనీ క్రాఫ్టన్ అభివృద్ధి చేసింది. మనదేశంలో బాగా పాపులర్ అయింది. 200మిలియన్ల మంది దీన్ని ఆడతారు. 2018లో గ్లోబల్ లాంచ్‌తో ఇండియాలో ప్రవేశించింది.
- రోడ్ టు వాలోర్–ఎంపైర్స్: దీన్ని కూడా క్రాఫ్టన్ కంపెనీ అభివృద్ధి చేసింది. భారతీయ కంటెంట్ ఉండటం దీని ప్రత్యేకత.



నేపథ్యంలో వీటి నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి.

ఆత్మహత్య చేసుకున్న ముగ్గురు టీనేజ్ అమ్మాయిలు "కొరియన్ లవ్ గేమ్" లేదా "కొరియన్ లవర్ గేమ్" లేదా "వీ ఆర్ నాట్ ఇండియన్స్"కు పూర్తిగా బానిసలైనట్టు తెలుస్తోంది. కోవిడ్ మహమ్మారి కాలంలో మనదేశంలో విపరీతంగా విస్తరించిన ఈ గేమ్‌ను వీరు మూడేళ్లుగా ఆడుతున్నట్టు వార్తలు వచ్చాయి. ఈ గేమ్‌పై నిర్వహించిన ప్రాథమిక విచారణ విస్తుకొలిపే నిజాలను వెల్లడించింది. ఇందులో మొత్తం 50 దశలుంటాయి. చిట్టచివరి దశలో ఆత్మహత్యకు పురికొల్పుతుంది. ఇది సరిగ్గా అత్యంత అప్రతిష్టను మూటగట్టుకున్న "బ్లూ వేల్ ఛాలెంజ్" లేదా "మొమొ ఛాలెంజ్" గేమ్‌ల మాదిరిగా ఉండటం గమనార్హం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ బాలికలు స్కూలుకెళ్లడం లేదా బయటకు వెళ్లడం పూర్తిగా మానేసారు. రోజువారీ జీవితాన్ని పూర్తిగా మరచి, ఎవరితో సంబంధం లేకుండా ఒంటరిగా కాలం గడిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనించి, వారు ఫోన్లు వాడకుండా కట్టడి చేయడం వారిని తీవ్ర నైరాశ్యానికి గురిచేసి చివరకు "సారీ నాన్నా, కొరియాయే మా జీవితం" అంటూ ఒక నోట్ పెట్టడం కంట నీరు పెట్టించింది. వీరు ఆత్మహత్యకు కూడా వెనుకాడలేదంటే ఈ గేమ్ వారిపై కలిగించిన ప్రభావం తీవ్రత ఎంతస్థాయిలో ఉన్నదీ అర్థం చేసుకోవచ్చు. మరో విచిత్రమేమంటే ప్రతి వారం, నలుగురు లేదా ఐదుగురు రోగులు ప్రేరణ నియంత్రణ రుగ్మతకు (ఇన్‌స్పిరేషన్-కంట్రోల్డ్ డిజార్డర్) చికిత్స నిమిత్తం వస్తున్నట్టు ఎయిమ్స్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ రిషికేష్ వెల్లడించడం, విదేశీ సంస్కృతికి చెందిన ఈ గేమ్స్ ఎంతటి ప్రమాదాన్ని కలుగజేస్తున్నదీ స్పష్టం చేస్తున్నది.

**టాస్కులు, పాయింట్లతో ఆకర్షణ**

"పాప్పీ ప్లే టైమ్", "ది బేబీ ఇన్ ఎల్లో" వంటి ఆన్‌లైన్ గేమ్‌లు రోజువారీ టాస్కులు, పాయింట్‌లు ఇవ్వడం ద్వారా పాల్గొనేవారిని స్క్రీన్‌నుంచి కదలకుండా చేస్తున్నాయి. ఈ గేమ్‌లు భావోద్వేగపరంగా తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుండటంతో వీటికి అలవాటుపడిన వారు మళ్లీ వెనక్కి రాలేకపోతున్నారు. ఈ గేమ్‌ల్లో చూపించే "మిథ్యా వాస్తవికత" కొరియాకు సంబంధించినదై ఉండటంతో గేమ్‌లో పాల్గొనేవారు క్రమంగా తమను తాము కొరియన్లుగా భావించుకోవడం మొదలవుతోంది. ఫలితంగా వారు తమ చుట్టుపక్కల ప్రాంతాలతో సంబంధాలు కోల్పోయి, తమను తాము ఒంటరి చేసుకొని చివరకు తీవ్రస్థాయి నిర్ణయాలు తీసుకునే దశకు చేరుకుంటున్నారు. ఈ గేమ్‌లు మెదడులో ఆనందానికి, సంతోషానికి కారణమయ్యే భాగాలపై ప్రతికూల ప్రభావాన్ని కలిగించి, నిరంతరం తీవ్ర డిప్రెషన్‌కు, ఉద్వేగానికి గురిచేస్తాయి. ఫలితంగా టీనేజ్ పిల్లల్లో విపరీతమైన మూడ్ స్వింగ్‌లు, క్షణికావేశానికి గురికావడం వంటి లక్షణాలు కనిపిస్తాయని మానసిక వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అదీకాకుండా ఈ గేమ్‌లు మామూలుగా అధికారిక యాప్‌ల్లో ఉండవు కనుక, వీటిని రహస్యంగా వీక్షించడంవల్ల పిల్లలకు, తల్లిదండ్రులకు మధ్య సంఘర్షణలు జరుగుతున్నాయి.

**అభిమానుల కోసం అడ్డదారులు**

కొరియన్ సంస్కృతిలో "కె-పాప్","కె-డ్రామాస్" వంటి గేమ్‌లు చాలా సానుకూలతతో ఉంటాయి. ఇవి చాలా ప్రాచుర్యం పొందడంతో, ప్రమాదకరమైన రహస్య గేమ్‌లు రంగప్రవేశం చేశాయి. ముఖ్యంగా ఎక్కువమంది అభిమానులను సంపాదించాలన్న లక్ష్యంతో వీటి రూపకల్పన జరుగుతుంది. ఈ గేమ్‌ల్లో మునిగిపోయిన జెన్‌జెడ్‌లు కొరియన్ సెలబ్రిటీలు లేదా వర్చువల్ పార్ట్‌నర్స్‌తో ఏకపక్షంగా భావోద్వేగపరమైన బంధాలను ఏర్పరచుకోవడం క్రమంగా వారిని ప్రమాదంలోకి నెట్టేస్తోంది. ఇదే సమయంలో హాని కలిగించే కారకాలు కూడా వీరిని ఇందుకు ప్రోత్సహిస్తుండటం దారుణం. ఇదిలా ఉండగా ముగ్గురు అక్కాచెల్లెళ్లు మరణించిన తర్వాత దేశవ్యాప్తంగా ఒక్కసారిగా ఆగ్రహావేశాలు వ్యక్తమవడమే కాకుండా, ఈ గేమ్‌లను నిషేధించాలన్న డిమాండ్‌లు ఊపందుకున్నాయి. 16 సంవత్సరాల లోపు పిల్లలపై గట్టి నియంత్రణ ఉండేలా చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమయ్యాయి. ఐటీ చట్టం కింద భారత ప్రభుత్వం ఇప్పటికే పబ్జీ/బీజీఎంఐ వంటి చాలా యాప్‌లను నిషేధించింది. అయితే ఈ నిషేధం నేపథ్యంలో వీపీఎన్ లేదా ప్రత్యామ్నాయ పద్ధతుల్లో, ఏవిధమైన పరిశీలన లేని వర్షన్స్‌ను జెన్‌జెడ్ డౌన్‌లోడ్ చేసుకుంటున్నారనేది నిపుణులు చెప్పే మాట. ఈ నేపథ్యంలో పిల్లలు స్క్రీన్‌లను వీక్షించే సమయం ఎక్కువగా ఉండటం, పేర్లను మార్చుకోవడం, ఒంటరిగా ఉండటం వంటి అంశాలపై దృష్టిపెట్టి తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మానసిక వైద్యులు, పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- సోలో లెవెలింగ్-అరైజ్: ఇది యాక్షన్ ఆర్‌పీజీ. కొరియాలో బహుళ ప్రాచుర్యం పొందిన వెబ్‌టూన్ ఆధారంగా దీన్ని రూపొందించారు. 2024లో ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది.
- కూకీ రన్-కింగ్‌డమ్: దేవ్‌సిస్టర్స్ రూపొందించిన పాపులర్ మొబైల్ ఆర్‌పీజీ. భారత్‌లో దీన్ని పబ్లిష్ చేసేందుకు ఇటీవల ఇందులో క్రాఫ్టన్ భాగస్వామి అయింది.
- ఇంటరాక్టివ్ ''లవ్ గేమ్స్'': కొరియన్ ఇతివృత్తంతో కూడిన రొమాన్స్ లేదా సిమ్యులేషన్ గేమ్స్ వంటివి.
- కె-పాప్ డేటింగ్ గేమ్ లేదా కొరియన్ గేమ్స్: ఇన్ఫినిట్ (ఛాట్ సిస్టమ్స్ లేదా 3డి స్టోరీలైన్స్.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

# శంకరుల అద్వైతంలో
# ఆధునిక ఆత్మనిర్భర

అవతారిక

**శంకర భగవత్పాదులు అద్వైత వేదాంత తత్వశాస్త్రానికి ప్రాణప్రదాతగా భారత ఆధ్యాత్మిక చరిత్రలో అపూర్వ స్థానం సంపాదించారు. ఆయన ప్రకారం పరమ సత్యం బ్రహ్మమే, ఈ జగత్తు మాయగా అనుభవించబడుతుందని స్పష్టంగా వివరించారు. జీవాత్మ, పరమాత్మ మధ్య ఏకత్వమే తమ బోధనల సారాంశం అని ఉపదేశించారు. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీతలపై ఆయన రచించిన భాష్యాలు వేదాంతానికి స్థిరమైన పునాదిని ఏర్పరచాయి. జ్ఞానమార్గమే మోక్షానికి ప్రధాన సాధనమని, అవిద్య వల్లనే మనిషి తన నిజస్వరూపాన్ని గ్రహించలేడని ఆయన తాత్త్వికంగా నిరూపించారు. శ్రవణం, మననం, నిదిధ్యాసనం ద్వారా బ్రహ్మజ్ఞానం సిద్ధిస్తుందని బోధించి ఆచరణాత్మక మార్గాన్ని చూపించారు. భక్తి, జ్ఞానానికి సమన్వయం కల్పించి ఆధ్యాత్మికతను ప్రజలకు సులభతరం చేశారు.**



**ఆచార్య రాణి సదాశివమూర్తి**
**ఉపకులపతి,**
**శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, తిరుపతి**

భారతదేశంలోని నాలుగు దిక్కుల్లో చతురామ్నాయ పీఠాలను మధ్యలో కాంచీపురంలో కామాక్షీ అమ్మవారి సన్నిధిలో మూలామ్నాయ పీఠాన్ని స్థాపించి ధార్మిక ఐక్యతకూ, సంస్కృతీ పరిరక్షణకూ కృషి చేశారు. వివిధ మతపరమైన వాదాలను తార్కికంగా సమర్థించి సనాతన ధర్మాన్ని పునరుద్ధ రించిన సంస్కర్తగా నిలిచారు. ఈ విధంగా శంకరా చార్యుల తాత్త్విక మూర్తిత్వం భారతదేశ చరిత్రలో ఆధ్యాత్మిక పునర్జీవనానికి మూలస్థంభంగా నిలిచి తరతరాలపాటు స్ఫూర్తినిస్తోంది.

**శ్రీ శంకర భగవత్పాదుల జన్మ కాల నిర్ధారణ**

శంకరభగవత్పాదుల జన్మ కాలనిర్ధారణ విషయంలో రెండు ప్రధానమైన వాదాలు ఉన్నాయి. వాటిలో ఒకటి పాశ్చాత్యవాద ప్రభావితం. రెండవది ప్రాచీన గురు పరంపర తిలకించిన చారిత్రక సత్యం. మాక్స్ ముల్లర్, వెబర్, వింటర్ నిట్జ్ వంటి పశ్చిమ పరిశీలకుల కృతక వాద ప్రభావం వల్ల శ్రీ శంకర భగవత్ పాదులు క్రీ. శ 8 వ శతాబ్దిలో జన్మించారు అనే అసత్యవంతమైన అభిప్రాయం లోకవ్యాప్తిని పొందింది.

దీనికి బలాన్ని చేకూర్చిన మరొక ఉదంతం శ్రీ మాధవ విద్యారణ్య స్వామి చరిత్ర. విద్యారణ్య స్వామి వారు హంపి వద్ద శ్రీ శృంగేరీ శ్రీవిరూపాక్ష శ్రీపీఠాన్ని స్థాపించి శ్రీ శంకర భగవత్పాదులు లోకానికి అందించిన అద్వైత సిద్ధాంతాన్ని, షణ్మతాలను ప్రచారం చేయటానికి కటిబద్ధులై తనకున్న రాజ గురుత్వ బలంతో అప్పటికి కొన్ని వందల సంవత్సరాల క్రితం ఆదిశంకరులు నెలకొల్పిన, విదేశీయుల దండయాత్రలలో వైభవాన్ని కోల్పోయిన చతురామ్నాయ పీఠములను పునరుద్ధరణ గావించారు. ఇక్కడ గమనించదగిన, హర్షించదగిన విషయం. చతురామ్నాయ పీఠములు విదేశీయుల దురాక్రమానికి గురైనాయి కానీ కాంచీపురంలోని శ్రీ కామకోటి మూలామ్నాయ పీఠం మాత్రం వారి దుష్ట చేష్టల బారినపడలేదు. అలా ఆ నాలుగు పీఠాలు విద్యారణ్య స్వామి వారివల్ల పునర్వైభవాన్ని సంతరించుకున్నాయి.

ఈ విషయం కాలాంతరంలో సంచార పీఠంగా మారి గుంటూరులో శ్రీశ్రీశ్రీ బోధానంద భారతీ మహాస్వామి వారు స్థిరపరిచిన, వీరి శిష్యులైన శ్రీశ్రీశ్రీ కల్యాణానందభారతీ మహాస్వామి వారిచేత సుస్థిరమైన శ్రీవిద్యారణ్య ప్రతిష్ఠిత శ్రీశృంగేరీ శ్రీ విరూపాక్ష శ్రీపీఠచరిత్రలో లభ్యమయ్యే సత్యం. ఈ సత్యం మరుగున పడటం వల్ల శ్రీ విద్యారణ్య స్వామివారే చతురామ్నాయ పీఠములను నెలకొల్పారనే భ్రాంతికి లోనౌవుతున్నారు అటు పాశ్చాత్యులు, ఇటు అదే చరిత్ర అనుకుంటూ చదువుకునే వారు కొందరు. దీనికి కారణం పాశ్చాత్య జనులు వ్రాసిన అసత్యపు రాతలే మన దేశ చరిత్ర అనే అపోహ బలీయంగా వారిలో పాతుకుపోవటమే. మరి అసలు విషయం తెలియాలి అంటే శ్రీ కామకోటి చరిత్రను చూడాలి.

శ్రీ కాంచీపురస్థ కామకోటి పీఠం నమోదు చేసిన ఆది శంకరభగవత్పాదుల జన్మశతాబ్దము– గురుపరంపర.

అది ఒక మహాపురుష పరంపర చూసిన చరిత్ర, భారతీయ ఆధ్యాత్మిక చరిత్రలో ఆది శంకరభగవత్పాదుల అవతరణం యుగప్రవర్తక ఘట్టం. ఉపనిషత్తుల అద్వైతసారాన్ని స్పష్టంగా ప్రతిపాదించి, వేదమాతను సంరక్షించి, భౌతిక–ఆధ్యాత్మిక సంక్షోభ సమయంలో ధర్మ సంస్థాపన చేసిన మహోన్నత గురుస్వరూపం ఆయనది. కాంచీ కామకోటి పీఠ గురుపరంపర విశ్వాసానుసారం, శంకరులు క్రీస్తుపూర్వం 509వ సంవత్సరంలో (వైశాఖ శుక్ల పంచమి, పునర్వసు నక్షత్రం) అవతరించినారని అంతాఅంగీకరిస్తారు.

ఈ కాలనిర్ణయం పీఠంలో పరంపరాగతంగా కొనసాగుతున్న గురునామావళి, పీఠాధిపతుల నామక్రమం, ఆధ్యాత్మిక సంప్రదాయ ఆధారాలపై నిలబడి ఉంది. ఈ పీఠం ప్రకారం, ఆదిశంకరులు ఒక తాత్త్విక సంస్కర్త మాత్రమే కాదు; వారు దివ్యజ్ఞానాన్ని మానవజాతికి ప్రసాదించిన పరమ శివావతారం.

**గురుపరంపర వీక్షించిన చరిత్ర**

కాంచీ కామకోటి పీఠం తన ఆరంభాన్ని స్వయంగా ఆదిశంకరులవారితో అనుసంధానిస్తుంది. పీఠ సంప్రదాయం ప్రకారం, శంకరులు భారతదేశాన్ని సంచరించి వేదమార్గాన్ని పునరుద్ధరించి, చతురామ్నాయ పీఠాలను స్థాపించిన తరువాత కాంచీపురంలో శ్రీచక్ర ప్రతిష్ఠ చేసి కామాక్షీ అంబా సన్నిధిలో కామకోటి పీఠాన్ని ఆవిష్కరించారు.

కాఞ్చ్యాం శ్రీచక్రరాజం స్థాపితవాన్ శఙ్కరో గురుః ।
కామాక్ష్యాః సన్నిధౌ నిత్యం కామకోటిప్రదాయకః ॥

అనే పరంపరావాక్యం ఈ విశ్వాసాన్ని ప్రతిఫలిస్తుంది.

శ్రీ కామకోటి గురుపరంపర స్తుతి
నారాయణం పద్మభువం వసిష్ఠం
శక్తిం చ తత్పుత్రపరాశరం చ ।
వ్యాసం శుకం గౌడపదం మహాన్తం
గోవిన్దయోగీన్ద్రమథాస్య శిష్యమ్ ॥

శ్రీశఙ్కరాచార్యమథాస్య పద్మ-
పాదం చ హస్తామలకం చ శిష్యమ్ ।
తం తోటకం వార్తికకారమన్యాన్
అస్మద్గురూన్ సన్తతమానతో?స్మి ॥
(సంప్రదాయ గురుపరంపర స్తోత్రం)

ఈ శ్లోకం ద్వారా నారాయణుని నుండి ప్రారంభమైన జ్ఞానప్రవాహం శంకరులవారికి చేరిందని సూచిస్తుంది.

ఆది గురుపరంపర (ఆధ్యాత్మిక మూల శ్రేణి)

క్రమం గురు పేరు

**1 శ్రీమన్నారాయణుడు**
**2 బ్రహ్మదేవుడు**
**3 వశిష్ఠ మహర్షి**
**4 శక్తి మహర్షి**
**5 పరాశర మహర్షి**
**6 వేదవ్యాసుడు**



# “ఆత్మ” నిర్భరతే భారతం

**7 శ్రీ శుక మహర్షి**
**8 గౌడపాదాచార్యులు**
**9 గోవింద భగవత్పాదులు**
**10 ఆదిశంకరభగవత్పాదులు**
**11 పద్మపాద, హస్తామలక, తోటకులు, సురేశ్వర ఆచార్యులు వారు.**

(కాంచీ కామకోటి పీఠ గురుపరంపర (సంక్షిప్త పట్టిక)

కాంచీ పీఠ విశ్వాసం ప్రకారం ఆదిశంకరులవారే పీఠ స్థాపకులు. గురుపరంపర నిరంతరంగా కొనసాగుతూ వస్తున్నదని సంప్రదాయం చెబుతుంది.

**క్రమం పీఠాధిపతి**

1. శ్రీ ఆదిశంకరభగవత్పాదులు
2 శ్రీ సురేశ్వరాచార్యులు
3 శ్రీ సర్వజ్ఞాత్మేంద్ర సరస్వతీ
...
68 శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామివారు (మహాపెరియవ)
69 శ్రీ జయేంద్ర సరస్వతీ స్వామివారు
70 శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు (ప్రస్తుత పీఠాధిపతి)
71 శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి వారు (ఈ మధ్యనే దీక్ష తీసుకున్నవారు)

(గమనిక: మధ్యలోని గురువుల సంపూర్ణ జాబితా విస్తృతమైనది; పీఠ అధికారిక గురుపరంపర గ్రంథాలలో లభ్యం.)

పీఠాధిపతుల గురుపరంపర ఆదిశంకరులవారి నుండి నిరంతరాయంగా కొనసాగుతున్నదనే ప్రత్యక్ష పరంపరా క్రమమే పీఠ సంప్రదాయంలో అత్యంత ప్రధానాంశం. ఈ గురుశ్రేణి వేదాధ్యయన పరిరక్షణ, శాస్త్రప్రచారం, ధర్మబోధ, దేశభక్తి,ఆధ్యాత్మిక జాగరణకు కేంద్రబిందువుగా నిలిచింది.

**జన్మకాలిక శతాబ్ద ప్రస్తావన**

కాంచీ పీఠ దృష్టిలో శంకరుల జన్మకాలం (క్రీ.పూ. 509) ఆధారంగా ఆయన జన్మించి 2500 సంవత్సరాలకు పైగా గడిచినదనే భావన వ్యక్తమవుతుంది. ఈ గణన ప్రకారం ఆయన అవతరణం భారతీయ సంస్కృతికి క్రీస్తుపూర్వ యుగంలోనే జరిగిన దివ్యసందేశంగా భావించాలి.

శంకరులు ఉపనిషత్తుల నుంచి ప్రకటించిన మహావాక్యాలు -

అహం బ్రహ్మాస్మి (బృహదారణ్యక ఉపనిషద్ 1.4.10)

తత్త్వమసి (ఛాన్దోగ్య ఉపనిషద్ 6.8.7)

ప్రజ్ఞానం బ్రహ్మ (ఐతరేయ ఉపనిషద్ 3.3)

అయమాత్మా బ్రహ్మ (మాణ్డూక్య ఉపనిషద్ 2)

ఈ మహావాక్యాల ప్రచారం, వ్యవస్థీకరణ శంకరుల కార్యరూపంలో ప్రత్యక్షమైందని పీఠం దృఢస్వరంతో ప్రకటిస్తుంది.

ఇవి కేవలం తాత్త్విక సిద్ధాంతాలు కాక, మానవ జీవితానికి ఆధ్యాత్మిక స్వాతంత్ర్య ప్రకటనలుగా కనబడుతాయి.

కాంచీ పీఠ గురుపరంపరలో ఈ మహావాక్యాలు జీవనాచరణలో అనుసరణీయంగా వచ్చాయి. పీఠాధిపతులు వేదాధ్యయనం, యజ్ఞయాగాది సంప్రదాయం, శ్రీవిద్యోపాసన, భక్తి--జ్ఞాన సమన్వయాన్ని కొనసాగిస్తూ శంకరుల ఆదేశాన్ని ఆచరణలో నిలిపారు.

**శంకరులు - అవతార పురుషులు**

సనాతన ధర్మమార్గ దర్శకులైన కాంచీ పీఠాధిపతుల పారంపరిక ఉపదేశ ప్రకారం శంకరులు పరమశివస్వరూపులు. వారికి వయస్సుతో పని ఏముంది? శంకరః శంకర స్సాక్షాత్ అనే భావన గురుపరంపరలో సజీవంగా ఉంది. అవతార రహస్యం అనేది చారిత్రక పరిమితులను అధిగమించి ఆధ్యాత్మిక సత్యాన్ని ప్రతిపాదిస్తుంది.

***అష్ట వర్షే చతుర్వేదీ ద్వాదశే సర్వశాస్త్రవిత్,***
***షోడశే కృతవాన్ భాష్యం ద్వాత్రింశే మునిరభ్యగాత్.***

అన్న ప్రాచీన శ్లోకవచనాలననుసారించి ఎనిమిదేళ్ల వయసుకే నాల్గు వేదాలను అధ్యయనం

చేశారు. పన్నెండు సంవత్సరాలకు అన్ని శాస్త్రాలను తెలుసుకున్నారు. పదునారు సంవత్సరాల వయస్సుకు బ్రహ్మసూత్ర భాష్యం చేసారు. ముప్పై రెండు సంవత్సరాలకు అంతర్ధానమయ్యారు.

శంకరుల దివ్యచరిత్రలో బాల్య వయస్సులోనే సన్యాసగ్రహణం, గురుపాదసేవ, భాష్యరచన, దేశవ్యాప్త దార్శనిక సంచారం– ఇవి యుగధర్మాన్ని పునర్నిర్మించిన కార్యాలు. కాంచీ పీఠ దృష్టిలో ఇవి కేవలం సంఘటనలు కాదు; ధర్మసంస్థాపనకు అవతారపురుషుని లీలలు.

**పీఠం పాత్ర**

కాంచీ కామకోటి పీఠం శతాబ్దాలుగా భారత దేశంలో వేదరక్షణకు, శాస్త్రప్రచారానికి, సమాజ నైతికతకు దిక్సూచిగా నిలిచింది. గురుపరంపరలోని జగద్గురువులు దేశవ్యాప్తంగా సంచరించి ధర్మబోధ చేశారు. ప్రత్యేకించి 68వ జగద్గురు శ్రీచంద్ర శేఖరేంద్ర సరస్వతీ మహాస్వామిగారు (మహా పెరియవ) ద్వారా పీఠానికి అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. ఆయన జీవితం గురుపరంపర విశ్వాసానికి సజీవసాక్ష్యం.

కాంచీ కామకోటి పీఠం దృష్టిలో ఆదిశంకర భగవత్పాదుల జన్మ క్రీ.పూ. 509లో జరిగిన దివ్యావతారం. గురుపరంపర విశ్వాసం ఈ కాలనిర్ణయాన్ని ఆధారంగా చేసుకుని శంకరుల బోధను నిరంతరాయంగా కొనసాగిస్తోంది. శంకరుల సందేశం కాలాతీతం.

ఇక శంకరుల జన్మవైశిష్ట్యాన్ని, వారి జన్మలో అంతరార్థాన్ని పరిశీలిద్దాం.

బాల్యంలోనే బ్రహ్మజ్ఞానులు –కారణజన్ముల మహిమ, మన దృష్టి

భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక విశేష లక్షణం కనిపిస్తుంది –వయస్సుతో సంబంధం లేకుండా జ్ఞానం వికసించడం. అష్టావక్రుడు, నచికేతుడు, శుక మహర్షి, ధ్రువుడు, ప్రహ్లాదుడు, ఉపమన్యువు, మార్కండేయుడు, శంకరభగవత్పాదులు మొదలైన మహనీయులు బాల్యదశలోనే పరమాత్మతత్త్వాన్ని గ్రహించినవారిగా వర్ణించబడ్డారు. ఆధునిక మానసిక దృష్టితో చూస్తే ఇది అసాధారణం, కొందరికి అసంభవం కూడా అనిపించవచ్చు. కాని భారతీయ దర్శనంలో ఇది అసంభవం కాదు–అది "కారణజన్మ" భావనతో సంబంధించింది.

**1. వయస్సు - జ్ఞానానికి ప్రమాణమా?**

వేదాంతసారం ప్రకారం జ్ఞానం శరీర పరిపక్వతకు సంబంధించి ఉండదు. నాయమాత్మా వయసా లభ్యః –ఆత్మజ్ఞానం వయస్సుతో రాదు. అది అంతఃకరణ శుద్ధి, పూర్వసంస్కారాలు, ముముక్షుత్వం ఆధారంగా లభిస్తుంది. అష్టావక్రుడు జనకసభలో వాదించేటప్పుడు 12 సంవత్సరాల బాలుడే. నచికేతుడు యమధర్మరాజును ప్రశ్నించి



కాంచీ కామకోటి పీఠం

నప్పుడు 8–12 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న కుమారుడే. ధ్రువుడు ఐదేళ్ల వయస్సులోనే తపస్సు చేసి విష్ణుదర్శనం పొందాడు. శుక మహర్షి యువకుడే అయినా అసంగబ్రహ్మజ్ఞాని. తల్లి కడుపులో ఉండగానే బ్రహ్మజ్ఞానాన్ని పొందిన మహనీయుడు. అలాగే శంకరభగవత్పాదులు ఎనిమిదేళ్లకే ఉపనిషత్తుల సారాన్ని గ్రహించి, పన్నెండేళ్లకే భాష్యాలు రచించి, ముప్పై రెండేళ్లలో భారతాన్ని సంచరించి తాత్త్విక పునరుద్ధరణ చేశారు. యుగే. యుగే. అంటే, భారతీయ దృష్టిలో జ్ఞానం అనేది అనుభవ సంపాదన ఫలితంగా ఒక్క జన్మలో మాత్రమే పుట్టేది కాదు; అది అనేక జన్మల సాధన ఫలితంగా వికసించగలదు.

**2. కారణజన్మ సిద్ధాంతం**

పురాణాలు, ఇతిహాసాలు "కారణజన్మ" అనే భావనను ప్రతిపాదిస్తాయి. కొన్ని ఆత్మలు లోకహితార్థం, ధర్మస్థాపనార్థం, తాత్త్వికబోధార్థం జన్మిస్తాయి. గీతలో శ్రీకృష్ణుడు ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే అని చెప్పిన భావానికి ఇది సమీపం. ఈ మహనీయులు సాధారణ జీవుల మాదిరిగా శూన్యస్థితి నుంచి ప్రారంభించరు; వారు పూర్వసాధన సంపత్తితో అవతరిస్తారు. అందుకే వారిలో బాల్యంలోనే విరక్తి, జ్ఞానదాహం, తపస్సు కనిపిస్తుంది.

ఇది కల్పితకథనమని కొందరు భావించవచ్చు. కాని భారతీయ దర్శనశాస్త్రం పునర్జన్మ, సంస్కార సిద్ధాంతాలను అంగీకరిస్తుంది. పూర్వజన్మసాధన ఫలితంగా ఈ జన్మలో అతి చిన్న వయస్సులోనే మహా జ్ఞానం వికసించవచ్చు అని వేదాంతం సమర్థిస్తుంది.

**3. వారిని మనతో పోల్చడం సరైనదా?**

ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న వస్తుంది: "వారు బాల్యంలోనే సాధించారు; మనం సాధించలేము; కాబట్టి అది కేవలం పురాణకల్పన" అని చెప్పడం సమంజసమా?

**ఇది రెండు దృక్కోణాల్లో చూడాలి:**

**(అ) సమానత్వ దృష్టి:**

మనమూ అదే పరమాత్మస్వరూపమే. తత్త్వంగా చూస్తే, ఆత్మస్వరూపం అందరిదీ ఒకటే. కాబట్టి వారు సాధించిన బ్రహ్మజ్ఞానం మనకూ సాధ్యమే. శంకరులు కూడా "తత్త్వమసి" అని ఉపదేశించారు. ఆత్మజ్ఞానం ఎవరికైనా సాధ్యమే.

**(ఆ) భిన్నత్వ దృష్టి:**

ప్రత్యేక సంస్కారాలు, పూర్వసాధన, అంతఃకరణ శుద్ధి వేరువేరు. ఒక విద్యార్థి జన్మతః గణితంలో ప్రతిభావంతుడు కావచ్చు; మరొకరికి ఎక్కువ శ్రమ అవసరం. అందువల్ల బాల్యంలోనే పరిపూర్ణజ్ఞానం అందరికీ రావాలి అని చెప్పడం తప్పు. అదే విధంగా, వారిని మనతో పోల్చుకుని "ఇది అసంభవం" అని తిరస్కరించడం కూడా తర్కసంగతం కాదు.

**4. చారిత్రకత - తాత్త్వికత**

అష్టావక్రుడు నిజంగా పన్నెండేళ్ల వయస్సులో వాదించాడా? నచికేతుడు యమలోకానికి శరీరంతో వెళ్లాడా? శుకుడు సూర్యమండలాన్ని అధిగమించాడా? ఇవి చారిత్రక పరిశోధన ప్రశ్నలు కావచ్చు. కాని భారతీయ సంప్రదాయం ప్రధానంగా ఈ కథల తాత్త్వికార్థాన్ని ముందుకు తెస్తుంది.

అష్టావక్రుడు – శరీరదోషం జ్ఞానానికి అడ్డంకి కాదని సూచన.

నచికేతుడు – ముముక్షుత్వం వయస్సుతో సంబంధం లేదని సూచన.

ధ్రువుడు – దృఢసంకల్పం చిన్నవాడికీ సాధ్యమే అని సూచన.

శుకుడు – అసంగత్వం పరాకాష్ఠ.

శంకరులు – జ్ఞానవిజ్ఞాన సమన్వయం.

అందువల్ల, వీరిని కేవలం చారిత్రక దృష్టితో కొలిచి "ఇది సాధ్యం కాదు" అని నిరాకరించడం భారతీయ దర్శనపరంపరను అర్థం చేసుకోకుండా చేసిన నిర్ణయం అవుతుంది.

**5. మనకు ఉపదేశం ఏమిటి?**

ఈ మహనీయుల జీవితాల ఉద్దేశం మనలో అసూయ లేదా నిస్సహాయత కలిగించడం కాదు; ప్రేరణ కలిగించడం. వారు సాధించినది అసాధ్యం కాదు – కాని అది సాధారణ స్థాయికి మించి ఉన్న సాధన ఫలితం. వారు మార్గదర్శకులు. వారు చూపిన మార్గంలో మనం కూడా ప్రయాణించవచ్చు, యథాశక్తి.

"వారు కారణజన్ములు; కాబట్టి మనకు సాధ్యం కాదు" అని పూర్తిగా వదిలేయడం ఒక అతి.

"వారు సాధారణ మనుషులు; కాబట్టి వారి మహిమ కల్పితం" అని తిరస్కరించడం మరొక అతి.

**వచ్చేవారం..**

**చతురామ్నాయ పీఠాలు, కాంచి కామకోటి పీఠం.. అద్వైతాలపై చర్చ..**



# మానవుడి ప్రాకృతిక స్థితి

**మానవుల మధ్య ఒప్పందం ద్వారా రాజ్యం ఏర్పడిందనేది పదిహేడో శతాబ్దికి చెందిన రాజనీతి శాస్త్రజ్ఞులు చెప్పేమాట. మానవుడు తన ప్రాకృతిక స్థితి నుంచి క్రమంగా ఎదుగుతూ నైసర్గిక నియమాలను తెలుసుకున్నాడు. ఆ నియమాల ఆధారంగా రాజ్య వ్యవస్థను నిర్మించుకున్నాడని థామస్ హాబ్స్ చెప్పాడు.**

ప్రజాస్వామ్యవాదులు చెప్పేదేమిటంటే, 'ఆజ్ఞాపాలనం అనేక అనుబంధాలను అనుకరించ డంపై ఆధారపడుతుంది. రాజ్యం పుట్టుక అనుబం ధాల ద్వారానే జరుగుతుంది. ఒకవేళ రాజు అను బంధాలను ఉల్లంఘిస్తే నాగరిక రాజ్యాలు అతడితో విభేదించవచ్చు.'

కేథలిక్కులు, కేల్వనిస్టుల అభిప్రాయంలో, 'మతం సర్వశ్రేష్ఠమైనది. రాజ్యం దాని అధీనంలో ఉండాలి.' మతభేదాలు పెచ్చరిల్లడానికి, అంతర్యుద్ధాలు జరగడానికి ఈ విధానాలు ముఖ్య భూమిక పోషిం చాయి. హాబ్స్ అతని కాలంలో ఉన్నవారందరినీ బాధించే, 'రాజసత్తను ఎక్కడ ఉంచారు?' అనే ప్రశ్నకు ఒక ఉత్తమ సమాధానం చెప్పాడు. హాబ్స్ సువ్యవస్థ ఏర్పడడం పరమావశ్యకం అని భావించాడు.

రాజ్యం ఏర్పడడానికి ఉన్న స్థితిని 'ప్రాకృతిక స్థితి' (The State Of Nature) అని పిలుస్తారు. ఎప్పుడైనా ఒక ఇంజన్ పాడైపోయిందనుకోండి... మెకానిక్ వివిధ భాగాలను విడదీసి ఉంచుతాడు. ఈ క్రమంలో ఇంజన్‌లో లోపం ఏమిటో అర్థమవు తుంది. ఆ లోపాన్ని సరిచేసి మళ్లీ ఇంజన్ బిగిస్తాడు. ఈ ఉదాహరణ చూపి... హాబ్స్, 'మానవుడు సమాజంలోనూ, ఇంటిలోనూ నివసిస్తున్నవాడే అయినప్పుడు మనం మన పెట్టెలకు తాళాలెందుకు వేసుకుంటాం? ఇది చూస్తుంటే, మానవులకు ఒకరిపై మరొకరికి విశ్వాసం లేదని స్పష్టం అవుతోంది కదా! రాజ్యవ్యవస్థకే ఇట్టి స్థితి ఏర్పడుతోందంటే, ప్రాకృతిక నియమాలను గురించి చెప్పాల్సింది ఏముంటుంది?' అంటాడు.

మానవుడు స్వభావసిద్ధంగా స్వార్థ బుద్ధిని కలిగి ఉంటాడని అతడు చెబుతాడు. మానవుడు సత్తాధారితమైన శక్తి ద్వారానే ఒక కూటమిగా ఉండగలుగుతాడు. అందువల్ల ప్రాకృతిక స్థితియందు మానవులు విడివిడిగానే ఉండిపోతారు. ఆ సమయంలో ఏ ఒక్కరూ వ్యవస్థీకృతంగా లేరు. ఎవరూ సత్త లేదా అధికారాన్ని ధరించడానికి యోగ్యులై లేరు.

అతడి అభిప్రాయం ప్రకారం, 'పొందికైన శరీరం, బుద్ధిశక్తి కలిగి ఉండడమూ ఒక యోగం. అయినప్పటికీ మానవులందరూ సమానమే.' అయితే ఎవరైనా ఒకవేళ శారీరకంగా దుర్బలులై ఉంటే... అట్టి దుర్బలత్వాన్ని తన తెలివితేటల ద్వారా తగ్గించు కోగలుగుతారు. అందువల్ల ప్రాకృతిక స్థితియందు వ్యక్తుల మధ్య సమానత ఉంటుంది. స్వార్థపూర్తియే అతడి లక్ష్యమై ఉంటుంది.

ఐకమత్యం లేదా సహయోగితలకు ఆ ప్రాకృతిక జీవులకు ఎట్టి స్థానమూ లేదు. స్పర్థయే స్వార్థానికి సాధనమై ఉంది. సంఘర్షణ ద్వారానే ఆధిపత్యాన్ని సాధించుకోవడం కుదిరేపని. ఇతరుల ద్వారా తమదైన కీర్తిని సంపాదించుకోవాల్సి వస్తుంది. ప్రాకృతిక నియతిలో సమానత్వమనేది లేకపోతే అవశ్యంగా ఒకరిపై మరొకరికి ఆధిపత్యం ఉండి ఉండేది. ఎవ్వరూ ఇతరుల నుంచి గౌరవాన్ని, మన్ననను పొందలేరు. అందరూ స్వార్థ సంఘర్షణ చేయక తప్పేది కాదు.

భౌతికశాస్త్రం, జీవశాస్త్రం పరిశోధనల్లో కూడా సమాజశాస్త్రానికి వర్తించే కొన్ని విషయాలున్నాయి. గెలీలియో, కేల్వర్‌లు నక్షత్రాలకు చెందిన గతి – విధి – సంబంధాలపై పరిశోధనలు జరిపారు. హర్వే రక్తప్రసరణ విషయమై పరిశోధనలు కావించాడు. హాబ్స్ సామాజిక శాస్త్రానికి సంబంధించిన గతితార్కిక విధానాలను చర్చించాడు. అతడు మానవ జీవనానికి చెందిన గతివిధానాలను గురించి ఎంతో సమగ్రంగా చెప్పాడు. అంతే సమగ్రంగా నక్షత్రాలు, ప్రాణశక్తిని గురించి కూడా చెప్పాడు.

హాబ్స్‌ను అనుసరించి, 'సంఘర్షణ గతియే మానవజీవనానికి సారమై ఉన్నది. ఏ విధంగా అయితే నక్షత్ర గతి లేకపోతే విశ్వం కనుమరుగవు తుందో... రక్తప్రసరణ లేకపోతే మానవులు మృత్యువు పాలవుతారో... అలాగే సంఘర్షణ లేకపోతే కూడా మృత్యువే ఎదురవుతుంది.' ఇట్టి గతికి లక్ష్యం స్వార్థపూర్తి, కీర్తివృద్ధి అని అతడు చెప్పాడు.

హాబ్స్ ప్రకారం, 'ప్రాకృతిక స్థితిలో అందరూ యుద్ధరతులై ఉండేవారు. అంతటా యుద్ధ వాతావరణమే ఉండేది. ఆ సమయంలో వ్యక్తిగత సంపద, సంస్కృతి, విద్య, కళ, విజ్ఞానం, ఎగుమతి – దిగుమతులు, విశ్వజ్ఞానం, సమయజ్ఞానం వంటివేవీ వారికి ఉండే అవకాశం లేదు. నైతికత – – అనైతికత, మంచి – చెడు, హింస – అహింస వంటి వాటి గురించి కొద్దిగా అయినా జ్ఞానం ఉండేది కాదు. జనులకు సదా మృత్యుభయం ఉండేది. ప్రజల జీవితాలు ఏకాకులుగా, నిర్ధనులుగా, ఆటవికులుగా, అసహ్యకరంగా, క్షణికంగా సాగిపోయేది. దీని అర్థమేమిటంటే... ప్రాకృతిక స్థితి అంతా మత్స్య న్యాయంతో నడిచేది. 'కర్ర ఎవరిదో బర్రె వానిదే' అనే న్యాయం ఉండేది.'

క్రమంగా మానవుడు తన వివేకానికి పదును పెట్టడం ప్రారంభించాడు. అతడికి నైసర్గిక నియ మాలు తెలిసి రాసాగాయి. అట్టి నియమాలను వారు ఈశ్వరాజ్ఞలుగా స్వీకరించసాగారు. వాటిని అనుసరించి నడుచుకోవడం మానవులకు అనివార్య మైంది.' ఆ మార్గం ద్వారా 19 నైసర్గిక నియమాలను వారు లెక్కించారు. వాటిలో మళ్లీ మూడు అతిముఖ్య మైనవి అని భావించారు. మొదటిది... మానవులు శాంతిని స్థాపించేందుకు ప్రయత్నం చేయాలి. రెండోది... ఒకవేళ ఇతర వ్యక్తులు కూడా రాజీపడడా నికి సిద్ధంగా ఉంటే... ప్రతి ఒక్కరూ శాంతిస్థాపనకు పూనుకోవాలి. తమ వ్యక్తిగత రక్షణ కోసం తాము ఉపయోగించుకునే అధికారాలన్నింటినీ త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండాలి. మూడోది... సమాజం లోని ప్రతి ఒక్కరూ తమ ఆమోదాన్ని తెలియచేయాలి.

**హిందీమూలం : కరపాత్రీ స్వామి**
**అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ**




# ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్: భారతమాత సేవకు

**రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ప్రచారక్ కేవలం ఒక సామాజిక కార్యకర్త లేదా ఒక సైద్ధాంతిక నిర్దేశకుడు కాదు. అతడు ఒక రుషి. భారతమాత సేవకు అంకితమైన నిస్వార్థ జీవి. ప్రచారక్ తన వ్యక్తిగత సౌకర్యాలు, వృత్తి ఆశయాలు, కుటుంబ సంబంధాలను త్యజిస్తాడు. జాతీయ చైతన్యాన్ని మేల్కొల్పడానికి, వ్యక్తిత్వాన్ని పెంపొందించడానికి, ఎలాంటి ప్రచారంలేని, దృఢమైన చర్య ద్వారా సమాజాన్ని ఏకం చేయడానికి తన జీవితాన్ని అంకితం చేస్తాడు.**

ఆర్‌ఎస్‌ఎస్ దాని శతాబ్ది చరిత్ర అంతటా, దాని నిర్మాణం, అభివృద్ధి తాత్వికతలో ఒక ప్రాథమికమైన అంశంగా ప్రచారక్‌పై ఆధారపడింది. భారతదేశం అంతటా ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం, నిస్వార్థ ప్రయత్నాలను క్రమబద్ధమైన, స్థిరమైన పద్ధతిలో వ్యాప్తి చేయడానికి ఆర్‌ఎస్‌ఎస్‌లోని ప్రచారక్‌ల అవసరాన్ని డాక్టర్ హెడ్గేవార్ గుర్తించారు. అప్పటి నుండి ప్రచారక్‌లు భారతదేశం అంతటా ఆర్‌ఎస్‌ఎస్ జాతీయత, క్రమశిక్షణ, సాంస్కృతిక ఐక్యత ఆదర్శాలను వ్యాప్తి చేసే కీలకమైన ప్రతినిధులుగా ఉన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ సంస్థకు తన పూర్తి సమయాన్ని వెచ్చిస్తాడు. అవివాహితుడిగా ఉంటాడు. అతడు స్వచ్ఛంద సేవకుడు. సంస్థ సిద్ధాంతం, కార్యకలాపాలకు అనుగుణంగా దేశానికి సేవ చేయడానికి తన మొత్తం జీవితాన్ని అంకితం చేస్తాడు.

ప్రచారక్‌లు చేస్తున్న సేవలకు వారికి ఎటువంటి వేతనం లేదా జీతం ఉండదు. ప్రచారక్ అనే పదం సంస్కృత భాష నుండి ఉద్భవించింది. ఇది 'వ్యాప్తి చేయడం' అనే అర్థాన్ని సూచిస్తుంది. ఇది సంస్థ జాతీయత, సామాజిక ఐక్యత, సాంస్కృతిక ఐక్యత సూత్రాలను ప్రోత్సహించడంలో వారి పనితీరును ప్రముఖం చేస్తుంది. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపితమైన నాలుగు సంవత్సరాల తరువాత 1929లో ప్రచారక్ వ్యవస్థ ప్రారంభమైంది. 1932లో బాబాసాహెబ్ ఆప్టే, దాదారావు పరమార్థ్, రాంభావు జామ్‌గడే, గోపాల్ రావు యెర్కుంట్వర్‌లతో నలుగురు ప్రచారక్‌లతో కూడిన ప్రారంభ బృందం స్థాపితమైంది. ప్రచారక్‌లు భౌతిక సుఖాలు, కుటుంబ బాధ్యతల నుండి విముక్తి పొంది, పూర్తిగా సామాజిక, సంస్థాగత పనులపై దృష్టి పెట్టడానికి కఠినమైన, క్రమశిక్షణతో కూడిన అస్తిత్వాన్ని కలిగి ఉంటారు. వారు శాఖలను (స్థానిక శిక్షణ కేంద్రాలు) నిర్మించడానికి, బలోపేతం చేయడానికి, స్వయంసేవకులలో సామాజిక సంక్షేమం, విద్య, సాంస్కృతిక అవగాహనను పెంపొందించడానికి ప్రయత్నిస్తారు. నైతిక, సాంస్కృతిక పునరుజ్జీవనం ద్వారా బలమైన, స్వయం సమృద్ధిగల సమ్మిళితమైన భారత్‌ను స్థాపించడం వారి లక్ష్యం. వారి అవిశ్రాంత ప్రయత్నాలు నాగపూర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద స్వచ్ఛంద సంస్థలలో ఒకటిగా మార్చాయి. ప్రచారక్‌లు, స్వయంసేవకులు ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన చేయడం ద్వారా భారత్‌ను తల్లిగా గౌరవిస్తారు. ఆమె పట్ల గౌరవం, భక్తి, సేవానిబద్ధతను వ్యక్తపరుస్తారు. ఇది మాతృభూమి సేవలో ఒకరి శరీరం, మనస్సు, జీవితాన్ని అంకితం చేసే తత్త్వాన్ని ప్రతిబింబిస్తుంది.

**ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ జీవితం, పని**

ప్రచారక్‌లు అత్యంత నిరాడంబరమైన, సామాన్యమైన జీవితాన్ని గడుపుతారు. తెల్లవారుజామున ప్రార్థన, యోగా, దేశభక్తి, ఆధ్యాత్మిక సాహిత్య అధ్యయనంతో వారి దైనందిన జీవితం ప్రారంభమవుతుంది. స్వయంసేవకులతో నిమగ్నమవ్వడం, శాఖలను సమన్వయం చేయడం, సామాజిక సేవా కార్యక్రమాలను పర్యవేక్షించడం, విద్య, సామాజిక ఐక్యత కోసం చర్చించడం, కార్యాచరణ కోసం పగటి సమయాన్ని అంకితం చేస్తారు. యువతలో వ్యక్తిత్వ వికాసం, సంఘీభావాన్ని పెంపొందించడానికి శాఖలు, ఆటలు, చర్చలను నిర్వహించడానికి సాయంకాలాన్ని వెచ్చిస్తారు. అదే సమయంలో చదవడం, ధ్యానంతోపాటు నివేదిక తయారు చేస్తారు. ప్రచారక్ కనీస జీవనశైలి ద్వారా, క్రమశిక్షణ, సేవ, అంకితభావం, సాంస్కృతిక జ్ఞానోదయ సూత్రాలకు అన్ని పనులను అంకితం చేస్తాడు. ఇది దేశం సమాజం పట్ల పూర్తి నిబద్ధతను ప్రదర్శిస్తుంది.

నిరాడంబరత, నిస్వార్థతను స్వీకరించిన ప్రచారక్ క్రమశిక్షణ కలిగిన, దేశభక్తిగల వ్యక్తులను పెంపొందించే క్రమంలో వ్యక్తిగత ఆకాంక్షలను తృణప్రాయంగా వదులుకుంటాడు. ప్రచారక్‌లు స్వయంసేవకులకు శారీరక శిక్షణ, నైతిక విలువలు, మేధో స్పష్టతను బోధించే శాఖలను (రోజువారీ సమావేశాలు) నిర్వహిస్తుంటారు. భారతీయ సంస్కృతి, ఐక్యత, సామాజిక శాంతిని అర్థం చేసుకోవడానికి వారు బౌద్ధిక్ (మేధో సమావేశాలు) నిర్వహిస్తుంటారు. భారతదేశం అంతటా అత్యవసర సమయాల్లో సహాయ కార్యక్రమాలకు కూడా వారు నాయకత్వం వహిస్తారు. ప్రచారక్‌లు "తన్, మన్, ధన్ సే దేశ్ సేవ" అనే మంత్రాన్ని సదా స్మరిస్తూ సేవ, త్యాగం,క్రమశిక్షణ విలువలకు కట్టుబడి ఉంటారు. డాక్టర్ హెడ్గేవార్, గురూజీ గోల్వాల్కర్ వంటి ఆర్‌ఎస్‌ఎస్ మార్గదర్శకులతో ప్రభావితమైన వారు, జాతీయ వ్యక్తిత్వ అభివృద్ధి, సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం సంస్థ లక్ష్యానికి పునాదిగా ఉంటారు.

ఆర్‌ఎస్‌ఎస్ తన నెట్‌వర్క్, కార్యకలాపాలను పెంపొందించుకోవడానికి భారతదేశం అంతటా, వెలుపల ప్రచారక్‌లను నియమిస్తుంటుంది. అనేక మంది ప్రచారక్‌లు ఆర్‌ఎస్‌ఎస్ నుండి ప్రేరణ పొందిన అనుబంధ సంస్థలను స్థాపించడంలో లేదా మార్గదర్శకత్వం వహించడంలో సహాయం చేశారు. వాటిలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ), భారతీయ జనసంఘ్ (బీజేఎస్), విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ), సేవాభారతి మొదలైనవి ఉన్నాయి. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో,

# అంకితమైన రుషి



సేవాభారతి వంటి సామాజిక సంస్థల నుండి భారతీయ జనసంఘ్ (బీజేఎస్), భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వంటి రాజకీయ సంస్థల వరకు అనేక జాతీయ సంస్థలలో ప్రచారక్‌లు కీలకమైన నిర్వాహకులుగా, నాయకులుగా ఉద్భవించారు.

నిషేధాలు, ప్రతికూలతలు ఉన్నప్పటికీ అంకితభావం, క్రమశిక్షణ, నైతిక ప్రవర్తన ద్వారా, ఆర్ఎస్ఎస్ ఔన్నత్యాన్ని, అఖండతను ప్రచారక్‌లు స్థాపించారు. పండిత దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, ఏక్‌నాథ్ రనడే, అటల్ బిహారీ వాజపేయి, నరేంద్ర మోదీ వంటి అనేక మంది ప్రముఖ భారతీయ నాయకులు ప్రచారక్‌లుగా తమ ప్రజా జీవితాన్ని ప్రారంభించారు. క్రమశిక్షణ, సేవ, దేశభక్తిపై ఆధారపడిన నాయకత్వాన్ని పెంపొందించడంలో ఆర్ఎస్ఎస్ ప్రభావాన్ని ఇది వివరిస్తుంది.

**బాధ్యతల్లో ప్రచారక్ సోపానక్రమం**

ఆర్ఎస్ఎస్‌లో ప్రచారకుల సోపానక్రమం క్రమశిక్షణతో, నిర్మాణాత్మకంగా ఉంటుంది. ఇది అధికారం కంటే బాధ్యత, అనుభవం ఆధారంగా ఉంటుంది. ఇది అత్యున్నత స్థాయి నుండి అట్టడుగు స్థాయి వరకు నిర్మితమైనది. ఆర్ఎస్ఎస్ క్రమానుగత చట్రం స్థానిక స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు సమర్థవంతమైన సమన్వయాన్ని సులభతరం చేస్తుంది. సంస్థకు అత్యున్నత సైద్ధాంతిక, ఆధ్యాత్మిక నాయకుడు సర్‌సంఘ్‌చాలక్ సంస్థకు దృక్పథం, మార్గదర్శకత్వం, దిశానిర్దేశం చేస్తారు. సర్‌కార్యవాహ రోజువారీ పరిపాలనను పర్యవేక్షిస్తూ, భారతదేశం అంతటా అన్ని కార్యకలాపాలను సమన్వయం చేస్తారు. సహ-సర్‌కార్యవాహలు సంస్థ, శిక్షణ, కమ్యూనికేషన్ సహా నిర్దిష్ట పోర్ట్‌ఫోలియోలను నిర్వహిస్తారు. అఖిల భారతీయ ప్రముఖ్‌లు భారత దేశం అంతటా సంస్థ కార్యకలాపాలను పర్యవేక్షించే, నిర్దేశించే జాతీయ ఆఫీస్ బేరర్లు. వారు పరిపాలన, భావజాలం, శిక్షణ, సమన్వయానికి సంబంధించి ముఖ్యమైన బాధ్యతలను చూసుకునే జ్యేష్ఠ ప్రచారక్‌లు.

క్షేత్ర ప్రచారక్ వివిధ రాష్ట్రాలు లేదా ప్రాంతాలలో కార్యకలాపాలను పర్యవేక్షిస్తాడు. అయితే ప్రాంత ప్రచారక్ ఒక నిర్దిష్ట రాష్ట్రంలో కార్యకలాపాలను నిర్దేశిస్తాడు. ప్రాంత, జిల్లా కార్యకర్తలకు నాయకత్వం వహిస్తాడు. విభాగ్ ప్రచారక్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి అనేక జిల్లాలను పర్యవేక్షిస్తాడు. అయితే జిల్లా ప్రచారక్ ఒక జిల్లాలోని అన్ని కార్యకలాపాలను నిర్వహిస్తాడు. ఒక జనసమూహం స్థాయిలో, నగర్ లేదా ఖండ ప్రచారక్ నేరుగా శాఖలతో (రోజువారీ సమావేశాలు) సహకరిస్తాడు.

స్వయంసేవకులకు బోధన, ప్రేరణ ఇస్తాడు. ఈ వ్యవస్థ పునాదిలో స్థానిక శాఖలు, సేవా కార్యక్రమాలు, సామాజిక ప్రాజెక్టులలో పాల్గొనే నిబద్ధత కలిగిన స్వయంసేవకులు ఉంటారు. ఈ బహుళ-స్థాయి సోపానక్రమం ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలను క్రమశిక్షణతో, సమన్వయంతో, సమర్థవంతమైన కమ్యూనికేషన్‌తో సులభతరం చేస్తుంది.

ప్రతి స్థాయి ఒకదానితో మరొకటి అనుసంధానమై ఉంటుంది. సంస్థ సూత్రాలు, నిర్ణయాలు, సేవా కార్యక్రమాలు జాతీయ నాయకత్వం నుండి అట్టడుగు వర్గాలకు సజావుగా చేరుతాయని హామీ ఇస్తుంది. ఇది జాతీయ వ్యక్తిత్వ అభివృద్ధి, సామాజిక సమైక్యత పట్ల ఆర్ఎస్ఎస్ అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంది.

**ముక్తాయింపు**

ఒక ప్రచారక్ నిస్వార్థమైన అంకితభావం, సంస్థాగత నిబద్ధత, వ్యక్తి కంటే దేశానికి ప్రాధాన్యత ఇవ్వడం అనే సూత్రాన్ని కలిగి ఉంటాడు. భారత్ సాంస్కృతిక, సామాజిక పటిష్టతకు నిరంతరం పాటుపడుతుంటాడు. దాదాపు ఒక శతాబ్దం పాటు వ్యక్తిగత ప్రయోజనాలకు బదులుగా దేశానికి తనను తాను అంకితం చేసుకోవడం ద్వారా ఆర్ఎస్ఎస్ సారాంశాన్ని ప్రతిబింబిస్తుంటాడు. ప్రచారక్‌లు మూడో కంటికి కనిపించకుండా చేస్తున్న అచంచలమైన ప్రయత్నాలు సమకాలీన భారత్‌లో సామాజిక, సాంస్కృతిక వాతావరణాన్ని సృష్టించడంలో ఆర్ఎస్ఎస్ అస్తిత్వపు ప్రభావానికి భరోసా ఇస్తున్నాయి.

ఈ ప్రచారక్‌లు సమష్టిగా ఆర్ఎస్ఎస్ ను చిన్న స్వచ్ఛంద సంస్థ నుండి భారత దేశంలో అత్యంత ప్రభావవంతమైన సామాజిక-సాంస్కృతిక సంస్థలలో ఒకటిగా మార్చారు. వారు ప్రయత్నాలు చేస్తున్న వాటిలో విద్య, గ్రామీణాభివృద్ధి, శ్రామికుల హక్కులు, జాతీయ ఐక్యత, రాజకీయ అవగాహన ఉన్నాయి. ప్రచారక్‌లు సేవ, సంఘటన్ (ఐక్యత), సంస్కార్ (విలువలు) ఆదర్శాలను సమర్థించడం ద్వారా, ఆధ్యాత్మిక, సాంస్కృతిక చరిత్రలో పాతుకు పోయిన స్థితిస్థాపక, సంఘటిత, స్వావలంబన భారత్ లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకొని వెళుతున్నారు. అందువల్ల, ప్రచారక్‌లు వారి నిస్వార్థ సేవ, భారతమాత పట్ల అంకితభావం కారణంగా నిజమైన అర్థంలో రుషులుగా అవతరిస్తున్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటున్న సందర్భంగా, మన సమాజం కోసం, దేశం కోసం జీవితాలను అంకితం చేసిన రుషులందరినీ స్మరించుకోవడం మన నైతిక కర్తవ్యం.

**(‘ఆర్గనైజర్’ సౌజన్యంతో)**




కాలం చాలా కఠోరమైనది. ఎంతటి వారినైనా తన పొట్టలో పెట్టుకుంటుంది. అదృష్టవంతుల పేర్లుపైకి వస్తాయి. దురదృష్టవంతుల పేర్లు అట్టడుగున పడిపోతాయి. మనదేశంలో ఎందరో పండితులు, కవులు, వీరులు ఉదయించారు. వారిలో అజ్ఞాతంగా కాలగర్భంలో మరుగైపోయినవారు పెక్కుమంది. పేరు ప్రఖ్యాతులు పొందినవారు వేళ్లపై లెక్కించదగినవారు మాత్రమే. ఇలాంటి వారినైనా చరిత్రకారులు గుర్తిస్తారో వారి పేర్లు లోకం నాలుకపై ఉన్నవి. కేవలం వదంతులు అప్రమాణికాలు, రాయో, రప్పో ప్రమాణం కావాలి. ఊరూరా కనిపించే వీరగల్లులు కొండగుర్తులు మాత్రమే. కవుల పుణ్యమా అని ఏ కట్టు కథో ప్రచారం ఉంది కాబట్టి అలాంటి వారిని ఇంతమాత్రమైనా స్మరిస్తున్నాము. అలాంటి అజ్ఞాత వీరులలో ఒకడు 'గొడుగు పాలుడు' (హంపీ నుంచి హరప్పా దాకా/ తిరుమల రామచంద్ర, పేజి.77).

**'రాజ్ఞి ధర్మిణి ధర్మిష్ఠా/ పాపే పాపః సుమే సమాః/ లోకాస్త మనువర్తంతే/ యథా రాజా తథా ప్రజాః'** (రాజు ధర్మాత్ముడైతే, ప్రజలు ధర్మిష్టులవుతారు. రాజు పాపి అయితే ప్రజలు పాపిష్టులవుతారు. రాజు రెండింట సమానుడుగా ఉంటే, ప్రజలు సమానులుగా ఉంటారు. రాజు ఎట్లా ఉంటే ప్రజలు అట్లాగే ఉంటారు. రాజు అంటే ప్రస్తుత పాలకులు.) గొడుగుపాలుడి గాథ శ్రీకృష్ణదేవరాయల కాలం నాటిది. కైఫియత్‌ల ప్రకారం చూస్తే ఆయన పేరు 'భూమానాయుడు'. కథలో కొంత అతిశయోక్తి ఉన్నా చాలా వరకు నిజం. దీనికి నిదర్శనంగా బళ్లారి, అనంతపురం జిల్లాల్లో పెక్కు పొలాల్లో గొడుగు పట్టుకుని నిలుచున్న వ్యక్తి బొమ్మ ఉన్న బండరాళ్లను నేటికీ చూస్తాం. ఈ భూములకు గొడుగు పాలుడి భూములన్న పేరు కూడా ఉంది.

రాయలు గొప్ప వైష్ణవభక్తుడు. కానీ పరమత సహిష్ణుడు. పాశ్చాత్యుల పట్ల ఇతడు చూపిన ఆదరణను గురించి విదేశీయ యాత్రికులు న్యూనిజ్, పేస్‌ల రాతలు చెబుతాయి. ఉదయాన్నే వ్యాయామం, తరువాత స్నానం ఆపై పూజాదికాలు పూర్తయ్యాక రాజప్రాసాదంలోని దేవాలయాలను విధిగా సందర్శించటమూ రాయల దినచర్యలో భాగం. ఆయన పంచమత భంజన తాతాచార్యుల వద్ద వైష్ణవ సంప్రదాయాన్ని స్వీకరించాడు. తన కుల గురువు వ్యాసరాయల్ని, వైష్ణవ పండితుడు అప్పయ దీక్షితు లను భక్తితో గౌరవించేవారు. తిరుమల తిరుపతి, కాళహస్తి, శ్రీరంగం, శ్రీశైలం, అహోబిలం, సింహా చలం, కంచి, వేలూరు లాంటి క్షేత్రాలలో గోపురాలను నిర్మించి పరమత సహనాన్ని చాటుకున్నాడు.

హంపి విరూపాక్షాలయం (శివాలయం) విజయనగర సామ్రాజ్య స్థాపనకు ముందే ఉంది. ఈ సముదాయంలోని కొన్ని కట్టడాలను మొదటి హరిహర రాయలు, కృష్ణదేవరాయలు నిర్మించారు. తన పట్టాభిషేకోత్సవ గుర్తుగా ఆ ఆలయంలో రంగమండపాన్ని నిర్మించాడు శ్రీకృష్ణదేవరాయలు. విరూపాక్ష స్వామికి నవరత్నాలు పొదిగిన బంగారు తామర పుష్పాన్ని, ఒక సర్పహారాన్ని కూడా బహుకరించి, క్రమం తప్పక ప్రతీ త్రయోదశికి ప్రదోషకాలంలో నియమంగా విరూపాక్ష దర్శనానికి వెడుతూ ఉండేవాడు.

ఇష్టదైవం ఏడుకొండలస్వామిని రాయల వారు ఏడుమార్లు సందర్శించినట్లు శాసనాధారాలున్నాయి. మొదటి దర్శనం కళింగ (ఒరిస్సా) ప్రతాపరుద్ర గజపతిని ఓడించి 'అంగీరస నామ సంవత్సరం, ఫాల్గుణ మాసం, శుక్లపక్ష పంచమి తిథికి సరైన శక సంవత్సరం 1434 (అంటే 1513 ఫిబ్రవరి 10వ తేదీన) తన భార్యలతో కలిసి స్వామివారిని దర్శించారు. ద్వితీయ దర్శనానికి దేవేరులు లేకుండా రాయలు ఒక్కరే వెళ్లాడు. అది శ్రీముఖనామ సంవత్సరం వైశాఖ కృష్ణపక్షం ద్వాదశి సోమవారం శక 1435 అంటే క్రీ॥శ 1513 మే నెల 12వ తేదీ. మూడవసారి శ్రీముఖ నామ సంవత్సరం ఆషాఢమాసం శుక్లపక్ష ఏకాదశి సోమవారం శక 1435 అంటే 1513 జూన్ 13వ తేదీ. నాల్గవసారి భావనామ సంవత్సరం ఆషాఢమాసం పౌర్ణమి గురువారం శక 1436 అంటే 1514 జూలై 7వ తేదీ. అయిదవసారి ధాతనామ సంవత్సరం పుష్య మాసం దశమి శుక్రవారానికి సరియైన శక 1438, అంటే 1517 జనవరి 2వ తేదీ, ఆరవసారి బహుధాన్య నామ సంవత్సరం శక 1440 అంటే 1518 అక్టోబరు 16వ తేదీన. చివరిసారిగా విక్రమ నామ సంవత్సరం పాల్గుణమాసం శుక్లపక్ష ద్వాదశి ఆదివారం శక 1442 అంటే 1521 ఫిబ్రవరి 17వ తేదీన స్వామి వారిని దర్శించుకుని అనేక కానుకలను సమర్పించాడు.

రాజాస్థానానికి ఏడు అంగాలు ఉంటాయి. అవి విద్వాంసులు, కవులు, భట్టరాజులు, గాయకులు, పరిహాసకులు, ఇతిహాసవేత్తలు, పురాణజ్ఞులు. వీరు రాజుకు అతి సన్నిహితంగా ఉండేవారు, నమ్మకస్థులు. వీరిలో రాజుకు గొడుగు పట్టే వ్యక్తి మరీ సన్నిహితంగా ఉంటాడు. అలాగే 'ఆపడం' (తాంబూలం అందించే వారు) వింజామరలు వీచేవారు, కావలివాళ్లు, అంగరక్షకులు విశ్వాసపాత్రులైన వారే ఉంటారు. రాయలవారి గొడుగుపాలుడు కడు పేదవాడు. కానీ అతని మనసు సంపన్నం. అందుకే తనకు డబ్బు వస్తే చక్రవర్తిలాగే చేతికి ఎముక లేని తీరులో దానాలు చేయాలని అతడి కల. ఈయనకు ఇద్దరు భార్యలు.

శ్రీకృష్ణదేవరాయల వేసవి విడిది పెనుకొండ (నేటి అనంతపురం జిల్లా). అక్కడకు వచ్చాడాయన. విజయనగరం నుండి పెనుకొండ 120 మైళ్లు. హంపి నుండి పెనుకొండకు ఓ సొరంగమార్గం ఉండేది. దానిగుండా పయనిస్తే 80 మైళ్లు మించదు. ఆ మార్గం గజశాల నుండి ఉండేదట, పూడి పోయింది. రాయలు ప్రతీ త్రయోదశి ప్రదోష

## ఒకరోజు

కాలంలో విరూపాక్షుని దర్శించుకొనేవాడని ముందే చెప్పుకున్నాం. కానీ ఆ తిథికి రాయలు అప్పుడు పెనుకొండలో ఉన్నాడు. రాచకార్యాల ఒత్తిడిలో ఆ సంగతి మరిచాడు. అయితే హఠాత్తుగా గుర్తుకు వచ్చింది. కాలం చూస్తే ఎనిమిది గడియలు మిగిలి ఉంది. అంటే ఇప్పటి ప్రకారం లెక్కగడితే సరిగ్గా మూడు గంటల పదిహేను నిమిషాలు. రాయలు హంపీ వైపు ముఖం పెట్టి ఆలోచించేలోపు గొడుగు పాలుడుకి ఆయన మనసు అవగతమైపోయింది. పంచకల్యాణి వంటి గుర్రాన్ని సిద్ధం చేశాడు. రాజు గుర్రాన్ని దౌడు తీయించాడు. గొడుగు పాలుడు గుర్రాని కన్నా ఒక అడుగు ముందే, అదే వేగంలో సాగాడు. ప్రదోషకాలానికి విజయనగరం దరి చేరుకున్నాడు.

హంపీ కనిపిస్తున్నది. విరూపాక్ష దేవాలయంలో గంటలు మోగిపోతున్నాయి. హేమకూటం చేరేసరికి గుర్రం ఇక నిలువలేకపోయింది. రాజు గుర్రం మీది నుండి దూకి హేమకూటం ప్రక్క నుంచి దేవాలయం వైపు నడిచాడు. గొడుగు పాలుడు గుర్రాన్ని అక్కడి భటులకు అప్పగించాడు. అది ఎన్నిసార్లు పొర్లి అలసట తీర్చుకున్నదో చెప్పలేం.

చెమటలు కక్కుతూ, ఛత్రం పట్టి గొడుగుపాలుడు దేవాలయంలో ప్రవేశించాడు. గొడుగు పట్టిన పిడికిలి వజ్రబంధంగా ఉంది. రాయలు కూడా అలసిపోయాడు. దైవదర్శనం చేసుకొని గొడుగుపాలునికి సెలవు ఇచ్చాడు. మరుసటి రోజు వరకు కొలువు



# శ్రీకృష్ణదేవరాయల కాలంలో చక్రవర్తి – గొడుగుపాలుడు

ఉండదు. అప్పటి దాకా పంటి బిగువున కర్తవ్యనిష్ఠతో ఉన్నాడే కాని, విరూపాక్ష దర్శనం తరువాత గొడుగు పాలుడి శరీరం కూడా వశం తప్పింది. తాగిన వాడిలా తూలిపోతూ మైలున్నర నడిచి బడివే లింగ ఆలయంలో దూరాడు. ఆకలి, అలసటలో అక్కడ పంచిన ప్రసాదం వడపప్పు తిని, పానకం తాగి పడిపోయాడు. తల లింగానికి తగిలి రక్తం వరద కట్టింది. స్పృహ తప్పింది.

అలిసిసొలసి నిద్రించిన రాయలవారికి అర్థరాత్రి గడిచిన తరువాత మెలుకువ వచ్చింది. గొడుగు పాలుని సంగతి గుర్తుకు వచ్చింది. 'ఏమయ్యాడో పాపం! గుర్రం మీద వచ్చిన తనకే ఇంత అలసట ఉంటే, గుర్రం కంటే చురుకుగా పరుగెత్తిన ఆ బోయ బంటుకు ఎలా ఉందో' అనుకున్నాడు. వెంటనే గొడుగుపాలుని వెదకటం ప్రారంభించాడు. వెతగ్గా వెతగ్గా బడివేలు లింగ గుడిలో రక్తపు మడుగులో స్పృహ తప్పి పడి ఉన్నాడు. రాజవైద్యుని రప్పించారు. అతడు నాడి చూసి అరఘడియలో స్పృహ వస్తుందని చెప్పాడు. అలాగే స్పృహలోనికి వచ్చాడు. వెంటనే తన గొడుగు పట్టుకున్నాడు. రెండు దినాలలో పూర్తిగా కోలుకొని కొలువుకు సిద్ధమయ్యాడు.

రెండునాళ్లు గడిచాక రాయలు నిండు కొలువులో కర్పూర తాంబూలం, ఉడుగరలు ఇచ్చి గౌరవించి, 'గొడుగుపాలా! నీ ఇష్టం వచ్చింది కోరుకో' అన్నాడు. గొడుగుపాలునికి చేతినిండా దానాలు చేయాలన్న వాంఛ గుర్తుకొచ్చింది. అవకాశం జారవిడవడం ఎందుకు? 'ఏలిన దొరా! ఒక్కరోజు రాజ్యం ఇప్పించండి' అని మనవి చేశాడు. సభవారంతా వెలవెల పోయారు. 'ఇదేమి కోరిక? రాయల వారికే ఎసరా?' అనుకున్నారు. 'ఒకరోజు రాజ్యంతో ఏమిచేస్తావు' అని ప్రశ్నించాడు రాయలు నవ్వుతూ. 'చేతి నిండా దానాలు చేస్తాను. నా పేరు శాశ్వతం చేసుకుంటాను, మీ గొడుగు నీడన' అన్నాడు వినయంతో గొడుగు పాలుడు. 'సరే ఇచ్చాను రేపే తీసుకో!' అన్నాడు రాయలు. మంచి ముహూర్తంలో రాయలు గొడుగుపాలునికి రాజ్యం ధారాదత్తం చేశాడు. సూర్యోదయం నుంచి మరుసటి రోజు సూర్యోదయం వరకు గొడుగుపాలుని ఇష్టం. అప్పుడే అతని భార్యలు ఏడుకొప్పరుల కరక్కాయ, లక్క (సిరా) మసి సిద్ధం చేశారు.

భార్యలు సహా, గొడుగుపాలుడు సింహాసనానికి నమస్కారంచేసి అధిష్టించాడు. నగరంలోని బీద బిక్కి రాజనగరు మహాద్వారం వద్ద బారులు తీరారు. దానపత్రాలపై సిరా అద్ది మొహర్లు వేయడం ప్రారంభించాడు. ఇంతలో వేగుచుక్క పొడిచింది, తొలికోడి కూసింది. ఏడు కొప్పెరల సిరా అయిపోయింది, కొత్తగా సిరా తయారు చేసే వ్యవధి లేదు. అరుణోదయమయింది. గొడుగు పాలుడు తన భార్యలిద్దరిని నోరు తెరచి నిలబడమన్నాడు. వారి వక్కాకు తమ్ములపై మొహరు అద్ది దానపత్రాలపై ముద్రలు వేయసాగాడు. వక్కాకు తమ్మా అయి పోయాయి. ఇంతలో సూర్యోదయం కూడా అయిపోయింది. గొడుగు పాలుడు జన్మ తరించిందని సంతోషించాడు. సింహాసనం దిగి భార్యలతో పాటు దానికి ప్రదక్షిణం చేసి నమస్కరించి తన గొడుగు పట్టుకొని కొలువుకు సిద్ధమయ్యాడు.

గొడుగుపాలుడు దానం చేసిన భూములు నేటికి అనంతపురం, బళ్లారి జిల్లాలలో ఉన్నాయి. రాయలు వారు గొడుగుపాలుని రాజభక్తికి మెచ్చి 'గొడుగు పాలపురం' (హంపీ దగ్గర) దానంగా ఇచ్చాడు. అదే నేటి 'గోపాలపురం'. ఈ భూముల కవిలె కట్టలలో 'గొడుగుపాలుని భూముల పత్రాలు' ఉండేవి. (పేజీ–3). దుణ్ణే అంటే బాణాకర్ర, బాణాకర్ర ఎప్పుడూ ధరించి రాయలకు అంగరక్షకుడుగా ఉన్న అతని పేర నేటికి ఒక ఊరు ఉంది. దుణ్ణే నాయక పురం. అదే కాలక్రమంలో దణాపురంగా మారింది. భారతదేశ చరిత్రలో ఇలాంటి సంఘటనలు మరేవైనా ఉన్నాయని చూస్తే మొగలుల కాలంలో మరొకటి జరిగింది. హుమయూన్ పేర్షాతో 1539లో చౌసా యుద్ధం చేసి ఓడిపోయాడు. హుమయూన్ పారిపోతూ గంగానదిని దాటడానికి ప్రయత్నించాడు. వెనుక పేర్షా సైన్యం వెంబడిం చింది. గంగలో దిగాడు. వరద ఉధృత మవ్వడంతో కొట్టుకు పోతున్నాడు. దూరంగా బిస్తీ అనే నీటి కావడివాడు గంగలో నీళ్లు ముంచుతున్నాడు. వెంటనే అతడు తన మేక చర్మం సంచిని (మషాక్)ని గాలితో నింపి వదిలి నదిలో కొట్టుకుపోతున్న హుమ యూన్‌ను రక్షించాడు. ఆ కృతజ్ఞతతో బిస్తీను ఒకరోజు ఆగ్రా సింహాసంపై కూర్చుండ బెట్టాడు. అతడు తన సమాజానికి ఉపకారం చేయడానికి తోలు పరిశ్రమకు ఉపయోగపడాలని తోలు నాణేలు ముద్రించాడు.

**మూలం:**


1. "హంపీ నుంచి హరప్పా దాకా" తిరుమల రామచంద్ర ఆత్మ కథ.

2. శ్రీకృష్ణ దేవరాయల కీర్తి చంద్రిక (కూర్పు) వడ్డి విజయసారధి. పేజీ 106, 107

3. Times of India 23rd Jan 2025

4. Vol. III Nos. 32 to 39, 40 to 49, 50 to 59 EpI Report P.151

5. N Nos. 95 to 96 TT.





**డా. కాశింశెట్టి సత్యనారాయణ**

విశ్రాంత ఆచార్యుడు

# జీవితం పెంచిన

హైదరాబాద్, గోల్నాక, తులసీనగర్‌లోని చిన్న పార్క్ కేంద్రంగానే సక్షమ్ విశేష వైద్యసేవలు అందిస్తున్నది. ఇక్కడకే కొందరు తల్లులు బిడ్డలను ఆరోజు తీసుకొని వచ్చారు. వారి మనోభావాలను, బిడ్డలను ఒకసారి పరికిద్దాం.



విక్రమ్     దయాకర్

**సక్షమ్ తెలంగాణ ప్రాంత అధ్యక్షులు దయాకర్, కార్యదర్శి విక్రమ్‌లు చాలా విశేషాలు తెలియచేశారు.**

**ప్ర: దయాకర్ గారు నమస్తే. ఈ సేవల పట్ల సమాజ స్పందన ఎలా ఉంది?**

అది చెప్పే ముందు కొన్ని విషయాలు చెప్పుకోవాలి. కేంద్ర ప్రభుత్వం మొత్తం 21 రకాల వైకల్యాలను గుర్తించింది. వాటన్నిటికీ వైద్యం అందిస్తున్నది సక్షమ్ అనే ఈ ఎన్‌జీవో మాత్రమే. మిగతా ఎన్‌జీవోలు ఒక్కొక్క వైకల్యం మీదనే దృష్టి పెడుతున్నాయి. సక్షమ్ అఖిల భారత సంస్థ. ఆ వైకల్యాలున్న వారికి నయం చేయడంతో పాటు విద్య, ఉపాధి గురించి కూడా పనిచేస్తున్నాం. కరోనా సమయంలోను సేవలు అందించాం. మొదటి వేవ్‌లో హైదరాబాద్ సిటీలో 14 డిజేబుల్ పిల్లల హాస్టల్స్ ఉంటే, ఒక హాస్టల్‌లోని మొత్తం 40 మందికీ సోకింది. వాళ్లకి పూర్తిగా వైద్యం చేయించి, మళ్లీ హాస్టల్‌లో వదిలేదాకా బాధ్యత మేమే తీసుకున్నాం. ఉచితంగా ఐసీయూ నిర్వహించాం. అన్ని హాస్టల్స్‌కి ప్రికాషనరీ మెడిసిన్స్, మాస్కులు, శానిటైజర్లు, ప్రోటీన్ ఫుడ్ ఇచ్చాం. ఆ పిల్లలకు ప్రభుత్వం అందించే సదుపాయాలు కాకుండా చదువు కోసం, ఉద్యోగ కల్పనలో అవసరమైన కోచింగ్ ఇవ్వడంలో సక్షమ్ పనిచేస్తోంది. వైపై సౌకర్యం, పోటీ పరీక్షల కోసం పుస్తకాలు, కోచింగ్ ఇప్పించడం కూడా సక్షమ్ చూస్తున్నది. మొన్నే ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగ భర్తీకి ప్రకటన వచ్చింది. తెలంగాణలో 22 మంది ఫిజికల్లీ హ్యాండీక్యాప్డ్ వాళ్ల చేత ఆ పరీక్ష రాయించాం. 11 మందికి అవకాశం వచ్చింది.

'ధీమహి' కేంద్రంలో మూడు సంవత్సరాల నుంచి ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియర్ థెరపీ, ఆక్యుపేషన్ థెరపీ ఉచితంగా ఇస్తున్నాం. ఇప్పటి వరకు 90 మందికి ఇచ్చారు. 35 మంది ఇంకా తీసుకుంటున్నారు. బయటికి వెళ్లిన 60 మందిలో కనీసం 54 మందికి పూర్తిగా నయమయింది. వాళ్ల పని వాళ్లు చేసుకునేటట్టుగా, వాళ్ల కాళ్ల మీద నడిచేటట్టుగా చేశాం. ఆ విధంగా చేసి వాళ్ల జీవితం వాళ్లు బతికే విధంగా తయారుచేసి సక్షమ్ పంపిస్తుంది. కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తే అలాంటి పిల్లలను హైదరాబాద్ తీసుకొచ్చి ఉచితంగా శస్త్ర చికిత్స చేయించి, మళ్లీ తీసుకెళ్లి వాళ్ల ఇంటి దగ్గర వదిలి, నెల రోజుల పాటు ఫాలోఅప్ కూడా చేస్తాం.

తెలంగాణ మొత్తం మీద కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. ఇంకా, శ్రీశైలం దగ్గరలోని అచ్చంపేట ప్రాంతంలో గిరిజన ఆవాసాలు ఉన్నాయి. అక్కడ చిన్నపిల్లల్లో క్యాట్రాక్ట్ బ్లైండ్‌నెస్ ఉంది. వాళ్లు అది కంప్లీట్ బ్లైండ్‌నెస్ అనుకుంటున్నారు. క్యాటరాక్ట్ అంటే చిన్న పొర సర్జరీ చేసి తీస్తే కళ్లు కనపడతాయి. అది తెలియక వదిలేశారు. సర్వే చేసి, వాళ్లని తీసుకొచ్చి సర్జరీ చేయించి వదిలి పెట్టి వచ్చే కార్యక్రమం తీసుకున్నాం. ఇందులో తొలి అడుగు సర్వే పూర్తయింది. త్వరలోనే శస్త్రచికిత్సలు మొదలవుతాయి. ఇదంతా సక్షమే చేస్తుంది. దివ్యాంగులు వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేటట్టుగా ప్రయత్నం చేస్తుంది. ఈ ధీమహి ఒక ఐడియల్ సెంటర్. కేవలం థెరపీస్ ఇవ్వడమే కాకుండా, ఈ సెంటర్‌తో వైద్య నిపుణులు కూడా లింక్ అయి ఉన్నారు. ఆయుర్వేదిక్ డాక్టర్స్‌తో కూడా మేము టచ్‌లో ఉన్నాం. బెంగళూరు ఆయుర్వేదిక్ యూనివర్సిటీ ప్రొఫెసర్స్ మా పిల్లల్ని వీడియోకాల్‌లో పరీక్షించి మందులు సూచిస్తారు. దానితోనూ చాలా మందికి మంచి ఫలితం వచ్చింది. ఈ విధంగా సక్షమ్ విద్య, వైద్యం, ఉపాధి విషయంలో ప్రయత్నం చేస్తుంది.



ప్ర: ఎక్కడి నుంచి వచ్చారు?

నల్లకుంట, అచ్చయ్యనగర్ నుంచి వచ్చాను.

ప్ర: (చిన్నారికి) నీ పేరేమిటి? స్కూల్ వెళుతున్నావా?

దక్షిక. వెళ్తున్న. (కొంచెం ముద్దగానే)

ప్ర: స్కూల్‌పేరేమిటి?

సరస్వతీ విద్యామందిర్.

**ప్ర: ఈ మార్పు ఇక్కడికి వచ్చాకా వచ్చిందా? మీరు తృప్తిగా ఉన్నారా?**

అవును సర్. ఇదివరకు నిలబడేది కాదు, నిలుచున్నా కొన్ని సెకనులలోనే పడిపోయేది. ఇక్కడికి వచ్చాక ఫిజియోథెరపి వల్ల 11 రోజులలోనే నడవడం, నిల్చోవడం జరిగింది. నేను చాలా సంతోషంగా ఉన్నాను. ఇదివరకు చాలా భయపడేదాన్ని, పాప ఫ్యూచర్ ఏమిటి? అని. మావారి (వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ బిజినెస్) కస్టమర్ ఇక్కడే ఉంటాడు. అలా తీసుకొచ్చాం. లక్కీగా స్లాట్ దొరికింది.

ప్ర: మీరేం చేస్తారు?

నేను పాపను చూసుకుంటూ ఇంట్లోనే ఉంటాను.

ప్ర: స్కూల్లో ఎలా ఉంటుంది?

స్కూల్లో చాలా ఆనందంగా ఉంటుంది. అన్నీ చెబుతుంది సర్.

# మీద ఆశను క్షణాలు



**ప్ర: ఎక్కడి నుంచి వచ్చారు? అబ్బాయికి ఎంత వయసు?**

గోల్నాక నుంచి వచ్చాను. మూడున్నర సంవత్సరాలు.

**ప్ర: ఇక్కడికి వచ్చాక ఎలా ఉంది పురోగతి?**

ఇపుడైతే మంచిగా ఉంది. నిలబడలేని, కూర్చోలేని స్థితిలో తీసుకొచ్చాం. ఇప్పుడు నడుస్తున్నాడు. మెట్లెక్కడం, దిగడం కూడా చేస్తున్నాడు.

**ప్ర: అబ్బాయికి ఇంట్లో ఏమేమి చేయిస్తుంటారు?**

ఫిజియోథెరపి చేయిస్తుంటాం.

**ప్ర: మాటలు పలికించడం ఇలాంటివి...?**

స్పీచ్‌థెరపి కూడా చేయిస్తాను.

**ప్ర: బాబు పేరేమిటి?**

అద్విక్ సాయి.



**మా** బాబు పేరు రియాంశ్. మొదట సాధారణంగానే ఉండేవాడు. స్కూల్‌కు వెళ్లేవాడు. ఏ సమస్యా లేకుండే. కొందరు వైద్యుల నిర్లక్ష్యం వల్ల ఇలా అయ్యాడు. ఓ ఆసుపత్రిలో అనిస్తీషియా ఓవర్ డోస్ ఇచ్చారు. బాబు కోమాలోకి వెళ్లిపోయి ఆపై బెడ్‌రిడన్ అయ్యాడు. లైఫ్ టైమ్ బెడ్‌కేనని చెప్పేశారు డాక్టర్స్. కానీ సక్షమ్‌కు వచ్చాక దయాకర్ సర్ చూసి, ఫిజియోథెరపి ఇప్పిద్దాం, ప్రయత్నం చేద్దామన్నారు.

ఇంతకుముందు వేరేచోట్ల ఫిజియోథెరపి చేయించాము. ఖర్చు చాలా అయింది. రిజల్ట్ లేదు. ఇక్కడకు వచ్చేనాటికి కనీసం మెడ కూడా నిలపలేని స్థితిలో ఉన్న అబ్బాయి ఇప్పుడు నడుస్తున్నాడు. ఇంకా స్పీచ్ రావాలి. ఆ థెరపి ఇప్పిస్తున్నాం. ఇక్కడ ఆక్యుపేషన్ థెరపి, బిహేవియర్ థెరపి, స్పీచ్ థెరపి ఇస్తున్నారు. ఇప్పుడు ఈ పార్క్ మొత్తం నడుస్తున్నాడు.

సమదృష్టి, క్షమతా వికాసం మరియు అనుసంధాన్ మండలి

సక్షమ్

Regn.No: 75/2018

(దివ్యాంగుల కోసం పనిచేస్తున్న అఖిల భారత సంస్థ)

## సక్షమ్ ధీమహిలో స్పీచ్ థెరపిస్ట్ అనుభవాలు

**ప్ర: ఇక్కడ మీరు స్పీచ్ థెరపిస్ట్. ఈ సమస్య ఎట్లా పరిష్కరిస్తున్నారు?**

ఇక్కడకు వచ్చే పిల్లలలో ఆటిజం, ఏహెచ్డి బాధితులు చాలామంది ఉన్నారు. మేం అవసరమైన థెరపీలు ఇస్తాం. స్పీచ్ థెరపీ గురించి చెప్పాలంటే, వాళ్లకు టంగ్ మూమెంట్స్ ఉండవు. ఆ కండరాలు బిగిసి ఉంటాయి. కొరకడం, చప్పరించడం రాదు. కాబట్టి స్పీచ్ థెరపీస్ ఇస్తాం. ప్రస్తుతం వచ్చిన పిల్లలలో 10,12 మందికి మంచి ఫలితాలు వచ్చి, స్కూల్స్‌కి వెళ్తున్నారు. కొందరు పేరెంట్స్ బయట వైద్యం చేయిస్తే రాని ఫలితాలు ఇక్కడ వచ్చాయంటున్నారు. అందుకు కారణం, మాకు మా డాక్టర్ల మద్దతు ఎంతో ఉంది.




ప్రతి పేరెంట్‌కు ఇంటి దగ్గర ఏం చేయాలో చెబుతాం. ముందురోజు రాత్రికి వారు ఏం చేసిందీ మాకు వీడియో రావాలి. హోమ్‌వర్క్ కచ్చితంగా చేయాలి. లేదంటే వాళ్లకి క్లాస్ తీసుకుంటాం. మా సార్ కూడా వాళ్లని ఒక్కరోజు కూడా డుమ్మా కొట్టనివ్వరు. పేరెంట్స్‌కి బాగాలేదంటే ఓకే. మధ్యలో ఖాళీ వస్తే పిల్లలు మర్చి పోతారు. అందుకే నిత్యం వచ్చి తీరాలి. మరొక సమస్య. కొందరు పిల్లలకు ఫిట్స్ వస్తాయి. ఫిట్స్ వస్తే, మూడు మాసాలు చెప్పిందంతా పోతుంది. మళ్లీ మొదలుపెట్టాలి. మా లీవుల విషయంలో చాలా స్ట్రిక్ట్‌గా ఉంటుంది. ఇక్కడ మంచి ఫలితాలు అంటే వీటన్నిటి వల్లనే. ఒకళ్లు ఆరుమాసాలకు మెరుగవ్వచ్చు. స్పీచ్‌లో ఒకళ్లకి సంవత్సరం, రెండేళ్లు కూడా పట్టొచ్చు. వాళ్ల ఐక్యూ లెవెల్‌ని బట్టి ఉంటుంది. దానిని బట్టి ట్రీట్మెంట్ ఇవ్వాలి. మధ్యలో వీళ్లకి ఇతరత్రా ఆరోగ్య సమస్యలు వస్తే, ఇక్కడే డాక్టర్లు చూసి, వాటికి కూడా మందులు ఉచితంగా ఇస్తారు.

**ప్ర: ఇక్కడ వైద్య నిపుణులు ఎంతమంది?**

నెలలో ఐదుగురు వస్తారు. లక్ష్మీ మేడం, నందిని మేడం వస్తారు, శ్రీనివాస్ సార్, వేదప్రకాశ్ సార్ వస్తారు. అదే కాకుండా ఈ ఆయుర్వేదం కూడా ఇస్తూ ఉంటాం. వీటన్నిటినితో మేము పిల్లల స్థితిని మెరుగుపరచగలిగాం. ఇలాంటి సేవ బయట జరగదు. పేరెంట్స్ కూడా చాలా కోఆపరేటివ్‌గా ఉంటారు.

**ఏమైనా మీరు సమాజానికి చేస్తున్న ఈ తరహా సేవ గొప్పది. అందరి తరపున మీకు ధన్యవాదాలు.**



ప్ర: అబ్బాయి పేరేమిటి?

సహర్ష్

మా బాబుకు కొంచెం రైట్ లెగ్ ప్రాబ్లమ్ ఉంది. ఇక్కడకు వచ్చాక 4 నెలలలోనే నయమయింది. మంచి ఫలితం కనిపించింది.

ప్ర: ఎవరు చెప్పారు, ఇక్కడికి వెళ్లమని?

ఫస్ట్‌టైమ్ ఆయుర్వేద హాస్పిటల్‌కు వెళ్లాం. అక్కడ ఒక మేడమ్ కేర్ కాలేజీలో అపాయింటమెంట్ ఇచ్చింది. అక్కడికెళ్తే ఇక్కడ ఓన్లీ కిడ్స్‌కే చేస్తారు, ఇక్కడ చాలా బెటర్‌గా ఉంటుందని మేడమ్ ఇక్కడకు రిఫర్ చేశారు. ఇక అప్పటి నుండి ఇక్కడే చూపిస్తున్నాను.

ప్ర: ఎలా ఉందండి?

చాలా బావుందండి. ఫాకల్టీగానీ, సర్‌గానీ మంచిగా చూస్తున్నారు.

ప్ర: మీరు ఆ లోపం ఉన్నట్టు ఎప్పుడు గుర్తించారు?

బాబు ఫస్ట్ బర్త్‌డే అయింది. అప్పటి నుంచి కొంచెం నడక తేడా వచ్చింది.

బెస్ట్ ఆఫ్ లక్! ఇంకా బాబు సంపూర్ణ ఆరోగ్యవంతుడు కావాలని ఆశిస్తున్నాను.

ప్ర: ఎక్కడి నుంచి వచ్చారు? చిన్నారి పేరు?

రామాంతపూర్‌లో ఉంటామండి. పాప అనన్య. ఐదేళ్లు.

ప్ర: ఏమిటి కంప్లయింట్

హైపర్ యాక్టివ్. ఇది ప్రీమెచూర్ బేబి. ఏడో నెలలో పుట్టింది. పాపాయి బరువు పెరిగే వరకు అని 46 రోజులు నీలోఫర్‌లో ఉన్నాను. ఏ సమస్యా లేదు. కానీ మాటలు చాలా ఆలస్యంగా వచ్చాయి. మొదట బయట చూపించాం. నెలకి రూ 45 వేలు చెల్లించేవాళ్లం. ఫలితం లేదు. చాలా తిరిగాం. ఇంట్లోనే ఫిజియోథెరపీ చేయించాము. నడకొచ్చింది కానీ, మాటలు రావటం లేదు. ఒక దగ్గర కూర్చోదు. అన్నీ సర్దుతుంది. అమ్మ అనదు,మాట్టాడినా ఐ కాంటక్ట్ లేకుండే. అనన్య అంటే స్పందించేది కాదు. ఇక్కడకి నవంబర్‌లో (2024) వచ్చాను. అంటే సంవత్సరం అవుతుంది. ఇప్పుడు పాప అమ్మ, బాబా అంటుంది. స్థిమితంగా కూచుంటుంది, పని చెబితే



చేస్తుంది. తరువాత చెప్పకుండా తానే చేస్తోంది. అందరితో కలిసి అడుకుంటుంది.

ప్ర: ఇంట్లో మీరు కాకుండా ఇంకెవరున్నారు?

అత్తా, మామ అందరం కలిసి ఉంటాం. జాయింట్ ఫ్యామిలి. నా పాపనే ఫస్ట్. జెనెటిక్ ప్రాబ్లమ్ ఏమీ లేదు, ఇలా తనకే వచ్చింది.

దృష్టి, శ్రవణ లోపం, శారీరక లేదా మానసిక పరిమితులు ఉన్న ఎక్కువ మంది వెబ్, మొబైల్ యాప్‌లను ఎక్కువమంది ఉపయోగించగలిగేలా యాక్సెసిబిలిటీ టెస్టింగ్ శిక్షణను సక్షమ్ అందిస్తున్నది.

థలసీమియా బాధితుల జీవితాలను కాపాడేందుకు సక్షమ్ రక్తదాన శిబిరం నిర్వహిస్తోంది. వారికి జీవితాంతం రక్త మార్పిడి అవసరం. ప్రతి యూనిట్ రక్తం వారి జీవనానికి ఆశను కల్పిస్తుంది.

వినికిడి లోపం, చలన పరిమితులు లేదా శారీరక అవసరాలు ఉన్న వ్యక్తులకు అవసరమైన సహాయాన్ని అందించడం ద్వారా వారు స్వతంత్రంగా జీవించేందుకు సక్షమ్ హియరింగ్ ఎయిడ్ పరికరాలు, బ్యాటరీ ట్రై సైకిళ్లు, స్ప్లింట్స్, ఇతర అవసరమైన సహాయక ఉపకరణాలను అర్హులైన వారికి అందిస్తున్నది. సరైన పరికరం ఒక వ్యక్తి జీవితాన్నే మార్చగలదు. వనపర్తి జిల్లా అమరచింతలో సక్షమ్ ఉపాధి నైపుణ్య శిక్షణ కేంద్రం నిర్వహిస్తోంది. దివ్యాంగ మహిళలకు టైలరింగ్ (కుట్టు) శిక్షణ అందించి, స్వతంత్ర జీవనం, ఆర్థిక స్వావలంబన దిశగా మార్గనిర్దేశం చేస్తోంది.

గ్రామీణ, సేవలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో పిల్లలలో కనిపించే పిడియాట్రిక్ కాటరాక్ట్, స్క్వింట్ (మెల్ల కన్ను) ఇతర కంటి సమస్యలను తొలిదశలో గుర్తించేందుకు కంటి ఆరోగ్య పరీక్షా శిబిరాలను నిర్వహిస్తోంది. సమస్యలున్న పిల్లలకు, PVRI Hospital, హైదరాబాద్ సహకారంతో ఉచిత శస్త్రచికిత్సలు, చికిత్సలు అందిస్తున్నారు. సరైన సమయంలో చికిత్స అందించి పిల్లల దృష్టిని కాపాడి, వారి భవిష్యత్ అవకాశాలను మెరుగుపరచడమే ఈ కార్యక్రమం లక్ష్యం. ★



# 'డ్రీమ్ కెరీర్' నిర్వచనం మారుతోందా?

**మనమంతా కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ - ఏఐ) వల్ల వైట్-కాలర్ ఉద్యోగాలు పోతాయేమోనని భయపడుతున్నాం. కానీ మనం గమనించని అసలు విషయం- నైపుణ్యాల విషయంలో భయంకరమైన మానవ వనరుల కొరత.**

**ఇటీవల ఫోర్డు కంపెనీ సిఈఓ జిమ్ ఫార్లీ ఒక పాడ్‌కాస్ట్‌లో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెల్లడించేరు. అదేమిటంటే ఫోర్డు వద్ద 5,000 మెకానిక్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో ఉద్యోగానికి దాదాపు 1 లక్షా 20 వేల డాలర్లు (1 కోటి రూపాయలకు పైగా) వేతనం. అయినా కూడా ఈ ఉద్యోగాలకు దరఖాస్తులు చాలా తక్కువగా వస్తున్నాయి.**

ఇది ఒక్క ఫోర్డు కంపెనీ సమస్య కాదు. అమెరికా మొత్తంలో 80 వేలకు పైగా ట్రక్ డ్రైవర్ పోస్టులు, 2 లక్షల ఎలక్ట్రిషియన్ పోస్టులు, 4 లక్షల ప్లంబర్ పోస్టులు, ఇంకా వేల సంఖ్యలో కార్పెంట్రీ సంబంధిత ఉద్యోగాలు ఎవరూ చేరకుండా ఖాళీగా ఉన్నాయి. ఫ్యాక్టరీ టెక్నీషియన్, మెకానిక్‌ల కొరత లక్షలలో ఉంది. ఇదంతా ఇప్పుడున్న పరిస్థితి. భవిష్యత్తులో ఉత్పన్నమయ్యే సమస్య కాదు.

**అసలు ఇలా ఎందుకు జరిగింది?**

గత 30 ఏళ్లుగా మనం ఒక పెద్ద పొరపాటు చేశాం. "డిగ్రీ లేకపోతే జీవితం లేదు" అనే భ్రమను సమాజం మొత్తంలో నింపివేశాం. స్కూల్, జూనియర్ కాలేజీ, ఇంజనీరింగ్ డిగ్రీ, ఐటీ ఉద్యోగం .. ఇదే జీవితంలో అద్భుత విజయమని అందరూ ఒకే దారిలో పరుగెత్తడంతో లక్షల మంది డిగ్రీల కోసం ఎగబడ్డారు. కానీ దేశాలను నడిపించే అసలు ఉద్యోగాల పట్ల ఎవరూ మొగ్గు చూపలేదు.

కష్టపడి, చెమటోడ్చి పనిచేయడం తక్కువ ప్రతిష్టగా భ్రమను కల్పించేరు. వ్యాపార ఉద్యోగాలు, ప్లంబర్, ఎలక్ట్రిషియన్, ట్రక్ డ్రైవర్, వెల్డర్, ఇండస్ట్రియల్ టెక్నీషియన్.. ఇవన్నీ సమాజం 'కిందిస్థాయి'గా చూసింది. కానీ ఇప్పుడు వీళ్లే ప్రపంచం నడవడానికి చాలా అవసరం. ఈ ఉద్యోగాలు ఏళ్లు గడిచే కొద్దీ అనుభవాన్ని ఇస్తాయి. ఇలాంటి ఉద్యోగాలకు ఏఐ ఏరకంగానూ ప్రత్యామ్నాయం కాదు.

ఏఐతో చేసే ఉద్యోగాలు: డేటా ఎనాలిసిస్, రిపోర్ట్ తయారీ, డిజిటల్ డిజైన్, ఎక్సెల్-ఆధారిత రోల్స్ .. ఇవి రొటీన్‌గా ఉంటాయి. కానీ ప్లంబర్, మెకానిక్, లైన్‌మ్యాన్ ఇలాంటి ఉద్యోగాలకు శారీరకశక్తి, అనుభవ జ్ఞానం అవసరం. ఏఐతో పనిచేసే రోబోట్లు ఇలాంటి పనులు సమర్థవంతంగా పనిచెయ్యలేవు.

**అమెరికాలో**

1. ఒకప్పుడు "సాధారణ" జాబ్ అని భావించిన లైన్‌మ్యాన్ ఉద్యోగానికి ఇప్పుడు 1 లక్షా 50 వేల డాలర్లకి పైగా జీతం అందిస్తున్నారు.

2. ఎలక్ట్రిషియన్ కోసం 6 నెలలు ముందుగానే బుకింగ్ చేసుకుంటున్నారు.

3. హెచ్.వి.ఎ.సి. (హీటింగ్, వెంటిలేషన్, మరియు నియంత్రణ) టెక్నీషియన్ చెల్లింపులు రెట్టింపు అయ్యాయి.

కెనడాలో ట్రేడ్ వర్కర్ల కొరత కారణంగా ఇళ్లు నిర్మించే ఖర్చు 30-40% పెరిగింది.

ఆస్ట్రేలియాలో ప్లంబర్లు, వెల్డర్లు దేశానికి 'నైపుణ్యం ఆధారంగా ఉద్యోగ వలసదారులు' (priority skilled migrants)గా ప్రకటించారు.

భారతదేశంలో కూడా మెట్రో, ఇంటిగ్రేటెడ్ ఫ్యాక్టరీలు, ఎలెక్ట్రికల్ వాహనాల తయారీ సంబంధించిన సాంకేతిక నిపుణులు లేక పనులు సకాలంలో పూర్తి కావడంలేదు. టాటా, మారుతి, హ్యుందాయ్ మొదలైన పరిశ్రమలు ఐటిఐ, పాలిటెక్నిక్ టాలెంట్ క్యాంపస్ డ్రైవ్ లు నిర్వహిస్తు న్నాయి. ఎలెక్ట్రికల్ వాహనాలకి సంబంధించిన స్కిల్స్, రోబోటిక్స్ మెయింటెనెన్స్, మెషిన్ టెక్నీషియన్స్ వంటి ఉద్యోగాల జీతాలు వేగంగా పెరుగుతున్నాయి.

**ఇప్పుడు అసలు ప్రశ్న**

1. సమాజంలో 'డ్రీమ్ కెరీర్' నిర్వచనం పూర్తిగా మారిపోతుందా?

2. డిగ్రీతో ఆఫీస్ క్యూబికల్‌లో కూర్చునే ఉద్యోగాల కంటే, కళతో, నైపుణ్యంతో, చేతిపనితో పనిచేసే ఉద్యోగాల విలువ పెరుగుతుందా?

**అవును, ఇదే జరుగుతోంది.**

పవర్ పాయింట్ చేయగలవారు, కంపెనీ సమావేశాలలో మాట్లాడగలిగేవారు, డిగ్రీ ఉన్నంత మాత్రాన గౌరవం, హోదా ఆశించే వారు కాదు; కొత్త వ్యవస్థలను నిర్మాణం చేయగలిగేవారు, ఎలాంటి సమస్యలనైనా సరిచేయగల నిర్వహణా సామర్థ్యం కలిగినవారు, ప్రపంచాన్ని నడిపించే మౌలిక వ్యవస్థలను నిలబెట్టగలవారు కృత్రిమ మేధా యుగంలో ఏవిధమైన ప్రత్యామ్నాయం లేని అత్యవసరమైన, అమూల్యమైన శ్రామిక వనరులు.

శ్రామిక విప్లవం పోరాటాల వల్ల వస్తుందని కారల్ మార్క్స్ అన్నాడు. కానీ నైపుణ్యాలతో ఎదిగినవారి అవసరాన్ని సమాజం గుర్తించడం వల్ల అసలైన శ్రామిక విప్లవం వస్తుంది.

ఇది రక్తపాతం లేని విప్లవం. మానవ విలువలను ఆవిష్కరించే విప్లవం!!



**ప్రొ. దుగ్గిరాల రాజకిశోర్**

## కథ

ఆ ఆస్పత్రిలోని డాక్టర్‌గారి కన్సల్టింగ్ రూమ్‌లో కూర్చుంది కీర్తన.

ఆకుపచ్చరంగుతో నిండి ఉంది ఆ ఆవరణంతా. గదిలో చల్లదనం ఎక్కువవడంతో తను వేసుకున్న కోటు సర్దుకుంది.

అంతలో తెల్లకోటు, మెడలో స్టెతస్కోపుతో ఉన్న తెల్లటి వ్యక్తి ఆమెకు ఎదురుగా వచ్చి కూర్చున్నాడు. అతను పొట్టిగా ఉన్నాడు. కళ్లు పిల్లి కళ్లలా అనిపించాయి ఆమెకు.

'ఇతడు భారతీయుడు కాదు. బహుశా చైనా డాక్టర్ అనుకుంటా!' అనుకుంది కీర్తన.

అతను ఆమెవంక నవ్వుతూ చూసి

"మీ సమస్యేంటో నాకర్థమైంది" అన్నాడు.

ఆమె ఏదో చెప్పబోతుంటే... అతను ఆపుతూ "మీకు పిల్లలంటే ఇష్టం. మీకో బిడ్డ కావాలి. కానీ గర్భం దాల్చడం అంటే భయం. డెలివరీ టైంలో వచ్చే నొప్పుల గురించి మరింత భయపడతారు. అందుకోసం ఒక ప్రత్యామ్నాయం వెతుక్కుంటూ మా ఆస్పత్రికి వచ్చారు. అంతేకదా మేడం!" అన్నాడతను.

"అవును" అంది కీర్తన.

అతను చెప్పడం మొదలెట్టాడు.

"ఇప్పుడు మేం బిడ్డను గర్భంలో మోసి, జన్మనిచ్చే హూమనాయిడ్ రోబోలను అభివృద్ధి చేస్తున్నాం." అన్నాడు.

ఆమె షాక్ తిన్నట్టు చూసింది.

"ఎందుకలా విస్తుపోతున్నారు? మీరు అప్పట్లో వచ్చిన సినిమా చూడలేదా? పెళ్లి పీటల మీద నుంచి పెళ్లి కూతురుని ఎత్తుకొచ్చిన రోబో, తాను 'అభివృద్ధి చేసిన కృత్రిమ జీవకణాన్ని నీ గర్భంలో ప్రవేశ పెడతాను. మనిషికి, యంత్రానికి పుట్టిన తొలిబిడ్డ, మనబిడ్డే అవుతుంది. అది హోమో సెపియన్ కాదు. రోబో సెపియన్.' అని ఆ సినిమాలో రోబో చెప్పాడు కదా. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా ఆ సినిమాలోని రోబో చెప్పిన మాటలు నిజం కాబోతు న్నాయి. అయితే ఆ సినిమాలోని రోబో చెప్పినట్టు కాకుండా, ఒక ఆధునిక, అద్భుతమైన శాస్త్రీయతతో కూడుకున్న టెక్నాలజీ" అన్నాడు ఆ డాక్టర్.

"ఓ మైగాడ్! ఇదంతా సాధ్యమేనా?" అంది కీర్తన.

"మా పరిశోధనా సంస్థ అల్‌రెడీ ఒక హూమనాయిడ్ రోబోను రూపొందించింది. దాని కడుపున బిడ్డను మోసేలా కృత్రిమ గర్భసంచిని ఏర్పాటు చేశాం. అంటే ఇది ఆర్టిఫిషియల్ ఊంబ్ అన్నమాట!"

అతను ఇంకా ఏదో చెప్పబోతుంటే..."అదెలా సాధ్యం?" అంది కీర్తన.

"ఎందుకు సాధ్యం కాదు. నెలలు తక్కువగా పుట్టిన పిల్లల్ని ఏం చేస్తారు?" అన్నాడు.

"ఇంక్యుబేటర్‌లో పెట్టి నెలలు నిండేవరకూ సాకుతారు" అంది కీర్తన.

"ఇదీ అంతే. నెలలు తక్కువగా పుట్టిన పిల్లల్ని పెట్టే ఇంక్యుబేటర్ లాంటి కృత్రిమ గర్భంలోనే సాకినట్టు, ఈ రోబోకు కూడా కృత్రిమ ఇంక్యుబేటర్ అమరి ఉంటుంది. అది ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సాయంతో పని చేస్తుంది. బిడ్డ పెరగడానికి కావలసిన వసతి, సౌకర్యం, పోషకాలు ఆ రోబోలో ఉండే ఇంక్యు బేటర్‌లోనే దొరుకుతాయి."

"అదెలా జరుగుతుంది?" అంది.

"మామూలుగా.. సహజంగా రూపొందించిన పిండాల్ని ఆ రోబోలోని కృత్రిమ గర్భసంచిలో ఉంచుతారు. ఆ గర్భసంచిలో అమ్నియాటిక్ ఫ్లూయిడ్ అంటే ఉమ్మనీరు కూడా ఏర్పాటు చేస్తారు. ఒక పైపు ద్వారా పోషకాలను పంపుతారు. నెలలు నిండి, బిడ్డకు



# అమ్మతనం

## డాక్టర్ ఎమ్. సుగుణరావు





**భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీలో విశిష్ట బహుమతి పొందిన కథ**

పూర్తి రూపం వచ్చిన తర్వాత, అంటే ప్రసవ కాలం పూర్తయ్యాక ఆ పిండాన్ని తల్లి చేతిలో పెడుతుంది రోబో. అలా తన గర్భాన పెంచే మన రోబోని 'యంత్రమాత' అనవచ్చు. ఈ రోబో కేవలం ఒక ఇంక్యుబేటర్‌మీదే కాదు, కడుపున పెంచడం మొదలుకొని, డెలివరీ అయ్యేవరకూ సహజంగా తల్లులు ఏ రకమైన భావోద్రేకాలకు లోనవుతారో అలాగే డెలివరీ టైంలో జరిగే నొప్పులు సహా తాను అనుభవిస్తుంది. అయితే వీర్యకణం, అండం... ఈ ఫలదీకరణంతా టెస్ట్‌ట్యూబ్ మాదిరిగా బయటే జరుగుతుంది. ఆ తరువాతే ఫలదీకరణ జరిగాక, ఫెర్టిలైజ్డ్ ఓవంని రోబో గర్భంలో ప్రవేశపెడతారు."

"మై గాడ్!" అంది కీర్తన.

"ఏంటి మైగాడ్... మైగాడ్... అంటున్నావ్?" అన్నాడు సాకేత్.

సుమారు ఉదయం ఏడైనా, నిద్రలోంచి లేవని కీర్తనను లేపుతూ.

కళ్లు విప్పార్చుకుంటూ చూసింది, మంచం మీదనుంచి లేచిన కీర్తన.

ఎదురుగుండా బెడ్ కాఫీతో కనిపించాడు భర్త.

సింగపూర్‌లో తమింట్లో తానున్నానని, ఇదంతా కలని ఆమెకు అర్థమై, ఆ కలకు కారణమేంటోనని ఆమె ఆలోచనలో పడింది.

మంచం పక్కన పుస్తకం – ఇంగ్లీషులో రాసిన పుస్తకానికి తెలుగు అనువాదం 'సీమంతానికి సిద్ధమౌతున్న ప్రెగ్నెంట్ రోబోలు'.

తాను పడుకోబోయే ముందు సీరియస్‌గా చదివిన ఆ పుస్తకంలోని విషయాలే కలలోకి వచ్చాయి అనుకుంది కీర్తన.

భర్త ఇచ్చిన కాఫీ కప్పును చేతిలోకి తీసుకుని, తన కల గురించి సాకేత్‌కి చెప్పింది.

అతను నవ్వుతూ ఆమెవంక చూసి

"నీ మనసులోని కోర్కెలు, ఆశలు ఇలా కలలుగా రూపాంతరం చెందుతున్నాయి. సరే.. ఇక తయారవ్వు బయలుదేరదాం. నిన్ను ఒకచోటస్త్రుకు తీసుకెళుతున్నాను. ఈరోజు మన ఆఫీసుకు సెలవే కదా" అన్నాడు.

సాకేత్ తొందర చేయడంతో, కీర్తన కాఫీ తాగడం పూర్తిచేసి, వాష్‌రూమ్‌లోకి వెళ్లింది.

* * *

వాష్‌రూమ్‌లో ఉన్నంతసేపూ తనకొచ్చిన కల గురించే ఆలోచిస్తోంది కీర్తన. స్నానం పూర్తిచేసి డ్రస్సు మార్చుకుని బాల్కనీలోకి వచ్చింది. ఎదురు ఫ్లాట్‌లో ఆ చైనా అమ్మాయి రెండేళ్ల కొడుకును ఎత్తుకొని నవ్వుతూ చూసింది. వాడు కూడా ఆమెలాగే బొద్దుగా ఉన్నాడు. కీర్తన వాళ్లింటికి తను తరుచుగా వెళు తుంది, ఆ పిల్లాడిని ఎత్తుకోవడం కోసమే! 'కాసేప య్యాక వస్తాను' అని చెప్పి, వంటగదిలోకి వచ్చేసరికి తమిళ కుక్ దేవకి వంటగదిలో పనిచేస్తూ కనిపించింది.

ఇద్దరూ ఉద్యోగాలకు వెళ్లిపోవడంతో ఆమెను పెట్టుకున్నారు. ఆమెకు తెలుగు కూడా వచ్చు. ఆరోజు ఏమి వండాలో పురమాయిస్తూ ఆమెతో కబుర్లలో పడింది కీర్తన.

దేవకి ఆమాట ఈమాట చెబుతూ, "నా ఇల్లూ అద్దెకిద్దామనుకుంటున్నానమ్మా! మన ఇండియన్ కరెన్సీలో దాదాపు పాతిక లక్షలు అద్దె వస్తుంది నాకు" అంది నవ్వుతూ.

"ఇల్లు అద్దెకివ్వడమేంటి? నీకేమైనా మతి పోయిందా? అసలే ఇరుకిల్లు. ఇద్దరు పిల్లలూ. సింగిల్ బెడ్‌రూమ్ అన్నావు కదా. గొప్ప జోకేస్తున్నావ్" అంది కీర్తన.

"జోక్ కాదమ్మా! నా ఇల్లు అద్దెకిస్తాను ఏ అమ్మకైనా. శ్రీలంక తమిళమ్మాయి, తనిల్లు అద్దెకిచ్చి పాతిక లక్షలు సంపాదించింది" అంది నవ్వుతూ దేవకి.

"బాబోయ్... నీకు మెంటల్ అనుకుంటా..." అంది కీర్తన, దేవకి వంక వింతగా చూస్తూ.

"మెంటలేంటమ్మా! ఇప్పుడు బాల్కనీలోని బాబును చూశారు కదా. భలే ముద్దొస్తాడు. ఆ శ్రీలంక తమిళమ్మాయి ఆ పిల్లాడి తల్లికి తనింటిని అద్దె కిచ్చింది" అంది దేవకి.

కీర్తన బుర్ర గిర్రున తిరిగింది.

దేవకి వెంటనే అంది

"ఇంకా మీకు అర్థంకాలేదా?"

కీర్తన తల అడ్డంగా తిప్పింది.

"అద్దెకివ్వడం అంటే, ఇల్లు అద్దెకివ్వడం కాదు. గర్భసంచి అద్దెకివ్వడం. అంటే సారోగేట్ మదర్" అంది దేవకి.

ఒక్కసారి షాక్ తిన్నట్టుగ్గా ఆమె వంక చూసింది కీర్తన.

కలలోనూ, ఇలలోనూ ఈ గర్భసంచి నన్ను వదలడం లేదు. అసలేం జరగబోతోందో? అనుకుంది కీర్తన.

"మా కాలనీకి అద్దె తల్లుల్ని కుదర్చడం కోసం, సింగపూర్ పెద్ద ఆస్పత్రి నుంచి ఒక లేడీ డాక్టరమ్మ వచ్చింది. కాలనీలో ముసలవ్వలు ఆమెను మొహం మీదే తిట్టారు కానీ, మేం చాలామంది ఆడవాళ్లం చెవులు రిక్కించి విన్నాం. అద్దె తల్లికి 21 నుంచి 35 సంవత్సరాలలోపు వయసుండాలటమ్మా. ఐదు కన్నా ఎక్కువ కాన్పులు అవకూడదట. అలాగే అద్దె తల్లి కావడం కోసం, ఆమె భర్త అనుమతి కావాలట. ఇద్దరూ ఆరోగ్యంగా ఉండాలట."

దేవకి వంటగదిలో పనిచేస్తూనే చెప్పుకుంటూ పోతోంది.

ఆమె మాటలకు ఆశ్చర్యపడుతూనే చెవులు రిక్కించింది కీర్తన.

"పాపం కాన్పు నిలబడని ఆడవాళ్లు బిడ్డల కోసం తహతహలాడతారు కదమ్మా! ఆ గర్భసంచి, పిండం నిలవలేకపోయినవారి కోసమే ఈ అద్దె తల్లుల్ని తీసు కుంటారంట. మగవాడి స్పెర్మ్, ఆడమనిషి అండం లాబ్‌లో ఫలదీకరణ చేయగా పుట్టిన ఆ పిండాన్ని, అద్దె తల్లి గర్భంలో ప్రవేశపెడతారు. అలా ప్రసవం వరకూ ఆ తల్లి, ఆ పిండాన్ని మోసి డెలివరీ అయిన తర్వాత యజమానులకు బిడ్డను అప్పగించాలి. ఆ ప్రసవకాలంలో అద్దె తల్లి సమస్త బాధ్యతా, ఆరోగ్య ఖర్చులూ యజమానులవే. ఇలా పదినెలలు కళ్లు మూసుకుంటే పాతిక లక్షలు దొరుకుతాయి. మాలాంటివారికి అది ఎక్కువే కదమ్మా!" అంది దేవకి.

'దేవుడా! ఎక్కువగా చదువుకోని దేవకి, అద్దె తల్లి గురించి ఎంత గొప్పగా చెప్పింది. బహుశా సింగపూర్ ప్రభావమా? తమిళనాడు నుంచి సింగ పూర్‌కి వలస వచ్చి, ఇక్కడ లేబర్ కాలనీలో ఉంటూ, పిల్లల్ని చదివించుకుంటున్న దేవకి అద్దె తల్లిగా మారే సాహస కార్యానికి పూనుకోవడం... నిజానికి పాపం వారి ఆర్థిక స్థితే అలా ఆలోచింప చేస్తుందేమో.' అనుకుంది.

గంట తర్వాత దేవకి, పని పూర్తి చేసిన తర్వాత, అప్పటికే తయారైన సాకేత్, కీర్తనతో కదిలి బయటకు బయలుదేరాడు.

"మనం ఎక్కడికి వెళ్తున్నాం?" అంది కీర్తన.

"కంగారుపడకు నీకే తెలుస్తుంది" అన్నాడు సాకేత్.

దాదాపు అరగంట తర్వాత సాకేత్ తీసుకొచ్చిన ప్రదేశం చూసి

"ఆస్పత్రికి మనం ఎందుకొచ్చినట్టు?" అంది, కొంచెం కోపంగానే.

"కలలోనూ.. ఇలలోనూ.. నీ మనసు దేనిచుట్టూ తిరుగుతుందో నాకర్థమైంది. నీలోని భయం పోగొట్ట డానికే ఈ ఆస్పత్రిలోని లేడీ కౌన్సెలింగ్ డాక్టర్ దగ్గరకు తీసుకొచ్చాను" అన్నాడు.

మరో పావుగంట తర్వాత ఆ ఆస్పత్రిలోని ఆ డాక్టర్ కౌన్సెలింగ్ రూమ్‌లో కూర్చుంది కీర్తన. సాకేత్ ఆమె సమస్య గురించి డాక్టర్‌తో చెప్పిన తర్వాత, అతన్ని బయట కూర్చోమని, డాక్టర్ మాట్లాడటం మొదలెట్టింది. అంతకుముందు రోజు రాత్రి తనకు కలలో కనిపించిన కన్సల్టింగ్ రూమ్‌లానే ఉంది ఆ రూమ్.

'కొంపదీసి ఈమె, కలలోని డాక్టర్‌లాగ గర్భం దాల్చే రోబోల గురించి చెబుతుందా?' అనుకుంది.

నవ్వుతూ చెప్పడం మొదలెట్టింది ఆ చైనా లేడీ డాక్టర్.

"మీరు పిల్లలను ఎందుకు వద్దనుకుంటున్నారు? కొంతవరకు మీ భర్త మీ భయాలను గురించి చెప్పారు. అయితే ఆ విషయం మీ నుంచి విందామని." అంది డాక్టర్ తన రివాల్వింగ్ చైర్‌లో వెనక్కి వాలి.

"పిల్లలు కాదు, అసలు పెళ్లే వద్దనుకున్నాను. అయితే మా అమ్మానాన్నల బలవంతం మీద నాకు నచ్చిన సాకేత్ దొరకడంతో పెళ్లి చేసుకున్నాను. 'మనకు పిల్లలు వద్దని' సాకేత్ నుంచి మాట తీసుకున్న తర్వాతే నేను పెళ్లికి ఒప్పుకున్నాను. మా పెళ్లి జరిగి రెండేళ్లు గడిచాయి. ఇంటా బయటా... 'పెళ్లైంది. ఇంకా పిల్లలు లేరా? లేక డ్యూయల్ ఇన్‌కమ్ విత్ నో కిడ్స్ అనే 'డింక్' కాన్సెప్ట్‌తో వెళుతున్నారా?'



అంటూ మాకు కొంచెం ర్యాగింగ్ జరుగుతోంది.”

కీర్తన చెప్పడం పూర్తిచేయక మునుపే, “అసలు నువ్వు పిల్లలు ఎందుకు వద్దనుకున్నావు?” అంది డాక్టర్, కీర్తన వంక సూటిగా చూసి.

“నేను, మా అక్క ఇద్దరం. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ప్రాణం. అక్కకి డిగ్రీ పూర్తవక మునుపే పెళ్లయింది. మా మావయ్యగారి అబ్బాయి అక్కను ప్రేమించి పెళ్లి చేసుకుంటాననడంతో ఆమెకు ఇరవై ఏళ్లకే పెళ్లయింది.

“ఆ తర్వాత...” అంది లేడీ డాక్టర్.

“పెళ్లై సంవత్సరం తిరిగేసరికల్లా అక్క కన్సీవ్ అయ్యింది. అందరం చాలా సంతోషించాం. శ్రీమంతం కూడా జరిపాం. అక్క డెలివరీ టైంకి ఇంజనీరింగ్ చదువుతున్న నేను, అక్క దగ్గరకు వచ్చేశాను. అమ్మా, నాన్న, బావ అంతా అక్కకు డెలివరీ జరిగే ఆస్పత్రి గది బయటున్నాం. ఒక గంట గడిచిన తర్వాత ప్రసవ సమయంలో అక్కకు బీపీ ఎక్కువైందని, కడుపులో బిడ్డ అడ్డం తిరిగాడని, కాన్పు కష్టమయ్యేలా ఉందని డాక్టర్ చెప్పడంతో మేమంతా భయపడ్డాం. ఆస్పత్రిలో అక్కకు ఆపరేషన్ చేయడానికి డాక్టర్లు ఏర్పాట్లుచేయడం మొదలెట్టారు. కొద్ది సేపటికి ఆ థియేటర్ గదిలోంచి బేబీ ఏడుపు వినిపించింది. ఆ తర్వాత పాప ఏడుపు తప్ప, అంతా నిశ్శబ్దం. డాక్టర్లు వచ్చి చెప్పారు “బిడ్డని బతికించగలిగాం కానీ, తల్లిని బతికించలేకపోయాం' అని.

ఆరోజు నేను ఏడ్చిన ఏడుపు ఇప్పటివరకు ఆగలేదు. నా ప్రియమైన అక్క ఈ లోకంలో లేదనే చేదు నిజం తెలిసిన క్షణం నుంచి, ఇంకా ఏడుస్తూనే ఉన్నాను. అందుకే భయం... డెలివరీ అన్నా, ప్రసవ వేదనతో నొప్పులు పడే ఆడవాళ్లను చూస్తే ఆ భయం ఎక్కువవుతుంది. అందుకే నేను పిల్లలు వద్దనుకున్నాను. ఆ తర్వాత మా బావ మళ్లీ పెళ్లి చేసుకుని, అమెరికా వెళ్లిపోయాడు. మా అక్క కూతుర్నే నేను పెంచుకుందామనుకున్నాను. కానీ అవకాశం కుదరలేదు. తర్వాత నా చదువు పూర్తయి ఉద్యోగం వచ్చిన తర్వాత మా అమ్మానాన్నల బలవంతం మీదే పెళ్లి చేసుకున్నాను.”

చెప్పడం ముగించింది కీర్తన.

ఆ మాటలకు ఆ లేడీ డాక్టర్

“అవును నిజమే. తమ తోబుట్టువును కోల్పోతే ఆ విషాదాన్ని జీవితాంతం మోయాలి.” అంది నిట్టూరుస్తూ.

“అక్క నా ప్రాణం. ఇద్దరం ఒకే ప్రాణంగా బతికాం. అంటే ఇద్దరం కవలలం.” అంది కీర్తన.

“ఓహ్ .... అర్థమైంది. ఒకే శరీరం మీరిద్దరూ. అందుకే మీకు అంత అటాచ్‌మెంట్. అయితే కొన్ని విషయాలు చెబుతాను వినండి...

సాధారణంగా మన శరీరం నలభై అయిదు డెల్ యూనిట్ల నొప్పిని భరించగలదు. కానీ గర్భాన్ని మోసే

ఆరోజు నేను ఏడ్చిన ఏడుపు ఇప్పటివరకు ఆగలేదు. నా ప్రియమైన అక్క ఈ లోకంలో లేదనే చేదు నిజం తెలిసిన క్షణం నుంచి, ఇంకా ఏడుస్తూనే ఉన్నాను. అందుకే భయం... డెలివరీ అన్నా, ప్రసవ వేదనతో నొప్పులు పడే ఆడవాళ్లను చూస్తే ఆ భయం ఎక్కువవుతుంది. అందుకే నేను పిల్లలు వద్దనుకున్నాను. ఆ తర్వాత మా బావ మళ్లీ పెళ్లి చేసుకుని, అమెరికా వెళ్లిపోయాడు. మా అక్క కూతుర్నే నేను పెంచుకుందా మనుకున్నాను. కానీ అవకాశం కుదరలేదు. తర్వాత నా చదువు పూర్తయి ఉద్యోగం వచ్చిన తర్వాత మా అమ్మానాన్నల బలవంతం మీదే పెళ్లి చేసుకున్నాను.



తల్లులు యాభై ఏడు డెల్ యూనిట్ల పురిటి నొప్పిని భరిస్తారు. అంటే శరీరంలోని ఒక పాతిక ఎముకలు ఇరిగితే ఎంత నొప్పి వస్తుందో, అంత నొప్పిని భరిస్తారు. ఆ దశలో వారికి మాతృత్వ హార్మోన్ అంటే మెటర్నల్ ఆక్సిటోసిన్ సహాయ పడుతుంది. పురిటి నొప్పులను భరించే శక్తినిస్తుంది. అది సహజంగా జరిగేదే. అంచేత ఏ స్త్రీ ప్రసవ వేదనకు భయపడదు. అది శాపంగా అనుకోదు, ఆమెకు మాతృత్వం వరమైనప్పుడు.” చెప్పడం ముగించింది ఆ లేడీ డాక్టర్.

కీర్తన ఆమెకు నమస్కారం చేసి, ఆ ఛాంబర్ లోంచి బయటకొచ్చింది.

భర్తతో ఏమీ మాట్లాడలేదు. ఇంటికి వెళ్లేంత వరకూ మౌనంగానే ఉంది.

ఆరోజు రాత్రి తల్లికి ఫోన్ చేసింది కీర్తన.

“ఒకసారి నువ్వు నాన్నగారు సింగపూరు రండి. నాకు బెంగగా ఉంది” అంది కీర్తన.

“వచ్చేవాళ్లమే... కానీ, అమెరికా వెళుతున్నాం తల్లీ!” అంది అమ్మ. “దేనికి?” అంది కీర్తన.

“అన్నట్టు, నీకు చెప్పడం మర్చిపోయాం. అక్క కన్సీవ్ అయ్యింది. డెలివరీ టైం కూడా దగ్గర పడిందట. ఈ విషయం కూడా వాళ్లు మాకు లేట్‌గా చెప్పారు. డెలివరీ టైంలో అక్క దగ్గర ఉండాలని...” చెప్పింది తల్లి.

ఆ మాటలకు కీర్తన ఆలోచనలో పడింది.

‘అవును, ఆమె తనకు అక్కే! బావగారిని పెళ్లి చేసుకున్న ఆమె నాకు అక్కే అవుతుంది. అమ్మ మనసు ఎంత గొప్పది. కడుపున పుట్టకపోయినా అల్లుడు రెండో పెళ్లి చేసుకున్న ఆమెను కూతురుగా భావిస్తోంది. ప్రపంచంలోని తల్లులంతా అంతేనేమో!’ అనుకుంది మనసులో.

“అలాగే అమ్మా! తప్పకుండా వెళ్లండి. ఇప్పుడు మీ అవసరం అక్కకే ఉంది.” అంది కీర్తన.

“భలేదానివే! నీకూ రేపొద్దున ఆ అవసరం వస్తే, వచ్చి వాలిపోమూ...! నీ కడుపులోనూ నలుసు పడిందనే శుభవార్త తెలిసిన మరుక్షణమే రెక్కలు కట్టుకుని వచ్చి, నీ ముందుంటాం.” ఉద్వేగంగా తల్లి చెప్పిన మాటలు కీర్తనకు సంతోషాన్ని కలిగించాయి.

తల్లి అన్న ఆ మాటలను ఆ రాత్రంతా పదే పదే గుర్తు చేసుకుంటూనే ఉంది కీర్తన.

* * *

తర్వాతరోజు ఉదయం, రోజూలా కాకుండా సాకేత్ కన్నా ముందు నిద్రలేచిన కీర్తన, బెడ్ కాఫీతో భర్తను లేపడంతో అతను ఆశ్చర్యపోతూ “శుభోదయం” అన్నాడు.

“అవును. ఇక అంతా శుభోదయమే...” అంది కీర్తన, తన బొటన వేలును పైకెత్తి.

ఆమె మనసులోని మాట అర్థమైంది సాకేత్‌కి. రెండు చేతులతో ఆమెను చుట్టేశాడు.

* * *

సంవత్సరం తర్వాత కీర్తనకు ఆడపిల్ల పుట్టింది. తన సోదరే తనకు పుట్టిందని ఆనందపడిరది కీర్తన.

అమ్మా నాన్న, ఆమె డెలివరీకి ముందే సింగపూరు చేరుకున్నారు.

కీర్తనలో ఎందుకు హఠాత్ మార్పు వచ్చిందో సాకేత్‌కి అర్థం కాలేదు.

పాపాయిని ఒళ్లో కూర్చోబెట్టుకుని, పాలిస్తున్న ఆమెను అడిగాడు

“ఈ మార్పుకు కారణం ఏమిటి?” అని.

సంవత్సరం క్రితం, అమెరికా వెళుతున్నానని తన తల్లి చెప్పిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ సాకేత్‌తో అంది.

“దేవుడు ఎత్తిన అవతారాల గురించి మీకు తెలుసు కదా!

రాముడు తన అవతారం పూర్తికాగానే తనువు చాలిస్తాడు. పరశురాముడు అడవులకు బయలుదేర తాడు. కృష్ణుడు దేహత్యాగానికి పూనుకుంటాడు. మరి అమ్మ అవతారం ఎప్పుడు పూర్తవుతుంది?” అంది సాకేత్‌ని ప్రశ్నిస్తూ.

అతను ప్రశ్నార్థకంగా చూశాడు.

“మాతృమూర్తి అవతారానికి సమాప్తం లేదు. అమ్మ జన్మనిస్తూనే ఉంటుంది.” అంది క్లుప్తంగా

ఆ మాటలకు సాకేత్, ఆమెవంక మురిపెంగా చూశాడు.

“అవును. అమ్మే కనగలదు, అంత గొప్ప అమ్మను” అన్నాడు.. కీర్తన చెయ్యి నొక్కి వదులుతూ. ★

# బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన వీరుడు



**1921 సంవత్సరంలో గాంధీజీ పర్యవేక్షణలో జరుగుతున్న సహాయ నిరాకరణోద్యమంలో దేశంలోని పెద్దలు, స్త్రీలు, పిల్లలూ అందరూ పాల్గొంటున్నారు. ఆ తరుణంలో చంద్రశేఖర్ ఆజాద్ గూడ పాల్గొన్నాడు. అప్పుడు ఆయన వయసు 14 సం.లు. ఉద్యమంలో పాల్గొన్నందుకు పోలీసులు ఆజాద్‌ను అరెస్టు చేశారు. మెజిస్ట్రేటు ముందు హాజరుపర్చారు.**

మెజిస్ట్రేటు చంద్రశేఖర్‌ను 'నీ పేరు ఏమిటి?' అని అడిగాడు.

చంద్రశేఖర్ – 'ఆజాద్' అని సమాధానం చెప్పాడు.

మరల మెజిస్ట్రేటు – 'మీ తండ్రి పేరు ఏమిటి?' అని అడిగాడు కోపంగా.

చంద్రశేఖర్ చిరునవ్వుతో – 'స్వతంత్ర' అని జవాబిచ్చాడు.

మెజిస్ట్రేటు చివరిసారిగా – 'మీదేవూరు?' అని అడిగాడు రౌద్రంతో.

చంద్రశేఖర్ నిర్భయంగా – 'జైలు' అని అన్నాడు.

చంద్రశేఖర్ మాటలను మెజిస్ట్రేటు కోపంతో రెచ్చిపోయి, శేఖర్ చిన్నవాడనీ జాలిదలచకుండా 15 హంటరు దెబ్బలను శిక్షగా విధించాడు. ఆ ప్రాంతంలో శిక్ష అమలుచేస్తే అల్లరి జరుగుతుందని ఆ బ్రిటిష్‌దాసుడైన మెజిస్ట్రేటు కాశీ సెంట్రలు జైలుకు ఆజాద్‌ను పంపాడు. ఆజాద్ హంటరు దెబ్బలను ఎంతటి నిర్లిప్తంగా భరించాడో చూసి కాశీ జైలు అధికారి ఆశ్చర్యపోయాడు. ఆ దెబ్బలు చిన్నారి ఆజాద్ హృదయంలో దావాగ్నిని పుట్టించాయి. బ్రతికున్నా బ్రిటిష్‌వారికి చిక్కనని ప్రతిజ్ఞ చేశాడు. ఇది మహావీర చంద్రశేఖర్ ఆజాద్ జీవిత చరిత్రలో ప్రధాన ఘట్టం.

ఆజాద్ ఒక పేద కుటుంబంలో జన్మించాడు. అతడు కాశీలో చదువుకుంటున్న రోజుల్లో ఒక సత్రంలో మధ్యాహ్నం భోజనం మాత్రం చేసేవాడు. ఇతడు ఆజాద్‌గా పేరుగడించిన తర్వాత శివరామ ప్రసాద్ గుప్త అనే కాంగ్రెసు భక్తుడు ఆజాద్ చదువు సంధ్యలకు సహాయం చేస్తానన్నాడు. కాని ఆత్మాభిమానం గల ఆజాద్ అందుకు అంగీకరించలేదు.

1923 నుండి 1930 వరకు యువకులు విప్లవ పంథాను అనుసరించారు. యువకులందరూ గెరిల్లా పద్ధతిలో విప్లవం నడపటానికి నిర్ణయించుకున్నారు. ఈ విప్లవాన్ని రహస్యంగా నడపటానికి హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ సంస్థను స్థాపించారు. ఈ రహస్య విప్లవంలో పోలీసులను మూడు చెరువుల నీళ్లు త్రాగించి, వారికి చిక్కకుండా తిరిగిన ఖ్యాతి ఒక్క ఆజాద్‌కే దక్కింది. ఈ రహస్య విప్లవం లాహోరు విభాగానికి భగత్‌సింగ్ నిర్వాహకుడు.

1928 పంజాబ్ కేసరి లాలా లాజపతిరాయ్‌పై లాఠీఛార్జీ చేసి ఆయన మృతికి కారణభూతుడైన సాండర్స్‌ను ఒక్క పిస్టల్ దెబ్బతో నరకానికి పంపడానికి వేసిన పథకంలో, అమలులో ఎనలేని ఖ్యాతి ఒక్క ఆజాద్‌కే దక్కింది. బ్రిటిష్ ప్రభుత్వం ఏడేండ్లు కళ్లల్లో ఒత్తులు వేసుకొని ఆజాద్ కోసం వెదికించి, కాని అతడు చిక్కలేదు. అప్పుడు అతని శిరస్సు ఖరీదు లక్షరూపాయలుగా బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించింది.

ఒకరోజు (27.2.1931) ఆజాద్ అల్హాబాద్‌లో ఒక పార్కులో తన స్నేహితునితో మాట్లాడుతుండగా, అతని స్నేహితుడు మరొకడు డబ్బుకు కక్కుర్తి పడి పోలీసు దళాలకు ఆజాద్ ఉనికి చెప్పాడు. నాద్‌వార్ అనే పోలీసు ఆఫీసరు పోరుకు సంసిద్ధంగా లేని ఆజాద్ తొడపై పిస్తోలు పేల్చాడు. అంతే ఆజాద్ పిస్తోలు నుండి గుండు దూసుకొనివెళ్లి ఆ పోలీసు ఆఫీసరు చేయిని ఎగురగొట్టింది. అప్పుడు ఆజాద్ ఒక చెట్టుచాటుకు వెళ్లి రక్షణ పొందాడు. కాని ఎంతసేపు ఆ చెట్టు అతనిని రక్షిస్తుంది!! గుళ్ల దెబ్బలతో అశక్తుడై నేలకొరిగిపోయాడు. ఆ సమయంలో విశ్వేశ్వరసింగ్ అనే పోలీసు ఆజాద్ దగ్గరకు వెళ్లాడు. అంతే ఆజాద్ పిస్తోలు నుండి గుండు దూసుకువెళ్లి ఆ పోలీసు దవడలో గుచ్చుకొని, అతని పళ్లను నేలరాల్చి, అతని ప్రాణాలను అనంత వాయువుల్లోకి పంపింది.

పోలీసులు ఆజాద్ దగ్గరగా వెళ్లకుండా అతనిపై గుళ్లవర్షం కురిపించారు. ఆజాద్ చనిపోయినా అతని దగ్గరకు వెళ్లడానికి భయపడి, అతని శవంమీదే వారి దగ్గరనున్న గుళ్లు అయిపోయేవరకూ కాల్పులు జరిపి, చివరికి ధైర్యం చేసి "ఆజాద్" శవాన్ని బంధించారు. అంతేగాని సజీవంగా వారికి చిక్కలేదు.

**– 29.2.1972, జాగృతి**


ఆర్యాంశ్ శర్మ


సౌరభ్ నేత్రావల్కర్,

# టీ-20 ప్రపంచకప్‌లో భారతీయం!

**భారత్ వేదికగా రెండోసారి జరుగుతున్న ఐసీసీ టీ-20 ప్రపంచకప్‌లో భారత సంతతి క్రికెటర్ల జోరు కొనసాగుతోంది. తలపడుతున్న మొత్తం 20 దేశాల జట్లలో అత్యధికులు భారత ఉపఖండ దేశాల సంతతి క్రీడాకారులే కావడం విశేషం.**

'ఏ దేశమేగినా.. ఎందుకాలిడినా...' అన్న కవి మాటలు భారత క్రికెట్‌కూ అతికినట్లు సరిపోతాయి. ప్రపంచీకరణతో ఆధునిక ప్రపంచ క్రికెట్ మూలవిరాట్టు భారత్ ఆధిపత్యం, జోరు అప్రతిహతంగా కొనసాగుతున్నాయి. భారత్ వేదికగా జరుగుతున్న 2026 ఐసీసీ టీ-20 ప్రపంచకప్ ద్వారా మన క్రికెట్ వ్యవస్థ ఘనత ఏమిటో ప్రపంచానికి తెలిసి వచ్చింది. భారత క్రికెట్టే లేకుంటే ప్రపంచ క్రికెట్టే లేదన్నట్లుగా ప్రస్తుత పరిస్థితి తయారయ్యింది. విశ్వక్రికెట్‌కు అతిపెద్ద మార్కెట్ మాత్రమే కాదు.. అత్యధిక అంతర్జాతీయ క్రికెటర్లను అందించిన ఘనతను సైతం భారత క్రికెట్ వ్యవస్థ దక్కించుకొంది.

**ఏ జట్టును చూసినా...**

భారత్- శ్రీలంక దేశాల సంయుక్త ఆతిథ్యంలో జరుగుతున్న ప్రస్తుత టీ-20 ప్రపంచకప్ గ్రూపులీగ్ దశలో తలపడుతున్న మొత్తం 20 జట్లలో భారత మూలాలు ఉన్న క్రికెటర్లే 40 మంది వరకూ ఉండటం ఓ అరుదైన రికార్డుగా నిలిచిపోతుంది. టెస్టు హోదా పొందిన న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్లలో మాత్రమే కాదు..ఐసీసీ అనుబంధ దేశాలైన అమెరికా, నెదర్లాండ్స్, కెనడా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమాన్ జట్లకు సైతం భారత సంతతి క్రికెటర్లు భారీసంఖ్యలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

**నాలుగుజట్ల తరపున 34 మంది...**

2026 ప్రపంచకప్‌లో పాల్గొంటున్న మొత్తం 300 మంది ఆటగాళ్లలో.. వివిధ జట్లలో సభ్యులుగా 40మంది ప్రాతినిధ్యం వహిస్తుంటే..కేవలం నాలుగు జట్ల తరపున 34 మంది భారత మూలాలు ఉన్న క్రికెటర్లు బరిలో నిలిచారు.

న్యూజిలాండ్ జట్టులో సభ్యులుగా రచిన్ రవీంద్ర, స్పిన్నర్ ఇష్ సోథీ, దక్షిణాఫ్రికా స్పిన్ ఆల్ రౌండర్‌గా కేశవ్ మహరాజ్ తమ ప్రత్యేకతను కాపాడుకొంటూ వస్తున్నారు.

అంతేకాదు.. ఐసీసీ అనుబంధ దేశాలుగా ఉన్న కెనడాజట్టులో 11 మంది, అమెరికా జట్టులో తొమ్మిదిమంది, ఒమాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తరపున ఏడుగురు చొప్పున భారత సంతతి క్రికెటర్లు పాల్గొంటున్నారు. వీరిలో భారత్‌లో క్రికెట్ ఓనమాలు దిద్దుకొని తగిన అవకాశాలు లేక వివిధ కారణాలతో విదేశాలకు వలస వెళ్లిన ఆటగాళ్లే అధికసంఖ్యలో ఉన్నారు.

అమెరికాజట్టులో కీలక ఆటగాళ్లుగా ఉన్న ఫాస్ట్ బౌలర్ సౌరభ్ నేత్రావల్కర్, మిడిలార్డర్ బ్యాటర్‌గా ఉన్న తెలుగుతేజం ముక్కమల్ల సాయితేజ భారత్‌లో తమ ప్రతిభకు సానపెట్టుకొని వెళ్లినవారే. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సౌరవ్ ముంబై మహానగరంలో క్రికెటర్‌గా ఎదిగి ఆ తరువాత వలస వెళ్లి ఏకంగా అమెరికా జాతీయ జట్టులోనే కీలక బౌలర్‌గా నిలువగలిగాడు. నెదర్లాండ్స్‌తో జరిగిన గ్రూప్-ఏ లీగ్ పోటీలో అమెరికా విజయం సాధించడంలో సాయితేజ 79 పరుగుల స్కోరుతో ప్రధానపాత్ర పోషించాడు. అమెరికా జట్టుకు నాయకత్వం వహిస్తున్న మోనాంక్ పటేల్‌తో పాటు మరో ప్రధాన బ్యాటర్ శుభం రంజానే భారత సంతతి క్రికెటర్లే.

కెనడాతో జరిగిన మరో గ్రూప్ లీగ్ పోరులో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తొలివిజయం సాధించడంలో కీలకపాత్ర పోషించిన ఓపెనర్ ఆర్యాంశ్ శర్మ భారత్ నుంచి గల్ఫ్ దేశాలకు వలసవెళ్లిన ఆటగాడే.

కెనడా జట్టులోని ఆటగాళ్లలో జస్‌కరణ్ దీప్ సింగ్, నవనీత్ ధాలివాల్, హర్ష్ థాకర్, రవీంద్రపాల్ సింగ్, కన్వర్పాల్ తద్గుర్, శ్రేయస్ మొవ్వ, అన్ష్ పటేల్, దిల్ ప్రీత్ బజ్వా, యువరాజ్ శర్మ, అజయ్ వీర్‌సింగ్, శివంశర్మ భారత సంతతి క్రికెటర్లుగా ఉన్నారు. అమెరికాజట్టులోని మొత్తం ఆటగాళ్లలో భారత సంతతికి చెందిన మోనాంక్ పటేల్, జెస్సీ సింగ్, మిలింద్ కుమార్, సాయితేజ ముక్కామల, సంజయ్ కృష్ణమూర్తి, హర్మీత్ సింగ్, సౌరవ్ నేత్రవల్కర్, శుభంరంజానే ప్రధాన ఆటగాళ్లుగా ఉన్నారు.

**గల్ఫ్ దేశాల జట్లలోనూ.....**

భారత సంతతి క్రికెటర్లు కేవలం అమెరికా, కెనడా దేశాలకు మాత్రమే పరిమితం కాలేదు. ప్రపంచకప్‌కు అర్హత సాధించిన గల్ఫ్ దేశాలజట్లకు సైతం చెప్పుకోదగిన సంఖ్యలోనే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జతిందర్ సింగ్ నాయకత్వం వహిస్తున్న ఒమాన్ జట్టులో వినాయక్ శుక్లా, మహ్మద్ నదీం, కరణ్ సోనావాలే, అశీశ్ ఒడేద్రా, జితేన్ రామనంది, జె ఒడేద్రా సభ్యులుగా ఉన్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జట్టులోని భారత సంతతి క్రికెటర్లలో ఆర్యాంశ్ శర్మ, ధృవ్ పరాశర్, హర్షిత్ కౌశిక్, మయాంక్ కుమార్, సిమ్రాన్ జిత్ సింగ్, జునైద్ సిద్దిఖీ ప్రధాన ఆటగాళ్లుగా గుర్తింపు పొందారు.

వివిధ దేశాల క్రికెట్ బోర్డులకు మార్గదర్శిగా నిలిచిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పుణ్యమా అంటూ భారత సంతతి క్రికెటర్లతో అంతర్జాతీయ క్రికెట్ సుసంపన్నం కావడం భారత క్రికెట్ వ్యవస్థకే గర్వకారణంగా మిగిలిపోతుంది.



**కృష్ణారావు చొప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# డాక్టర్ జి. వివేకానందవర్మ ఇక లేరు



**భాగ్యనగర్ :** కోనసీమ జిల్లా, అమలాపురం పట్టణంలో 40 సంవత్సరాల పాటు సర్జన్‌గా వైద్యసేవలు అందించి అందరి మన్ననలు పొందిన డాక్టర్ గొట్టుముక్కల వివేకానందవర్మ (83) ఫిబ్రవరి 11న భాగ్యనగర్‌లో స్వర్గస్తులయ్యారు. వైద్యవృత్తిలో ఎంత ఒత్తిడిలో ఉన్నా, అధిక సమయం సంఘ విస్తరణతో బాటు వివిధ క్షేత్ర విస్తరణలో కూడా ఆయన ప్రధాన భూమిక పోషించారు. వీరు బాల్యం నుండి స్వయంసేవకులు. వీరి కుటుంబం సంఘ కుటుంబం. తండ్రి స్వర్గీయ జగన్నాథరాజు. కోనసీమ కార్యవాహగా సైకిల్ మీద పలుగ్రామాలు పర్యటిస్తూ సంఘ విస్తరణకు విశేష కృషి చేసారు. తల్లి సత్యవతమ్మ కూడా సంఘ భావాలతో నిండి ఉండడమే కాకుండా సంఘ, వివిధ ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలలో పాల్గొనే విధంగా కుటుంబాన్ని ప్రోత్సాహించేవారు.

డాక్టర్ వివేకానందకు ఆరుగురు అన్నదమ్ములు, ముగ్గురు సోదరీమణులు. అన్నదమ్ములు అందరూ సంఘపనిలో వివిధ బాధ్యతలలో ఉన్నారు. దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ ప్రముఖ్ భాస్కర్, భాగ్యనగర్‌లోని కూకట్‌పల్లి భాగ్ సంఘచాలక్ సుభాష్‌చంద్ర బోస్ వీరి సోదరులే.

వర్మగారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమార్తెలు డాక్టర్ మాధవి, శారద, కుమారుడు డాక్టర్ రవి విశాఖపట్నంలో ప్రముఖ యురాజలిస్ట్‌గా వైద్య సేవలు అందిస్తున్నారు.

వీరి శ్రీమతి స్వర్గీయ రాజ్యలక్ష్మి కూడా స్వయంగా కరసేవలో పాల్గొన్నారు. వారి గృహాన్ని సంఘ గృహంగా తీర్చిదిద్దారు. వీరు గత కొద్ది కాలంగా అస్వస్థతతో ఉన్నారు. వివేకానందవర్మ జిల్లా సంఘచాలక్‌గా, ప్రాంత విశేష సంపర్క్ ప్రముఖ్‌గా, సక్షమ్ ఆంధ్ర ప్రాంత అధ్యక్షులుగా, విద్యాభారతి మొదలగు అనేక సంస్థలలో పలు బాధ్యతలు నిర్వహించారు. వారి మృతపట్ల పలువురు స్వయంసేవకులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

# హిందూ సమ్మేళనాల నిర్వహణ సమితి సభ్యుల ఆత్మీయ సమావేశం



**అమలాపురం:** కోనసీమ జిల్లాలోని రాజోలు, మలికిపురం ఖండలలో, 12 ఉపమండలాలో హిందూ సమ్మేళనాలు నిర్వహించిన 'నిర్వహణ సమితి సభ్యుల' ఆత్మీయ సమావేశం ఫిబ్రవరి 8న శివకోటి గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళనాలలో పొందిన అనుభవాలను కార్యకర్తలు వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ కార్యకారిణి సభ్యులు యుగంధర్ కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు. నమూనా శాఖను నిర్వహించి, శాఖలో జరిగే వివిధ కార్యక్రమాలను, వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా సంఘచాలక్ గోదసి గంగరాజు, జిల్లా సహసంఘచాలక్ మైలవరపు రవిరామ్, డాక్టర్ నరసింహరాజు, సేవాభారతి పూర్వ అధ్యక్షులు సహ 503మంది పాల్గొన్నారు.



# హిందూ ధర్మాన్ని రక్షించుకుందాం

**- సాధ్వీ ఋతంబర**





**తిరుపతి :** మందిరాలలో భక్తులు సమర్పించే కానుకలు హిందూ ధర్మ పరిరక్షణకు మాత్రమే ఖర్చు చేయాలనీ, మన ధర్మం నుండి దూరమైన వారిని మరల మన గూటికి చేర్చవలసిన అవసరముందనీ ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సాధ్వీఋతంబర అన్నారు.

సంఘశతాబ్ది సందర్భంగా ఫిబ్రవరి 11న తిరుపతి వల్లభాచార్య మఠంలో జరిగిన సంఘ కార్యకర్తల కుటుంబ ప్రబోధన కార్యక్రమంలో సాధ్వి మార్గదర్శనం చేస్తూ మన మధ్యలో వందలాది అడ్డు గోడలు కట్టబడిఉన్నాయి, అయినా హిమాలయం నుండి కన్యాకుమారి వరకు మనందరం ఒక్కటే, అందరం హిందువులమనే భావనతో జీవించాలని అన్నారు. మన హిందూ సిద్ధాంతం ఎంతో గొప్పది. దీపం కోసం వాడే ప్రమిదలు వేరువేరు లోహాలతో లేదా మట్టితో చేసినా, దీపం వెలుగు ఒక్కటే- అనే సిద్ధాంతం మనది. సంత్ నామ్‌దేవ్ ఒకరోజు సిద్ధం చేసుకున్న రొట్టెలను తినబోతున్నారు. ఒక కుక్క రొట్టెను తీసుకొని పారిపోయింది. ఈయన దాని వెంట నేతి గిన్నెతో పరిగెత్తారు. కుక్కను కొట్టడానికి కాదు. రొట్టెకు ఇంకా నెయ్యి పూయలేదు, కుక్క కూడా నెయ్యి పూసిన రొట్టె తినాలని వారి ఉద్దేశం. ఇలా సమస్త జీవరాశులలో పరమాత్మను దర్శించే తత్త్వం మనదని సాధ్వి గుర్తు చేశారు.

ఈ భూమి త్యాగభూమి, ధర్మభూమి. ఇది భోగ భూమికాదు. ప్రతి వస్తువులో భగవంతుడిని చూసే సంస్కృతి మనది. భూమినీ, నీటినీ కలుషితం చేయకూడదు. భూమిలో రసాయనాలను కలిపి నీటిని విషతుల్యం చేయడం తగదు. మనకు విరుద్ధంగా లోకంలో ఎన్నో కుట్రలు, కుతంత్రాలు జరుగుతున్నాయి. వాటిని చూస్తున్నా, వింటున్నా వాటికి దీటుగా ప్రతిస్పందించే స్వభావం మనలో లేదు. ఇది చాలా ప్రమాదకరం. ఈ దేశాన్ని నిందించేవాడు మనకు శత్రువు. సంఘ శతాబ్ది సందర్భంగా కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసే ప్రయత్నం జరుగుతోంది. మన కుటుంబాలను రక్షించుకోవాలి. కలిసిమెలిసి ఉండాలి. మన కుటుంబం నుండి ఏ ఒక్కడు కూడా ఏ విధంగానూ దూరం కాకూడదని అన్నారు.

ధర్మంకోసం పోరాడుతున్న వారి వెంట మనందరం నిలబడి ఈ ధర్మాన్ని రక్షించాలి. తమ సంపాదనలో 10% ధర్మం కోసం వెచ్చించడానికి హిందువులందరూ సంకల్పించాలి. ఈ కార్యక్రమంలో విభాగ్ సంఘ చాలక్ త్యాగరాజన్ రవీంద్రనాథ్, నగర సంఘచాలక్ బాలకృష్ణారెడ్డి, ప్రాంత కార్యకారిణి సభ్యులు యుగంధర్, విభాగ్ సహకార్యవాహ రెడ్డప్ప,విభాగ్ ప్రచారక్ మల్లికార్జున్, విభాగ్ ప్రచారప్రముఖ్ మహేశ్, వీహెచ్‌పీ జాతీయ కార్యవర్గసభ్యులు రాఘవులు తదితరులతోపాటు 400మంది పాల్గొన్నారు.

# సంస్కృతి సంవర్ధిని కరపత్రం ఆవిష్కరణ



**భాగ్యనగర్:** అనేక బస్తీలలో దేశ విచ్ఛిన్నకర శక్తుల కార్యకలాపాలు పెరిగిపోతున్నాయని, వాటినుండి బస్తీవాసులను సంరక్షించడంకోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యా, సంస్కృతి పట్ల చైతన్యం తీసుకొచ్చే పని సంస్కృతి విద్యా ఫౌండేషన్ పని చేస్తుందని అఖిలభారతీయ ధర్మజాగరణ సహప్రముఖ్ ఏలేశ్యాంకుమార్ అన్నారు. సంస్కృతి విద్యా ఫౌండేషన్ భాగ్యనగర్‌లోని సేవాబస్తీలలో ఉచిత బోధన తరగతుల ప్రారంభించారు. ఈ సందర్భంగా కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. శ్యామ్ కుమార్ మాట్లాడుతూ భాగ్య నగరంలో సేవాబస్తీల్లో ఉచిత బోధనతో పాటు భారతీయ సంస్కృతి, క్రమశిక్షణ, దేశభక్తి విలువలు నేర్పుతూ విద్యార్థిని విద్యార్థులలో మార్పును తీసుకొచ్చేందుకు ఈ ఫౌండేషన్స్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర ధర్మజాగరణ ప్రముఖ్ అమరలింగన్న, సేవాభారతి ప్రాంత సంఘటనామంత్రి వాసు, ప్రాంత సేవాప్రముఖ్ శివశంకర్, ధర్మజాగరణ ప్రాంత సంయోజక్ ప్రభురాజ్, ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ సాయినాథ్ పాల్గొన్నారు.

## శివాజీ స్ఫూర్తికేంద్రం ద్వారా వైద్యసేవలు

**శ్రీశైలం :** శివరాత్రి సందర్భంగా శ్రీశైలం దర్శనానికి వచ్చే భక్తులకు శ్రీశివాజీ స్ఫూర్తికేంద్రం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11,12,13 తేదీలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 15 మంది వైద్యుల బృందం ఆరువేలమందికి చికిత్స అందించారు. 13,14,15 తేదీలలో శివభక్తులకు అన్న ప్రసాద వితరణను స్ఫూర్తికేంద్రం నిర్వహించింది



# బాలజాగృతి

## అక్కరకురాని బహుమానం | కథ



అడవికి రాజైన సింహం దగ్గర ఒక ఉడుత సేవకుడిలా ఉండేది. ఏ పని చెప్పినా చిటికెలో చేసేసి రాజు దగ్గర మంచి పేరు సంపాదించుకుంది. ఉడుత పనికి మెచ్చుకుని, సింహం ఒక మంచి బహుమానం ఇస్తానని ప్రకటించింది. "ఏమిటా బహుమానం, మహారాజా?" అని ఆత్రుతగా అడిగింది ఉడుత. "నువ్వు పదవీ విరమణ చేసే సమయానికి నీకు ఓ బండెడు బాదం గింజలు ఇప్పిస్తాను. అదే బహుమానం" అంది సింహం.

బహుమానం తెలుసుకుని ఉడుత మహా సంబరపడిపోయింది. అందరూ ఆహారం కోసం కష్టపడుతున్న సమయంలో తను సుఖంగా ఇంట్లో కూర్చుని హాయిగా జీవితాంతం తింటూ గడపవచ్చని ఆనందించింది. తనంత అదృష్టం ఇంకెవరికి రాదని, మిగతా ఉడుతలు జీవితాంతం కష్టపడినా అన్ని బాదం పప్పులు కూడబెట్ట లేనని అది చాలా సంతోషించింది. రోజూ, తనకు పట్టిన అదృష్టాన్నే తలచుకుంటూ కాలం గడిపేది. అలా అలా కాలం గడిచి, ఉడుత ముసలిది అయింది. ఇక పదవీ విరమణ చేసే సమయం వచ్చింది.

పదవీ విరమణ చేసే రోజున సింహం తనమాట ప్రకారం ఒక బండెడు బాదం గింజలను ఉడుతకు ఇచ్చింది. ఆ ఆహారాన్ని బండినిండా పెట్టుకుని ఇంటికెళ్లిన ఉడుతకు మిగతా ఉడుతలన్నీ స్వాగతం పలికాయి.

స్నానపాదులన్నీ పూర్తి చేసి, ఇక బాదం పప్పులు తిందాం అనే సమయానికి తనకు ముసలితనం వల్ల పళ్లన్నీ ఊడిపోయాయన్న విషయం గుర్తుకొచ్చింది. బాదం గింజలపై ఎంతోకాలంగా ఆశ అడియాశే అయింది. తినే అవకాశం లేక ఎదురుగా నిరుపయోగంగా ఉన్న ఆహారం చూస్తూ చాలా బాధపడింది. ★

### మంచిమాట

**కదలని నీరు స్వచ్ఛతను కోల్పోయినట్లు, బద్ధకం మనిషి మేధస్సును నిస్తేజం చేస్తుంది.**



### మెదడుకు మేత



చుట్టూ ముళ్ల కోట.. లోపల చక్కెర తోట. ఏమిటది?

జవాబు : పనస పండు

### పద్యం



**సద్గోష్ఠి సిరియు నొసగును**
**సద్గోష్ఠియె కీర్తిఁ బెంచు సంతుష్టిని నా**
**సద్గోష్ఠియె యొనగూర్చును**
**సద్గోష్ఠియె పాపములను జంపు కుమారా!**

**భావం :** ఓ కుమారా! సజ్జనులతో సహవాసము, మాట్లాడడం సంపదలను కలిగిస్తాయి. కీర్తిని వృద్ధికి తెస్తుంది. తృప్తిని కలిగిస్తుంది. పాపాలను పోగొడు తుంది. కాబట్టి సజ్జనులతో స్నేహము అవశ్యము చేయతగినది.

### శ్లోకం



**దుర్జనః పరిహర్తవ్యో విద్యయాలంకృతోపిసన్**
**మణినా భూషితస్సర్పః కిమసౌ న భయంకరః**

**భావం :** దుర్జనుడు ఉన్నత విద్యలు కలిగి ఉన్నప్పటికీ విడిచి పెట్టదగినవాడు. పాము పడగ మీద విలువైన మణి ఉన్నప్పటికీ అది భయంకరమైనదే కదా!

### జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న అంకెలు ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| కబడ్డీ | 11 |
| వాలీబాల్ | 7 |
| క్రికెట్ | 5 |
| బాస్కెట్ బాల్ | 1/2 |
| బ్యాడ్మింటన్ | 6 |

సమాధానాలు : కబడ్డీ – 7; వాలీబాల్ – 6; క్రికెట్–11; బాస్కెట్ బాల్–5; బ్యాడ్మింటన్– 1/2.

**సవరణ :** ఫిబ్రవరి 9వ తేదీ సంచిక 'బాలజాగృతి' పద్యం మొదటి పాదంలో 'కార్యమతిభారము....' పదబంధం పొరపాటున 'కార్యమతిభారతము....' అని ప్రచురితమైంది

## శాస్త్రవేత్తలు

### వీరభద్రన్ రామనాథన్



భారత సంతతికి చెందిన ప్రముఖ వాతావరణ శాస్త్రవేత్త. తమిళనాడులోని మదురైలో రామనాథన్ జన్మించారు. భూ విజ్ఞాన శాస్త్రంలో నోబెల్‌గా భావించే క్రాఫోర్డ్ ప్రైజ్ వరించింది. కాలుష్య మేఘాలు, క్లోరోఫ్లోరో కార్బన్ (సీఎఫ్‌సీ)ల వంటి సూపర్ పొల్యూటెంట్లపై దశాబ్దాల పాటు చేసిన పరిశోధనకు ఆయనకు ఈ అవార్డు లభించింది. రామనాథన్ 'నాసా'కు పనిచేస్తున్న సమయంలో కార్బన్‌డయాక్సైడ్ కంటే ఫ్రిడ్జ్‌లు, ఏరోసోల్స్‌లో ఉపయోగించే సీఎఫ్‌సీలే 10 వేల రెట్లు ఎక్కువగా భూ వాతావరణంలో ఉష్ణాన్ని పట్టి ఉంచుతాయని కనుగొన్నారు. దీంతో గ్లోబల్ వార్మింగ్‌కు కార్బన్ డయాక్సైడే ప్రధాన కారణమని అప్పటి వరకూ ఉన్న భావనను ఆయన సమూలంగా మార్చేసినట్లయింది.

## జనరల్ నాలెడ్జ్

1. కంప్యూటర్ కీబోర్డ్ మీద ఉండే బటన్లలో ఏ బటన్ మీద దాని పేరు రాసి ఉండదు?
2. ఒకేసారి రెండు వైపులా చూడగలిగే జీవి ఏది?
3. ఆకాశం నీలం రంగులో కనిపించడానికి కారణం ఏమిటి?

జవాబులు : 1. స్పేస్ బార్; 2. ఊసరవెల్లి; 3. కాంతి పరిక్షేపణం.

## భక్తాగ్రేసరులు

### చైతన్యప్రభువు



చైతన్యప్రభువు కృష్ణభక్తుడు. ఆయన అసలు పేరు విశ్వంభరుడు. ఈశ్వరపురి అనే మహాత్ముడు ఆయనలోని భక్తి పారవశ్యాన్ని గుర్తించి 'దశాక్షర గోపాల' మంత్రం ఉపదేశించి, 'చైతన్య' అని పేరు పెట్టారు. సర్వజీవుల్లో చైతన్యాన్ని జాగృతం చేయగలదని ఆశీర్వదించారు. చైతన్యుడు పూరీ జగన్నాథ నుంచి రామేశ్వరం వరకు శిష్యులతో పాదయాత్ర చేసి కృష్ణభక్తిని ప్రచారం చేశాడు. 'హరేరామ హరేరామ....' మహామంత్రాన్ని లోకానికి ప్రసాదించారు. అది ఇస్కాన్ సంస్థకు మూలమంత్రమైంది. ఆయనను రాధాకృష్ణ అవతారంగా భావించిన భక్తులు 'చైతన్య మహాప్రభువు' అని పిలిచేవారు. ఆరుగురు శిష్యులకు 'గోస్వామి'అని పేరు పెట్టి కృష్ణతత్వ, కృష్ణభక్తి ప్రచారానికి నియమించారు. శివకేశవుల మధ్య నామ భేదమే తప్ప ఇద్దరూ ఒక్కరేనని కాశీ పండిత సభలో నమ్మకం కలిగించారు.




# వారఫలాలు

23 ఫిబ్రవరి-01 మార్చి 2026




సింహంభట్ల సుబ్బారావు

6300674054




**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. దూరపు బంధువులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. దేవాలయాలు సందర్శిస్తారు. కాంట్రాక్టులు దక్కించుకుంటారు. ఇంటి నిర్మాణాలలో అవాంతరాలు తొలగుతాయి. వ్యాపారులకు లాభాలు అందుతాయి. ఉద్యోగులకు బాధ్యతలు తగ్గుతాయి. కళాకారులను విజయాలు వరిస్తాయి. 28, మార్చి 1 తేదీల్లో వ్యయప్రయాసలు. ఆరోగ్యభంగం. నృసింహస్తోత్రాలు పఠించండి.



**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

కొన్ని సమస్యల నుంచి బయటపడతారు. ఆశ్చర్యకరమైన విషయాలు తెలుసుకుంటారు. సమాజసేవలో పాలుపంచుకుంటారు. విద్యార్థులకు అనూహ్యమైన ఫలితాలు. వ్యాపారులకు నూతన పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు ప్రోత్సాహకరం. పారిశ్రామివేత్తలకు ఆశలు ఫలిస్తాయి. రచయితలు, క్రీడాకారులకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 23,24 తేదీల్లో వృథా ఖర్చులు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.



**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

స్వశక్తితో విజయాల బాటలో నడుస్తారు. సమాజంలో పేరుప్రతిష్ఠలు పెరుగుతాయి. పాతబాకీలు కొన్ని వసూలవుతాయి. ఎంతటివారినైనా మాటలతో ఆకట్టుకుంటారు. విద్యార్థులు, నిరుద్యోగులకు ముఖ్య సమాచారం రాగలదు. వ్యాపారులకు పెట్టుబడులు సమకూరి విస్తరిస్తారు. క్రీడాకారులు, రచయితలకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 27,28 తేదీల్లో వృథా ఖర్చులు. స్నేహితులతో కలహాలు. శివాష్టకం పఠించండి.



**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ముఖ్య కార్యక్రమాలలో విజయం. రాబడి ఆశాజనకంగా ఉంటుంది. గృహ నిర్మాణయత్నాలలో పురోగతి ఉంటుంది. విద్యార్థులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు. వ్యాపారులకు ముందడుగు వేస్తారు. ఉద్యోగులకు ప్రోత్సాహకరం, పారిశ్రామిక వేత్తల యత్నాలు సఫలం. రచయితలు, క్రీడా కారులకు నూతనోత్సాహం. 26,27 తేదీల్లో శారీరక రుగ్మతలు. దత్తాత్రేయస్తోత్రాలు పఠించండి.



**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

అదనపు రాబడితో అవసరాలు తీరతాయి. పాత సంఘటనలు గుర్తుకు తెచ్చుకుంటారు. వాహనాలు, భూములు కొంటారు. వ్యాపారులకు ఆటుపోట్లు తొలగుతాయి. ఉద్యోగులకు సంతోషకరమైన సమాచారం. కళా కారులకు కొన్ని సంఘటనలు అనుకూలిస్తాయి. పారిశ్రామికవేత్తలు, క్రీడాకారుల యత్నాలు సఫలం. 24,25 తేదీల్లో వ్యయప్రయాసలు. అన్నపూర్ణాష్టకం పఠించండి.



**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

వాహనాలు, ఇళ్లు కొనుగోలు యత్నాలు సఫలం. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వివాహ, ఉద్యోగ యత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపారులకు భాగస్వాముల నుంచి వివాదాలు పరిష్కారమవుతాయి. ఉద్యోగులకు ఒక సంతోషకర సమాచార అందుతుంది. రాజకీయవేత్తలకు పదవీయోగం. 23,24 తేదీల్లో వ్యయప్రయాసలు. శారీరక రుగ్మతలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.



**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

విద్యార్థులకు ఊహించని విజయాలు. ఆదాయం సంతృప్తి. వాహనాలు, భూములు కొనుగోలు చేసే వీలుంది. నూతన ఉద్యోగప్రాప్తి. సమాజంలో మీకు ఆదరణ. వ్యాపారులు లాభాలు మరింతగా అందుకుంటారు. ఉద్యోగులకు ఉన్నత స్థితి. కళాకారులకు అప్రయత్నంగా అవకాశాలు. రచయితలు, క్రీడాకారులకు సమస్యలు తీరతాయి. 26,27 తేదీల్లో వృథా ఖర్చులు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.



**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

గత సంఘటనలు గుర్తుకు వస్తాయి. రాబడి మెరుగుపడుతుంది. వ్యాపారులకు విస్తరణలో అవాంతరాలు తొలగుతాయి. ఉద్యోగు లకు తగినంత గుర్తింపు. పారిశ్రామిక వేత్తలకు సంతోషకరమైన సమాచారం. రచయితలు, కళాకారులకు ప్రోత్సాహం. 28, మార్చి 1 తేదీల్లో వ్యయ ప్రయాసలు. శారీరక రుగ్మతలు. ఆదిత్య హృదయం పఠించండి.



**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కొత్త కార్యక్రమాలు చేపడతారు. ఆలోచనలు కార్యరూపంలో పెడతారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుంటారు. వ్యాపారులకు అనుకూల పరిస్థితులు. కొత్త పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. రాజకీయ వేత్తలకు కొత్త ఆశలు. క్రీడాకారులు, పరిశోధకులకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 27.28 తేదీలలో ధనవ్యయం. గణేశాష్టకం పఠించండి.



**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

చేపట్టిన కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి. నూతన ఒప్పందాలు చేసుకుంటారు. విద్యార్థుల యత్నాలు సఫలమవుతాయి. తీర్థయాత్రలు చేస్తారు. వ్యాపారులకు లావాదేవీలు ఉత్సాహాన్నిస్తాయి. కళాకారులకు నూతన అవకాశాలు. రచయితలకు సంతోషకరమైన సమాచారం. 24,25 తేదీల్లో ధనవ్యయం. బంధువిరోధాలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.



**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

సోదరులు, సోదరీలతో వివాదాలు సర్దుబాటు చేసుకుంటారు. విద్యార్థులకు శుభవార్తలు. ఇంటి నిర్మాణయత్నాలు ముమ్మరం చేస్తారు. వ్యాపారులకు ఆశించిన లాభాలు తథ్యం. ఉద్యోగులకు విధుల్లో చిక్కులు తొలగి ఊరట చెందుతారు. రాజకీయ వేత్తలకు అనుకూలత. కళాకారులు, పరిశోధకుల నిరీక్షణ ఫలిస్తుంది. 26,27 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. గణేశ్‌స్తోత్రాలు పఠించండి.



**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ముఖ్యమైన కార్యక్రమాలు ముందుకు సాగవు. కష్టమే తప్ప ఫలితం అంతగా కనిపించదు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. స్థిరాస్తి వివాదాలు కాస్త గందరగోళం కలిగించవచ్చు. వ్యాపారులకు కొత్త చిక్కులు. ఉద్యోగులకు బాధ్యతలు మరింత పెరుగుతాయి. రాజకీయవేత్తలకు ఒత్తిడులు. కళాకారులు, క్రీడాకారుల ఆశలు ఫలిస్తాయి. 25,26 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. శివస్తోత్రాలు పఠించండి.

# పదరసం-552

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | ■ | 3 | | 4 | 5 | ■ | 6 |
| 7 | | ■ | 8 | | ■ | 9 | | | |
| | ■ | 10 | | ■ | 11 | | | ■ | |
| ■ | 12 | | ■ | 13 | | | ■ | 14 | |
| 15 | | ■ | 16 | | | ■ | 17 | | ■ |
| | ■ | 18 | ■ | 19 | | 20 | ■ | 21 | |
| | ■ | | ■ | | ■ | 22 | | | ■ |
| | ■ | 23 | | ■ | 24 | | ■ | ■ | 25 |
| ■ | 26 | | ■ | 27 | | ■ | 28 | | |
| 29 | | | ■ | | ■ | 30 | | ■ | |

## ఆధారాలు

**అడ్డం**

1. నమస్కారం, దోసిలి (3)
3. సముదాయం, మిశ్రమం (3)
7. జరిగిపోయిన కాలం (2)
8. అక్కను కొన్ని చోట్ల ఇలానూ అంటారు (2)
9. చివరి వరకు (4)
10. ఒక నక్షత్రం (2)
11. ఇసుక.. (3)
12. రథం (2)
13. దాడిమీ  ఫలం (3)
14. శాంతం, గొప్ప (2)
15. ఆటతో పాటే... (2)
16. మన్మథుని విల్లు .... (3)
17. కారాగారం (2)
19. బకుడు తడబడ్డాడు (3)
21. త్రాసు, ఒక రాశి (2)
22. బ్రహ్మచారి,శిష్యుడు (3)
23. వాస్తవం, సత్యం (2)
24. మాసంలో నాలుగో వంతు (4)
26. పాపాయిని పిలవండి (2)
27. కరం (2)
28. కిరీటం (3)
29. నిరంతరం (3)
30. నీరు తోడే సాధనం (2)

**నిలువు**

1. ఇక్కడ అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శనిట (3)
2. జంట, సావాసం (2)
3. మండూకం (2)
4. తెలంగాణ ఆడపడుచుల పెద్ద పండుగ (4)
5. సంతోషం (3)
6. గురుదక్షిణగా బొటనవేలు ఇచ్చిన వాడు (4)
8.  ఆవిడ మీది కోపం దుత్త మీదనా? (2)
10. చిన్నది, అల్పం (2)
11. జవాను (4)
12. స్పష్టం, స్వచ్ఛం (2)
13. శ్రీకృష్ణుడి సారథి (4)
14. శకుంతల కుమారుడు(4)
15. మహబూబ్‌నగర్‌కు మరోపేరు (4)
18. పిడుగుపాటు (5)
20. యుద్ధం (3)
24. పలుకుల రాణి (2)
25. అడ్డంకి, నిరోధం (3)
26. కొత్త కాదు... (2)
27. సగంలో సగం (2)
28. అభిప్రాయం, ఆశయం (2)

## పదరసం - 551 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 పు | స్తె | ■ | 2 బా | సి | 3 కం | ■ | 4 పి | ద | 5 ప |
| స్త | ■ | 6 ప | ని | ■ | 7 చు | 8 బు | కం | ■ | ద |
| కం | ■ | 9 న్న | స | ■ | ■ | వ్వ | ■ | 10 అ | ర |
| ■ | 11 సిం | గం | ■ | 12 అ | ప్పు | ■ | 13 స | మా | సం |
| 14 దా | హం | ■ | 15 వ | ని | ■ | 16 ర | భ | స | ■ |
| ■ | 17 భ | క్తి | ■ | 18 శం | 19 క | ■ | లు | ■ | 20 వి |
| 21 పొ | ట్ల | ■ | 22 వ | ■ | 23 సి | 24 రి | ■ | 25 మే | క |
| దు | ■ | 26 మా | ల | 27 తి | ■ | 28 పు | రం | ■ | ట |
| 29 పు | 30 కా | రు | ■ | 31 ల | 32 క | లు | ■ | 33 కా | క |
| ■ | 34 రం | తి | ■ | 35 కం | త | ■ | 36 మ | న | వి |




# వినోదాన్ని పంచలేకపోయిన




**కథానాయకుడు విశ్వక్ సేన్ విజయాన్ని అందుకుని చాలా సంవత్సరాలైంది. రకరకాల చిత్రాలను చేస్తున్నా సక్సెస్ మాత్రం దక్కడంలేదు. అలాంటి కష్టకాలంలో అనుదీప్ కె.వి. దర్శకత్వంలో విశ్వక్ సేన్ హీరోగా నిర్మాత సూర్యదేవర నాగవంశీ నిర్మించిన 'ఫంకీ' సినిమా ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 'జాతిరత్నాలు' తర్వాత అనుదీప్ చేస్తున్న స్ట్రయిట్ తెలుగు సినిమా ఇదే కావడంతో దీనిపై ఓ మాదిరి అంచనాలు ఏర్పడ్డాయి. కానీ వాటిని అందుకోవడంలో మేకర్స్ విఫలమయ్యారు.**

కథ విషయానికి వస్తే...కోమల్ (విశ్వక్ సేన్) కొత్త దర్శకుడు. రూ. నాలుగు కోట్లలో సినిమా తీస్తానని ఓ నిర్మాతను ముగ్గులోకి దింపి... ఏకంగా నలభై కోట్లు ఖర్చు పెట్టి స్తాడు. సినిమా పూర్తి కావాలంటే మరో నాలుగు కోట్లు కావాలం టాడు. దాంతో నిర్మాత హార్ట్ అటాక్ వచ్చి, హాస్పిటల్ పాలవు తాడు. తప్పనిసరి పరిస్థితిలో ఆ సినిమాను పూర్తి చేసే బాధ్యతను ఆయన కూతురు చిత్ర (కయాదు లోహర్) స్వీకరిస్తుంది. ఈ సినిమా పూర్తి చేసే క్రమంలో వారు ఎలా ప్రేమలో పడ్డారు? ఆ ప్రేమ పెళ్లికి ఎలా దారి తీసింది? అనేదే క్లయిమాక్స్. నిజం చెప్పాలంటే... ఇందులో సినిమాకు పనికొచ్చే కథ లేదు. పోనీ కథనమైన ఆసక్తికరంగా ఉందా అంటే..అదీ లేదు. ఓ చిన్న పాయింట్‌ను తీసుకుని రెండు గంటల సినిమాగా సాగ దీయడానికి దర్శకుడు అనుదీప్ ప్రయత్నించాడు. దాంతో ప్రారంభం నుండి ముగింపు వరకూ పంచ్ డైలాగ్స్ మీద ఆధారపడ్డాడు. కొన్ని సీన్స్ అయితే... కేవలం ఆ డైలాగ్స్‌ను ఎగ్జిక్యూట్ చేయడానికి రాసుకున్నట్టే అనిపిస్తుంది. తల్లీ కొడుకుల మధ్య చిన్నపాటి సెంటిమెంట్ సీన్‌ను క్లయిమాక్స్‌లో పెట్టారు కానీ అదీ అవుట్ ఆఫ్ ద బాక్స్‌లా అనిపిస్తుంది. హీరో క్యారెక్టరైజేషన్ మరీ దారుణం. తన గురించి తను ఏమనుకుంటున్నాడో ఎవరికీ అర్థం కాదు. కుటుంబం పట్ల అతనికి ఏ మాత్రం బాధ్యత లేనట్టుగా, సినిమాలంటేనే ప్రాణ మన్నట్టుగా చూపించారు. పోనీ ఆ సినిమా మేకింగ్ మీద అయిన పూర్తి స్థాయి అవగాహన, అభిమానం ఉన్నాయా అంటే అదీ లేదు. అక్కడ కూడా నిర్మాత లను హింసించే వాడిగానే చూపించారు. దీనికి పూర్తి భిన్నంగా హీరో పైకి బాధ్యత లేనట్టు కనిపిస్తాడు కానీ అతనికి కుటుంబమంటే ఎంతో ప్రేమ... కానీ బయటకు వ్యక్తం చేయాలంటే అతనికి 'గలీజ్'గా అనిపిస్తుంది అంటూ కవరింగ్ ఒకటి. హీరో తీసే సినిమాను ఎలాగైనా విడుదల కాకుండా చూడాలనుకునే విలన్ లాంటి ఫైనాన్షియర్ పాత్ర అయితే ఇంకా దారుణం. అసలు ఏం చెప్పి దర్శకుడు అనుదీప్ ఈ సినిమా చేయడానికి నిర్మాతను ఒప్పించాడో తెలియదు. కోట్లు ఖర్చు పెట్టి సినిమాలు నిర్మించే వాళ్లు అంత గుడ్డిగా ఎలా నమ్మేస్తారో అర్థం కాదు.

విశ్వక్ సేన్ తనకు ఏ మాత్రం సూట్ కానీ పాత్రలో ఇమడటానికి చాలానే కష్టపడ్డాడు. అదంతా ఫేస్‌లో కనిపిస్తూనే ఉంది. హీరోయిన్ కయాదు లోహర్ 'అల్లూరి' తర్వాత తెలుగులో నటించిన (రెండో) సినిమా ఇది. తన పాత్ర వరకూ బాగానే చేసింది. ఇతర ప్రధాన పాత్రలను నరేశ్, ఈశ్వరీ రావు, అదితి భావరాజు, సంపత్ రాజ్ తదితరులు చేశారు. నిర్మాతలు దిల్ రాజు, సూర్యదేవర నాగవంశీ, హరీశ్ శంకర్, కళ్యాణ్ శంకర్, అనుదీప్ కూడా అక్కడక్కడా అతిథి పాత్రల్లో మెరిశారు. ప్రస్తుతం సినిమా రంగంలో ఉన్న పరిస్థితులను బేస్ చేసుకుని సెటైరికల్ కామెడీగా ఈ సినిమాను తీసేందుకు దర్శకుడు ప్రయత్నించాడు కానీ అది బూమరాంగ్ అయ్యింది. తను నిర్మించింది 'సాగర సంగమం' కాదు... జస్ట్ కామెడీ సినిమా అని విడుదల తర్వాత నిర్మాత నాగవంశీ తన చర్యను సమర్థించుకునే పనిచేశాడు కానీ థియేటర్‌కు వచ్చిన తమకు సినిమా ఆ మాత్రం వినోదాన్ని కూడా ఈ సినిమా ఇవ్వలేకపోయిందని ప్రేక్షకులు పెదవి విరుస్తున్నారు.

ఈ వారాంతంలో దాదాపు పది సినిమాలు విడుదలయ్యాయి. అందులో కాస్తంత క్రేజ్ ఉన్న చిత్రం 'ఫంకీ'నే. అది కాస్తా నిరాశపరచేసరికి అందరూ శనివారం విడుదలైన సినిమాలపై దృష్టి పెట్టారు. ఆ రోజున వచ్చిన వాటిలో 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా యువతను ఆకట్టుకోగా, బంధాలు, బాంధవ్యాల నేపథ్యంలో అర్జున్ తెరకెక్కించిన 'సీతా పయనం'కు మంచి మార్కులే పడ్డాయి. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా విషాదాంతం కావడం డ్రా బ్యాక్ కాగా, 'సీతా పయనం' అందుకు భిన్నంగా తండ్రీ కూతుళ్ల అనుబంధాన్ని తెలియ చేసేదిగా ఉండి పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. సీనియర్ నటుడు అర్జున్ గతంలోనూ కొన్ని సినిమాలను డైరెక్ట్ చేశారు. తాజాగా తన కుమార్తె ఐశ్వర్యను హీరోయిన్‌గా పరిచయం చేస్తూ స్వీయ దర్శకత్వంలో 'సీతాపయనం' నిర్మించారు. ఈ సినిమాతో కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర సోదరుడి కుమారుడు నిరంజన్ హీరోగా పరిచయం అయ్యాడు. అర్జున్‌తో పాటు ఆయన మేనల్లుడు ధ్రువ సర్జా కూడా ఇందులో ఓ కీలక పాత్ర పోషించారు. భారతీయ సంస్కృతిని, ఉమ్మడి కుటుంబంలోని గొప్పతనాన్ని, గోవు ప్రాముఖ్యతను ఈ సినిమా ద్వారా తెలియ చేశాడు. కూతురు పట్ల తండ్రికి ఉండే బాధ్యతను, తండ్రి పట్ల కూతురుకు ఉండే అనురాగాన్ని చక్కగా తెరకెక్కించాడు. మన జీవితంలో తారసపడిన వ్యక్తుల రుణాన్ని తీర్చుకోవాలని, కనీసం వారి పట్ల కృతజ్ఞతతో వ్యవహరించాలనే మంచి విషయాన్ని ప్రేక్షకుల మనసుల్లోకి పంపే ప్రయత్నం చేశారు. కొన్ని సన్నివేశాలు బలవంతంగా చొప్పించి నట్టు ఉండటం, కథనం నిదానం సాగడంతో ఈ సినిమా కూడా ప్రేక్షకుల సహనానికి కొన్ని చోట్ల పరీక్ష పెట్టింది. అయితే సినిమా మాధ్యమం ద్వారా సమా జానికి ఉపయోగపడే అంశాలను చెప్పాలను కోవడం అభినందించదగ్గ విషయం. ఓటీటీలో వచ్చినప్పుడైనా 'సీతాపయనం' సినిమాను వీక్షకులు ఆదరిస్తారేమో చూడాలి.

**– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్**

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు
















వెల : ₹ 250/- | వెల : ₹ 100/- | వెల : ₹ 400/- | వెల : ₹ 300/- | వెల : ₹ 151/-













వెల : ₹ 800/900 : 999/1200 | వెల : ₹ 100/- | వెల : ₹ 150/- | వెల : ₹ 99/-
















వెల:₹ 1598/- సెట్ | వెల:₹ 449/- | వెల :₹ 450/- | వెల : ₹ 400/- | వెల : ₹ 145/-

**పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

**సాహిత్య నికేతన్ :** కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

**సాహిత్య నికేతన్ :** వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

**సాహిత్య నికేతన్ :** ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 19




Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01